www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



10

విశాఖలో పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీ

తల్లిదండ్రులతో కలిసి భూమిపూజ

శుక్రవారం | 8-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 203 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 11.57 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 12.03 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా.4.00-5.35, దుర్ముహూర్తం: ఉ. 8.35-9.20, మ. 12.21-1.06; అమృతఘడియలు: రా. 1.30-3.05; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వైసీపీ సైకో ఫ్యాక్టరీ!



సోషల్ మీడియాలో ఆర్గనైజ్డ్ క్రైమ్

తాడేపల్లిలో మూలాలు.. గ్రామాల దాకా శాఖలు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

కూటమి నేతలు, కుటుంబ సభ్యులే టార్గెట్

కంటెంట్, పోస్టుల సృష్టికి ప్రత్యేక కేంద్రాలు

అక్కడి నుంచి వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌కు

దశల వారీగా గ్రామస్థాయికి చేరే పోస్టులు

సూత్రధారులు, పాత్రధారులను గుర్తించిన పోలీసులు

కఠిన చర్యలతో నెలలోనే కట్టడి చేసేలా ప్రణాళిక

పోక్సో, ఎస్సీ ఎస్టీ, మహిళా చట్టాల కింద కేసులు

15 వేల మందికి 'లుకౌట్' జారీకి రంగం సిద్ధం

సోషల్ సైకోల పని పట్టేందుకు... విషం చిమ్మే సర్పాల కోరలు పీకేందుకు.. 'తాడేపల్లి' మూలాల నుంచి శాఖోపశాఖలుగా విస్తరించిన విషవృక్షాన్ని కూకటి వేళ్లతో పెకలించేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు... ఆ తర్వాతా సోషల్ మీడియా వేదికగా విచ్చలవిడిగా చెలరేగిపోతున్న వారిపై చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లుగా నెలరోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా వైసీపీ సోషల్ మీడియా మూలాలు, విష ప్రచారం సాగించే తీరుపై పకడ్బందీగా వివరాలు సేకరిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా వైసీపీ 'సోషల్' అరాచకాలు సాగించే తీరుపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తారా? సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తారా?' అని జగన్ మూడు రోజులుగా వాపోతున్నారు. కానీ... ఆయన పార్టీ సోషల్ మీడియా చేసేది ప్రశ్నించడం కాదు! కూటమి నేతలపై కాలకూట విషం చిమ్మడం, వారి కుటుంబ సభ్యులను కూడా వదలకుండా నీచమైన ఫొటోలు, వ్యాఖ్యలతో అవమానించడం! ఇదంతా... ఒకరకమైన 'ఆర్గనైజ్డ్ క్రైమ్' తరహాలో జరుగుతోంది. దీనికోసం

మిగతా 12వ పేజీలో...



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నా కుమార్తె కన్నీళ్లు చూసే.. అలా మాట్లాడానమ్మా

నేనూ ఫేక్ న్యూస్ బాధితురాలినే సర్..

డిప్యూటీ సీఎం, హోంమంత్రి మాటామంతీ

మీకూ, మా ఇళ్లలో ఆడవాళ్లకే రక్షణ లేకపోతే ఇక సమాజానికి మనమేం భరోసా ఇస్తాం?

ప్రమాదకరమైన సోషల్ సైకోలను ఉపేక్షిస్తే సమాజాన్ని నాశనం చేస్తారు: పవన్ ఆందోళన

నాపైనా దారుణమైన ట్రోలింగ్స్ చేశారు సర్..

ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే ఊరుకోం

హిందూపురం, కడప, చీరాల, తిరుపతి.. ఎక్కడ ఘటన జరిగినా గంటల్లో అరెస్టు: అనిత

14

వైసీపీ సైకోలకు

వాత ఖాయం

"మదం ఎక్కువై, కొవ్వు పేరుకుపోయి జనం మీద పడుతున్నారు. నాతో సహా మంత్రులు, న్యాయమూర్తులు, వారి కుటుంబసభ్యులపై విచ్చలవిడిగా పోస్టులు పెడుతూ, భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఊరుకోం. ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా వైసీపీ మూకలకు చాలడం లేదు"

– సీఎం చంద్రబాబు

అన్ని చట్టాలనూ పరిశీలిస్తాం.. చట్టపరిధిలోనే కఠిన చర్యలు తీసుకుంటాం

మదం, కొవ్వు ఎక్కువై జనం మీద పడ్డారు.. అంబోతుల్లా ఆడబిడ్డలపై పడితే ఊరుకోను

క్లైమోర్‌మైన్లు పేలినా లెక్కచేయలేదు.. కానీ, నా భార్యపై మాట్లాడితే కన్నీళ్లు పెట్టుకున్నా

భావస్వేచ్ఛ పేరుతో అరాచక పోస్టులా?.. ఇలాంటి వాళ్లను చూస్తూ ఊరుకోవాలా?

పోలీసులపై నేరస్థులు పైచేయి సాధిస్తే జరిగేది ఇదే.. తప్పుడు రాతలు రాస్తే వేటే

రాజకీయాల్లో ఉండకూడని వ్యక్తులు వాళ్లు.. ఒక్క సీటూ గెలవడానికి అర్హులు కాదు

వీరిపై ప్రజలే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.. సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

14

నేనూ సోషల్ సైకోల బాధితురాలినే



వైఎస్ఆర్‌కు పుట్టలేదని నన్ను అవమానించారు

నాపైన, అమ్మ, సునీతలపై విచ్చలవిడిగా పోస్టులు

సైకోలు, సైకో పార్టీలతో కలసి సోషల్ మీడియాను భ్రష్టు పట్టించారు.. మృగాల్లా మారారు

వీరు భయపడేలా చర్యలుండాలి: షర్మిల

ఎలా చేద్దాం?

సోషల్ పోస్టుల కట్టడిపై బాబు, పవన్ చర్చ

కలిసి భోజనం.. గంటపాటు సంభాషణ

మహిళలపై పోస్టులు పెడితే.. సప్తసముద్రాల ఆవల ఉన్నా వదలం

ప్రత్యేక చట్టం తెస్తాం.. నేరస్థులు భయపడి చచ్చేలా చేస్తాం: హోంమంత్రి అనిత

గ్రేట్ ఎస్కేప్!



సినీ ఫక్కీలో వర్రా 'డ్రామా'.. వైసీపీ పోలీసుల సహకారంతోనే పరారీ

రాజంపేట పోలీసుల వైఫల్యం

వర్రాను పట్టుకునే బాధ్యత కానిస్టేబుళ్లకు అప్పగించిన ఎస్ఐ.. ఆయనపై అనుమానాలు

పోలీసులు ఆపినప్పుడు విలేకరినని చెప్పి కారులో ఉడాయించిన రవీంద్రారెడ్డి

తర్వాత వైసీపీ కీలక నేతలతో ఎస్ఐ చర్చలు?

'కూటమి' నేతలు, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో కాలకూట విషం చిమ్మిన వర్రా రవీంద్రారెడ్డి! అతడిపై రాష్ట్రవ్యాప్తంగా అనేక కేసులు! అతడి అరెస్టు కోసం రెండు జిల్లాల పోలీసులు రంగంలోకి దిగారు! డీఐజీ స్వయంగా పర్యవేక్షించారు! వర్రా అరెస్టుకు పకడ్బందీ వ్యూహం రచించారు. అయినప్పటికీ... తప్పించుకున్నాడు! ఇదో గ్రేట్ ఎస్కేప్! దీని వెనుక ఎవరున్నారు? అక్కడేం జరిగింది? 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

(అమరావతి/రాయచోటి/కడప-ఆంధ్రజ్యోతి)

అది... కడప నగరంలోని తాలూకా పోలీసుస్టేషన్. సమయం... మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు. పలువురు ప్రముఖులపై సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు పెట్టిన జగన్ సతీమణి భారతీరెడ్డి పీఏ, ఎంపీ

మిగతా 14వ పేజీలో...



గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సత్కరిస్తున్న దళిత ఎమ్మెల్యేలు

విద్య, ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధితో పాటు వ్యాపార అవకాశాలు కల్పించడం ద్వారా దళితుల సమగ్రాభివృద్ధి సాధ్యం. దీనికోసం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాల్సి ఉంది. పీ4 విధానం ద్వారా ఎస్సీలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చే పథకాలు అమలు చేయడంతో పాటు వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడతాం. - చంద్రబాబు

ఎస్సీ వర్గీకరణపై కమిషన్

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం తర్వాత మరోసారి చర్చించి తుది నిర్ణయం

జనాభా దామాషాన జిల్లా యూనిట్‌గా అమలు

ఎన్నికల మేనిఫెస్టోలోనూ అదే చెప్పాం

దళిత వర్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు భేటీ

హాస్టళ్లు, గురుకులాల్లో వసతులపై హామీ

ఎస్సీలను ఏ, బీ, సీ కేటగిరీలుగా మాత్రమే వర్గీకరించాలని ఎమ్మెల్యేల వినతి

కొత్త సెన్సస్ ప్రకారం అమలు చేస్తాం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుపై కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఇతర రాష్ట్రాల్లో వర్గీకరణ అమలవుతున్న తీరుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కమిషన్‌ను కోరతామని చెప్పారు. గురువారం వెలగపూడి సచివాలయంలో 23 మంది దళిత ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. వర్గీకరణను అమలు చేయడం ద్వారా దళితుల్లోని ఉప కులాల వారందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జనాభా దామాషా ప్రకారం జిల్లా ఒక యూనిట్‌గా వర్గీకరణ అమలు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేశామని, తర్వాత న్యాయ సమస్యలతో అది నిలిచిపోయిందని గుర్తుచేశారు. టీడీపీ మొదటినుంచీ దళితులకు అండగా ఉందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ద్వారా అంటరానితనం వంటి సామాజిక

మిగతా 13వ పేజీలో...



2

మత విశ్వాసులతో కలిసి పనిచేద్దాం

'ఆర్ఎస్ఎస్'లా చొచ్చుకెళదాం

మతంపై మినహాయింపు అవసరం

రాజకీయ ముసాయిదాలో సీపీఎం



2

ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి

లంచాలు

ఇదీ మహారాజులు, నవాబుల బాగోతం.. రాహుల్‌గాంధీ వ్యాసంపై రాజకీయ దుమారం

రాజవంశీయ బీజేపీ నేతల ఫైర్

ఉద్యోగాల భర్తీ నిబంధనలు

మధ్యలో మార్చకూడదు

నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు చట్టబద్ధత ఉంది

జాబితాలో పేరుంటే ఉద్యోగం పొందే హక్కు ఉన్నట్టు కాదు

సహేతుక కారణాలు ఉంటే మాత్రం సవరించుకోవచ్చు

రాజ్యాంగ ధర్మాసనం తీర్పు



న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలైన తరువాత మధ్యలో నిబంధనలు మార్చలేరని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేకంగా అనుమతి ఉంటే తప్ప మధ్యలో నిబంధనలు మార్చేందుకు అవకాశం లేదని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన అయిదుగురు సభ్యుల

మిగతా 2వ పేజీలో...

తాకట్టులో బరమ్ పార్క్

విజయవాడలో ఎస్‌బీఐకి పత్రాలు మార్ట్‌గేజ్

నిధుల కోసం పర్యాటక ఆస్తి తాకట్టు పెట్టేందుకు జగన్ ప్రభుత్వ ఆమోదం

ఇప్పుడు అమలు

గత ఐదేళ్లూ పర్యాటక శాఖకు నిధులివ్వని వైనం

15 పర్యాటక ప్రదేశాల రీ మోడలింగ్‌కు రుణం

పునరాలోచించాలని సర్కారుకు ఉద్యోగుల వినతి

బ్యాంక్ నుంచి రూ.160 కోట్ల రుణం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విజయవాడలోని బరమ్ పార్క్‌ను రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రూ.160 కోట్లకు తాకట్టుపెట్టింది. పర్యాటక ప్రదేశాలను రీ మోడలింగ్ చేసేందుకు నిధుల సేకరణ పేరిట ఆస్తులను తాకట్టు పెట్టేందుకు గత జగన్ ప్రభుత్వం ఆమోదం తెలపగా... తాజాగా కూటమి ప్రభుత్వం దీన్ని అమలు చేసింది. బుధవారం ఏపీటీడీసీ అధికారులు విజయవాడలోని ఎస్‌బీఐకి బరమ్ పార్క్ ఆస్తి పేపర్లను

మిగతా 12వ పేజీలో...

ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్

రూ.5,409 కోట్లతో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు

ఏడాదిలోపు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం

రెండేళ్లలో అమరావతిని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

ఒక్కసారి ఓటేస్తే... కాటేసేందుకు వచ్చిన జగన్

కక్షతో పీపీఏ అగ్రిమెంట్లు రద్దుచేసి ప్రజలపై భారం

తాళ్లాయపాలెం సభలో సీఎం చంద్రబాబు ధ్వజం

గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే కాకుండా వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలన్నింటికీ తగిన విధంగా కరెంటు అందజేస్తా. అందుకోసం రూ.5,409 కోట్లతో ఏడు సబ్ స్టేషన్లను ప్రారంభించా... 14 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశా, 10 ట్రాన్స్‌మిషన్ లైన్లు ప్రారంభించా. ఏడాదిలోపు వాటిని పూర్తిచేసి అందరికీ విద్యుత్ అందజేస్తా.' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజధాని అమరావతిలోని తాళ్లాయపాలెంలో

మిగతా 13వ పేజీలో...

గ్రామీణ వ్యవస్థలు

బలోపేతం

పంచాయతీ నిధుల మళ్లింపు ప్రసక్తేలేదు

త్వరలో 750 కోట్లు విడుదల: డిప్యూటీ సీఎం

12

బొక్కలో ఎవరిని

వేయాలి జగన్!?

'ఆంధ్రజ్యోతి'పై జగన్ ఫేక్ స్టేట్‌మెంట్

కడప ఎస్పీకి భారతి ఫోన్ చేసినట్లు ఫేక్ న్యూస్ ప్రచురించారని అక్కసు

14

రాధాకృష్ణను బొక్కలో వేయాలని డిమాండ్

లేని విషయం ఉన్నట్లు జగన్ వ్యాఖ్యానం



14

మైక్ ఇవ్వని అసెంబ్లీకి వెళ్లం

ఆ పోలీసులను వదలను

ఎల్లకాలం కూటమే ఉంటుందనుకోవద్దు

ప్రైవేటు కేసులు పెడతాం: జగన్

పీజీ ఇన్‌సర్వీస్ కోటా జీవోపై వ్యాజ్యాలు కొట్టివేత

నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటేనే జోక్యం చేసుకుంటాం

జీవో ఇచ్చాకే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది

హైకోర్టు స్పష్టీకరణ

12

ట్రంప్ ప్రచారంలో కీలకంగా భారతీయులు

» పలువురికి పదవులు ఇచ్చే అవకాశం

న్యూఢిల్లీ, నవంబరు 7: డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రెండో సారి గెలవడంలో పలువురు భారతీయులు కీలక పాత్ర పోషించారు. ఈసారి ఎన్నికల్లో సెలబ్రిటీలు, ధనవంతులు ఎక్కువగా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌కే మద్దతు పలికిన నేపథ్యంలో ట్రంప్‌కు ప్రవాస భారతీయుల మద్దతు బాగా కలిసి వచ్చింది. ముఖ్యంగా వివేక్ రామస్వామి లాంటి వారు ట్రంప్‌కు దన్నుగా నిలబడ్డారు. ట్రంప్ గెలిచిన నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో ఆయన కోసం పని చేసిన భారతీయుల్లో కొందరికి పదవులు ఇవ్వొచ్చని ప్రచారం జరుగుతోంది. వారిలో ముఖ్యులు...



వివేక్ రామస్వామి(38): బయోటెక్ వ్యాపారంలో ఉన్నారు. ఆయన మొదట రిపబ్లికన్లలో అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం కోసం ట్రంప్‌పై పోటీ పడ్డారు. ట్రంప్‌కు ప్రధాన పోటీదారుగా నిలిచారు. పార్టీ అభ్యర్థిగా ట్రంప్ పేరు ఖరారైన వెంటనే ఆయనకు గట్టి మద్దతుదారుగా మారారు. నిస్సంకోచంగా మాట్లాడే రామస్వామి వాదనా పటిమ చూసి ట్రంప్ తాను గెలిచిన తర్వాత ఆయనకు మంచి పదవి ఇస్తానని ప్రకటించారు. రామస్వామి సూచనతోనే ప్రపంచ వ్యాప్తంగా హిందువుల గురించి మాట్లాడారని భావిస్తున్నారు.



కశ్యప్ పటేల్(44): ఆఫ్రికా నుంచి అమెరికాకు వలస వచ్చిన గుజరాతీ కుటుంబం. న్యాయశాఖ ఉద్యోగి. 2016 ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై దర్యాప్తు చేసిన అమెరికా ప్రతినిధుల సభ కమిటీ సభ్యుడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా చేపట్టిన ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లలో తెరవెనుక కీలక పాత్ర పోషించారు. ప్రపంచ రాజకీయాల్లో ట్రంప్ ప్రాధాన్యతలు బాగా తెలిసినవాడు. ఆయనకు సీఐఏ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది.



బాబీ జిందాల్(53): లూసియానా రాష్ట్ర గవర్నర్‌గా గతంలో పని చేశారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడుగా కూడా పని చేశారు. 2015లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ పడతానని ప్రకటించి మధ్యలో విరమించుకున్నారు. ఈసారి మొదట్నుంచీ ట్రంప్ మద్దతుగా నిలిచారు. ఆయనకు ఆరోగ్య శాఖ ఇస్తారని ప్రచారం జరుగుతోంది.



నిక్కీ హేలీ(52): ఈమె కూడా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీ పడ్డారు. గత మార్చిలో పోటీ నుంచి విరమించుకొని ట్రంప్‌కు మద్దతు పలికారు. హేలీ సౌత్ కరోలినా రాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. ట్రంప్ ప్రభుత్వంలో అమెరికా తరఫున ఐరాసలో రాయబారిగా పనిచేశారు. పలు వివాదాస్పద నిర్ణయాలకు కేంద్ర బిందువుగా నిలిచారు.



సతీశ్ వేమన(52): నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(తానా) మాజీ అధ్యక్షుడు అయిన సతీశ్ వేమన ట్రంప్ ప్రచార బృందంలో సభ్యుడు. న్యూయార్క్ ట్రంప్ ర్యాలీలో పాల్గొన్న 30 మంది కీలక నేతల్లో ఒకరు. ట్రంప్ విజయంలో రెండు రాష్ట్రాల తెలుగు ప్రవాసులు కీలక పాత్ర పోషించారని సతీశ్ అంటారు. ఉభయ రాష్ట్రాలకు అమెరికా పెట్టుబడులు తేవడానికి కృషి చేస్తామని అన్నారు. ట్రంప్ ఈసారి ఇండియా వచ్చినపుడు హైదరాబాద్ సందర్శించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటమిని అంగీకరిస్తున్నా.. కానీ పోరాటం ఆపను

అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపై కమలా హ్యారిస్

వాషింగ్టన్, నవంబరు 7: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే.. తన పోరాటాన్ని మాత్రం ఆపేది లేదని డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్ అన్నారు. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో పోటీపడిన కమల ఓటమి అనంతరం తొలిసారి స్పందించారు. వాషింగ్టన్ డీసీలోని హోవర్డ్ యూనివర్సిటీలో తన మద్దతుదారులను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 'ఇది మనం కోరుకున్న ఫలితం కాదు. మనం పోరాడింది దీనికోసం కాదు. కానీ.. ఓటమిని అంగీకరించాల్సిందే. అయితే.. ఈ ఎన్నికల్లో పోటీపడిన తీరుపట్ల



గర్వంగా ఉంది. మీరు నాపై ఉంచిన నమ్మకానికి, ఈ దేశం పట్ల చూపించిన ప్రేమకు, సంకల్పానికి నా మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది. అమెరికా ప్రజలందరి స్వేచ్ఛ, న్యాయం, అవకాశాలు,గౌరవం కోసం పోరాటం కొనసాగిస్తాను' అని చెప్పారు. కాగా, కమలా హారిస్.. నిజాయితీ, ధైర్యం, వ్యక్తిత్వం నిండిన గొప్ప ప్రజాసేవకురాలు అని అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ అని కొనియాడారు. అసాధారణ పరిస్థితుల్లోనూ ఆమె చారిత్రక ప్రచారానికి నేతృత్వం వహించారని, అమెరికన్లందరికీ చాంపియన్‌గా నిలుస్తారని పేర్కొన్నారు.

ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు

ఫిలడెల్ఫియా, షికాగోలో ట్రంప్ విజయంపట్ల పలువురు నిరసన తెలుపుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. మహిళల పునరుత్పత్తి హక్కులు, ట్రాన్స్‌జెండర్ల హక్కులు, తుపాకీ చట్టాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ స్క్వేర్ వద్ద ఓ మహిళ 'ఫిలడెల్ఫియాలో ఫాసిజాన్ని స్వాగతించేది లేదు' అనే ప్లకార్డుతో నిరసన తెలిపారు.

ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

పలు దేశాధినేతలతో ట్రంప్‌నకు సన్నిహిత సంబంధాలు.. తొలి వరుసలో మోదీ

» ఇజ్రాయెల్, సౌదీలకు సానుకూలం
» కిమ్‌తో ఆత్మీయ సంబంధం
» ఉక్రెయిన్‌కు, ఇరాన్‌కు కష్టకాలం
» ఇకపై చైనా వ్యాపారానికి అడ్డంకులు

న్యూఢిల్లీ, నవంబరు 7: నాలుగేళ్ల తర్వాత శ్వేతసౌధంలోకి డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షుడిగా అడుగు పెట్టబోతున్నారు. ప్రపంచ దేశాలతో అగ్రరాజ్యం సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి? ట్రంప్ రాక ఎవరికి అనుకూలం.. ఎవరికి వ్యతిరేకం? గతంలో ప్రపంచ నేతలతో ఆయన సంబంధాలు ఎలా నెరిపారు? ఇప్పుడు ఎలా ఉండబోతున్నారు? ఆయన తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికవ్వడంతో భారత్‌తో పాటు మరికొన్ని దేశాలు గెలిచినట్లే అని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్‌లో ఇతర దేశాలతో అమెరికా సంబంధాలు, ఆయా దేశాలకు ప్రయోజనాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై అంచనా వేస్తున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, సౌదీ అరేబియా ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ లాంటి వారితో సత్సంబంధాల కారణంగా వారితో సున్నితంగానే వ్యవహరిస్తారని, అలాగే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు లాంటి వారికి మద్దతుగాను ఉంటారని భావిస్తున్నారు. ట్రంప్ గెలుపు నేపథ్యంలో సానుకూలమయ్యే, కష్టకాలం ఎదుర్కొనే దేశాధినేతలను ఓ సారి చూస్తే..

నరేంద్ర మోదీ (భారత ప్రధాని): గతంలో ట్రంప్‌తో ఉన్న సంబంధాల పరంగా ఇప్పుడు ఆయన గెలుపు నరేంద్ర మోదీకి సానుకూలమైన విషయం. అప్పట్లో ఒకర్ని ఒకరు బహిరంగంగానే పొగడ్తల్లో ముంచెత్తుకునేవారు. చాలా ఏళ్లుగా వ్యక్తిగతంగా సంబంధాలు కూడా కొనసాగిస్తున్నారు. ట్రంప్ పాలసీల కారణంగా లాభపడే దేశాల జాబితాలో భారత్ అనుకూలమైన స్థానంలోనే ఉండవచ్చు. ఇంధన, రక్షణ రంగాల్లో భారత్‌కు రష్యా ఓ ప్రధాన భాగస్వామి. ఇక రష్యాతో శాంతి ఒప్పందానికి మొగ్గు చూపే ట్రంప్.. భారత్, రష్యా సంబంధాలకు అడ్డు చెప్పకపోవచ్చు.



గతంలో మోదీ.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలిస్తే జో బైడెన్ సర్కార్‌కు రుచించలేదు. మరోవైపు భారత్‌పై కెనడా చేస్తున్న ఆరోపణలకు కూడా ట్రంప్ మద్దతు ఉండకపోవచ్చు.

జిన్‌పింగ్ (చైనా అధ్యక్షుడు): ట్రంప్ విజయంతో చైనాకు ఆర్థికంగా కష్టకాలం మొదలైనట్లే. చైనా వస్తువులపై 60% టారిఫ్ విధిస్తామనే అంశం ఆ దేశ ఎకానమీకి పెద్ద దెబ్బ. అయితే సానుకూల అంశం ఏమిటంటే.. చైనాతో ఎలాన్ మస్క్‌కు గట్టి వ్యాపార సంబంధాలు ఉండటం. కానీ తైవాన్‌కు బాసటగా ఉండే విషయానికి వస్తే.. ఇది అమెరికా, చైనా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది.

మహమ్మద్ బిన్ సల్మాన్ (సౌదీ అరేబియా ప్రిన్స్): అమెరికాతో రక్షణ ఒప్పందం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఈయనకు ఇదో మంచి అవకాశం. ఇజ్రాయెల్ ఇతర అరబ్ దేశాల మధ్య అబ్రహం ఒప్పందాల విషయంలో కీలకపాత్ర పోషించిన ట్రంప్.. ఈ ఒప్పందాలలోకి సౌదీ అరేబియాను కూడా చేర్చే విషయంలో దృష్టి పెట్టే అవకాశం ఉంది.

బెంజమిన్ నెతన్యాహు (ఇజ్రాయెల్ ప్రధాని): జో బైడెన్‌తో సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఇప్పుడు నెతన్యాహుకు శ్వేతసౌధం నుంచి స్వాగతం లభించవచ్చు. యుద్ధ బరిలో ఉన్న ఇజ్రాయెల్‌కు ఇకపై అమెరికా సహాయ సహకారాలు కొనసాగే అవకాశం ఉంది.

వ్లాదిమిర్ పుతిన్ (రష్యా అధ్యక్షుడు): ట్రంప్‌ది 'అమెరికా ఫస్ట్' పాలసీ కావడంతో నాటోలో చీలికలు వస్తాయని, ఉక్రెయిన్‌కు సహకారం ఆగిపోతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తిరిగి రావడం పుతిన్‌కు అనుకూల అంశంగా మారే అవకాశం ఉంది.

కిమ్ జోంగ్ ఉన్ (ఉత్తర కొరియా అధినేత): గతంలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నపుడు ఉత్తరాలు రాసుకోవడం, సదస్సులు నిర్వహించడం ద్వారా ఇద్దరు నేతలు ఆత్మీయ సంబంధాలు నెరిపారు. ఉత్తర కొరియా అణ్వాస్త్రాల కార్యక్రమాలకు కూడా ఎలాంటి అడ్డు చెప్పలేదు. వీరి సంబంధాల్లో భాగంగా అప్పట్లో దక్షిణ కొరియాతో ద్వైపాక్షిక మిలిటరీ విన్యాసాలను కూడా అమెరికా తగ్గించేసింది. ఇప్పుడు దక్షిణ కొరియా, జపాన్‌లకు అమెరికా మిలిటరీ సహకారం తగ్గిపోతుందని కిమ్ భావిస్తున్నారు.

వ్లాదిమిర్ జెలెన్‌స్కీ (ఉక్రెయిన్ అధ్యక్షుడు): ట్రంప్ గెలుపు ఎవరికి పెద్ద దెబ్బ అని చెప్పాలంటే.. అది జెలెన్‌స్కీకి అని చెప్పక తప్పదు. రష్యాతో శాంతి చర్చల్లో భాగంగా అమెరికా తమపై ఆంక్షలు పెట్టవచ్చని, అలాగే ఆర్థిక, సైనిక సహకారం తగ్గించవచ్చని ఉక్రెయిన్ భయపడుతోంది. ఇది రష్యాకు అనుకూలంగా మారి తమ భూభాగాన్ని సొంతం చేసుకోవచ్చనే భయం జెలెన్‌స్కీని వెంటాడుతోంది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా బైడెన్ ఉండగా.. 24 గంటల్లో యుద్ధాన్ని నిలువరిస్తానని ట్రంప్ హామీ ఇవ్వడం ఆయన ప్రాధాన్యతలను సూచిస్తోంది.

మసౌద్ పెజెష్కియాన్ (ఇరాన్ అధ్యక్షుడు): తమ అణు కార్యక్రమాలను దౌత్యపరంగా అమెరికా అణగదొక్కుతుందని ఇరాన్ భయపడుతోంది. ఇజ్రాయెల్‌తో స్నేహసంబంధాల కారణంగా మొదటి టర్మ్‌లో ట్రంప్ ఇరాన్‌పై సాధ్యమైనంత ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు ఆంక్షలను మరింత పెంచడం ద్వారా ఇరాన్‌ను ట్రంప్ ఒంటరి చేసే అవకాశం ఉంది.

లోకం తీరు



ట్రంప్ విజయంతో 'బంగ్లా'లో మారుతున్న సమీకరణాలు

» తనను బంగ్లా ప్రధానిగా పేర్కొంటూ ట్రంప్‌కు హసీనా లేఖ



న్యూఢిల్లీ, నవంబరు 7: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో బంగ్లాదేశ్‌లో సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. విద్యార్థి సంఘాలు చేపట్టిన రిజర్వేషన్ల వ్యతిరేక పోరు హింసాత్మకంగా మారడంతో బలవంతంగా గద్దె దిగి ఆగస్టులో భారత్ చేరుకున్న షేక్ హసీనా మరోసారి తెరపైకి రానున్నారు. ట్రంప్‌ను అభినందిస్తూ ఆమె లేఖ రాశారు. లేఖలో తనను తాను బంగ్లాదేశ్ ప్రధా నిగా ప్రకటించుకున్న హసీనా.. ట్రంప్ నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. ట్రంప్ నేతృత్వంలో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గతంలో ట్రంప్‌తో జరిగిన సమావేశాలను ఆమె గుర్తు చేశారు. రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని లేఖలో ప్రస్తావించారు. హసీనా రాసిన ఈ లేఖను ఆమె పార్టీ అవామీ లీగ్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసింది. హసీనా తనను ఇప్పటికీ ప్రధానిగానే ప్రకటించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బైడెన్ పాలనా యంత్రాంగం కుట్ర వల్లే తాను బంగ్లాను వీడాల్సి వచ్చిందని హసీనా గతంలో అనేకసార్లు ఆరోపించారు. మరోవైపు.. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో షేక్ హసీనాకు అనుకూలంగా విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆమె తిరిగి బంగ్లాదేశ్ రావాలంటూ ఛాత్రా లీగ్ విద్యార్థులు నినాదాలు చేశారు. ఛాత్రా లీగ్ అనేది అవామీ లీగ్ అనుబంధ విద్యార్థి సంఘం.



ఏఐతో రూపొందించిన 'లాయర్'తో మాట్లాడుతున్న సీజేఐ చంద్రచూడ్

కృత్రిమ మేధ లాయర్‌తో సీజేఐ!

» పరీక్షించిన జస్టిస్ చంద్రచూడ్
» మరణశిక్ష భారత్‌లో రాజ్యాంగబద్ధమేనంటూ జవాబు

న్యూఢిల్లీ, నవంబరు 7: కోర్టు హాలులో న్యాయవాదుల వాదనల్లోని మంచిచెడులను బేరీజు వేసే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్.. ఈసారి ఓ కృత్రిమమేధ(ఏఐ)తో కూడిన లాయర్ వాదనలను పరీక్షించారు. గురువారం ఢిల్లీలో 'నేషనల్ జ్యుడీషియల్ మ్యూజియం, ఆర్కైవ్స్' ప్రారంభోత్సవ కార్యక్రమం దీనికి వేదికగా నిలిచింది. ఈ మ్యూజియంను ప్రారంభించిన సందర్భంగా.. కృత్రిమమేధతో రూపొందించిన లాయర్‌తో సీజేఐ మాటలు కలిపారు. 'భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమేనా?' అని ప్రశ్నించారు. దీనికి ఆ 'న్యాయవాది' సమాధానం చెబుతూ.. 'భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమే. అత్యంత దారుణమైన నేరాలకు సంబంధించిన అరుదైన కేసుల్లో సుప్రీంకోర్టు మరణశిక్ష విధిస్తుంది' అని చెప్పారు. ఈ జవాబు విని సీజేఐ చిరునవ్వుతో తలపంకించారు. జస్టిస్ చంద్రచూడ్‌ను పోలిన విధంగానే సదరు కృత్రిమమేధ లాయర్‌ను రూపొందించటం విశేషం. మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు పాటించే విలువలను ప్రతిబింబించే విధంగా మ్యూజియం ఉందని ప్రశంసించారు. కాగా, జ్యుడీషియల్ మ్యూజియం ఏర్పాటుపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అసంతృప్తితో ఉంది. మ్యూజియం బదులు, ఆ ప్రదేశంలో న్యాయవాదుల కోసం ఒక లైబ్రరీని, కెఫెటేరియాను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. కానీ, సీజేఐ అందుకు అంగీకరించలేదు. మరోవైపు, కొత్త సీజేఐగా సంజీవ్‌ఖన్నా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి లంచాలు

ఇదీ మహారాజులు, నవాబుల బాగోతం

» రాహుల్‌గాంధీ వ్యాసంపై రాజకీయ దుమారం
» మండిపడిన రాజవంశీయ బీజేపీ నేతలు

న్యూఢిల్లీ/ముంబై, నవంబరు7: విధేయులైన మహారాజులు, నవాబులకు లంచాలు ఇవ్వడం, వారిపై బెదిరింపులకు పాల్పడటం ద్వారా ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశాన్ని అణచివేసిందంటూ కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ రాసిన వ్యాసం రాజకీయదుమారం రేపింది. ఈ వ్యాసం బుధవారం ఓ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైంది. దీన్ని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా సహా రాజకుటుంబాలకు చెందిన బీజేపీనేతలు తీవ్రంగా ఖండించారు. విద్వేషాన్ని ప్రేరేపించేవారికి దేశగౌరవం, చరిత్ర గురించి ఉపన్యాసాలు ఇచ్చే హక్కులేదని సింధియా మండిపడ్డారు. నాటి రాజుల త్యాగాలతోనే సమగ్ర భారతదేశం కల నెరవేరిందని రాజస్థాన్ ఉపముఖ్యమంత్రి దివ్యకుమారి 'ఎక్స్'లో స్పష్టంచేశారు. భారత దేశం కోసం నాటి రాజ కుటుంబాలు చేసిన త్యాగాలపై రాహుల్‌గాంధీలోని అజ్ఞానం ఆ వ్యాసం ద్వారా బట్టబయలైందని లోక్‌సభ సభ్యుడు యదువీర్ వడియార్ 'ఎక్స్'లో విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిర్ధారణకు రావొద్దని రాహుల్‌కు బీజేపీ హితవు పలికింది. రాహుల్ వ్యాసం చదివితే నవ్వొస్తోందని కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీ పేర్కొన్నారు. కాగా ఈస్టిండియా కంపెనీకి సింధియా రాజులు మద్దతిచ్చిన విషయం అందరికీ తెలుసని కాంగ్రెస్ మీడియా-పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు పవన్‌ఖేరా ఎద్దేవా చేశారు. బీజేపీనేతల విమర్శలపై రాహుల్ స్పందించారు. వ్యాపారాలను తాను వ్యతిరేకిస్తున్నట్టు బీజేపీనేతలు ప్రచారం చేస్తున్నారని, తాను గుత్తాధిపత్యానికి మాత్రమే వ్యతిరేకమని 'ఎక్స్'లో స్పష్టంచేశారు. కాగా రాజ్యాంగాన్ని కాపాడాలంటూ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రాహుల్‌గాంధీ నిర్వహించిన సభపై బీజేపీ మండిపడింది. ఆ సభలో కేవలం తెల్లపేపర్లతో కూడిన రాజ్యాంగం కాపీలను రాహుల్ పంపిణీ చేశారంటూ విమర్శించింది.

ఇజ్రాయెల్ దాడులు.. లెబనాన్‌లో 40 మంది మృతి

బీరుట్, నవంబరు 7: ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో 40 మంది పాలస్తీనీయులు మృతిచెందినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. బుధవారం బెకా లోయలోని బాల్బెక్‌లో ఈ దాడులు జరిగాయని, 40 మంది మృతిచెందగా.. 53 మంది క్షతగాత్రులైనట్లు తెలిపింది. గత ఏడాది కాలంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల కారణంగా 3 వేల మంది పౌరులు మృతిచెందారని హిజ్బుల్లా చీఫ్ నయీం ఖాసీం అల్-జదీద్ టీవీకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.



బెంగళూరు కాఫీ షాప్‌లో రిషి సునక్

బెంగళూరు పర్యటనకు వచ్చిన బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్.. జయనగర్ ప్రాంతంలోని కాఫీషాప్‌లో సరదాగా గడిపారు. భార్య అక్షతా మూర్తితో పాటు రిషి సునక్ థర్డ్‌వేవ్ కెఫెకు వచ్చారు. కాఫీతో పాటు పలు ఆహార పదార్థాల రుచి చూశారు. అరగంటకు పైగా కెఫేలో ఉన్న ఆయనతో అక్కడి సిబ్బంది, పలువురు సెల్ఫీలు తీసుకున్నారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి

ఉండవల్లికి పెన్‌డ్రైవ్‌లో వివరాలు ఇవ్వండి

» మార్గదర్శి కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో హైకోర్టు గురువారం కీలక ఆదేశాలు ఇచ్చింది. డిపాజిటర్ల (ఇన్వెస్టర్స్) వివరాలను ఎలక్ట్రానిక్ రూపంలో పెన్‌డ్రైవ్ ద్వారా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌కు అందజేయాలని ఆదేశించింది. ఆర్బీఐ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించినట్టు నమోదైన కేసుపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం విచారణ జరిపింది. పెన్‌డ్రైవ్ ద్వారా సమాచారం ఇవ్వాలన్న ఉండవల్లి వినతిని మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వ్యతిరేకించారు. ఆ వివరాలన్నీ భౌతికంగా 56 వేల పేజీలు పుస్తకాల రూపంలో ఆయన వద్ద ఇప్పటికే ఉన్నాయని తెలిపారు. మళ్లీ ఎందుకని ప్రశ్నించారు. తన వాదనకు మద్దతుగా 'రేఖా మురర్కా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. కోర్టుకు ప్రత్యక్షంగా హాజరైన ఉండవల్లి వాదనలు వినిపిస్తూ తన పోరాటానికి 18 ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. లూథ్రా మార్గదర్శి కోసం పోరాడుతుంటే తాను ప్రజలు, చట్టం కోసం పోరాడుతున్నానని వ్యాఖ్యానించారు. రామోజీరావు వంటి పెద్ద మనిషితో పోరాడటానికి ఎవరూ ముందుకు రాలేదని అన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పెన్‌డ్రైవ్‌లో ఉండవల్లికి డిపాజిటర్ల వివరాలు డిసెంబర్ 15లోగా ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసు కోసం తప్ప మరే రకంగానూ ఉండవల్లి వాటిని ఉపయోగించుకోకూడదని స్పష్టం చేసింది. లూథ్రా ప్రస్తావించిన తీర్పుపై స్పందిస్తూ అది క్రిమినల్ కేసు విచారణదని, దీంతో సంబంధం లేదని తెలిపింది. ఈ కేసుకు సంబంధించి డిసెంబర్ 20లోగా ఉత్తరప్రత్యుత్తరాలు (కౌంటర్‌లు, రిప్లైలు) పూర్తికావాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సూచించింది. డిసెంబర్ 20 తర్వాత ఏ పత్రాలను రికార్డుల్లోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. విచారణను వచ్చే ఏడాది జనవరి 3కు వాయిదా వేసింది.

మత విశ్వాసులతో కలిసి పనిచేద్దాం

» 'ఆర్‌ఎస్‌ఎస్'లా వారిలోకి మనమూ చొచ్చుకెళదాం
» రాజకీయ ముసాయిదా పత్రంలో ప్రతిపాదించిన సీపీఎం నాయకత్వం

న్యూఢిల్లీ, నవంబరు 7: కమ్యూనిస్టులు అంటేనే మత భావనలకు వ్యతిరేకంగా హేతుబద్ధ వైఖరిని అనుసరించేవారని అర్థం. అయితే, మతం విషయంలో కొన్ని మినహాయింపులతో తన రాజకీయ తీర్మాన ముసాయిదా పత్రాన్ని సీపీఐ (ఎం) అగ్రనాయకత్వం సిద్ధం చేసింది. మత ఆచరణ కలిగినవారితోనూ కలిసి పనిచేయాలనీ, వారిని క్రమంగా పార్టీ నిర్మాణంలోకి తెచ్చుకోవాలంటూ.. తొలిసారి తన రాజకీయ వైఖరిలో స్పష్టమైన మార్పును ప్రదర్శించింది. మతం విషయంలో.. కాంగ్రెస్ సహా బీజేపీయేతర పార్టీలకు తాను భిన్నమనేది వివరించేందుకు ఈ పత్రంలో ప్రయత్నించింది. అదే సమయంలో సోషలిజం సాధనను, వామపక్షాల ఐక్యతను ఇప్పటికీ అత్యవసరంగా సాధించాల్సిన ఆదర్శ లక్ష్యాలుగా స్పష్టం చేసింది. వచ్చే ఏడాది జరిగే 24వ మహాసభల (కాంగ్రెస్) కోసం ఇలాంటి అంశాలతో రాజకీయ ముసాయిదా పత్రాన్ని ఆ పార్టీ రూపొందించింది. "మతాన్ని సూత్రప్రాయంగా వ్యతిరేకించడం కమ్యూనిస్టు భావజాలంలోని ఒక ముఖ్యమైన భాగం. అయితే, ఇక్కడ ఒక మినహాయింపు అవసరమని భావిస్తున్నాం. మతవిశ్వాసాలు కలిగినవారితో కలిసి పనిచేస్తూ, వారిని పార్టీ వైపు తీసుకురావడం అవసరం" అని ఆ పత్రంలో పేర్కొంది. మత విశ్వాసుల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆర్‌ఎస్‌ఎస్ గట్టి పట్టు సాధించి, వారిని ఉపయోగించుకుని సమాజాన్ని కొత్త తరహా మతతత్వంతో నింపడంలో మంచి ఫలితాలను సాధించగలిగిందని ఆ పార్టీ విశ్లేషించింది. రాజకీయంగా పార్టీ విస్తరణ లక్ష్యాల కోసం ఆర్‌ఎస్‌ఎస్ మాదిరిగానే.. వారితో కలగలిసి పోవాలని ప్రతిపాదించింది.

పాతవి లేవు.. కొత్తవి రావు

» ఆర్టీసీ విలీనం తర్వాత ఉద్యోగులకు ఇబ్బందులు
» పీఆర్సీ ఆలస్యం.. తక్షణమే ఐఆర్ ప్రకటించండి: ఎన్‌ఎంయూఏ

విజయవాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రభుత్వరంగ సంస్థగా ఉన్నప్పుడు ఉద్యోగులకు అమలైన పథకాలను కొనసాగిస్తూనే.. విలీనం తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను కూడా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి కోరారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) కోరుకున్నట్టుగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో గుర్తింపు ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం గురువారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 123 డిపోల నుంచి వందల సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో అప్పట్లో సాధించుకున్న పథకాలు ఒక్కొక్కటీ దూరమయ్యాయని చెప్పారు. ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు మాట్లాడుతూ విలీనం తర్వాత ఈహెచ్‌ఎస్‌తో ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి పాత విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ అమలులో ఆరు నెలల జాప్యం జరిగిందని, అందువల్ల తక్షణం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు, పెన్షనర్లకు పరిమితిలేని వైద్య సదుపాయాలను పునరుద్ధరించాలన్నారు. గత టీడీపీ హయాంలోని 1/2018 ఉత్తర్వులను యథావిధిగా అమలు చేయాలని కోరారు. ఏటా 2వేల కొత్త ఆర్టీసీ బస్సులు కొనేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ నైట్ అవుట్ అలవెన్సులను ఎరియర్స్‌తోసహా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీలో అన్ని కేటగిరీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, గ్యారేజీల సమస్యలు, నాన్ ఆపరేషనల్ యూనిట్లలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ పురుషోత్తంనాయుడు, పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ నిబంధనలు మధ్యలో మార్చకూడదు

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఉద్యోగాలు భర్తీ నిబంధనలు పారదర్శకంగా, నిజాయతీగా, సమానత్వ హక్కు గురించి వివరించే రాజ్యాంగంలోని 14వ అధికరణానికి అనుగుణంగా ఉండాలని ఏకగ్రీవంగా తెలిపింది. ధర్మాసనం తరఫున జస్టిస్ మిశ్ర తీర్పును చదివారు. ఆట మధ్యలో రూల్స్ మార్చకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉద్యోగాల ప్రకటన జారీ చేసినప్పటి నుంచే నియామక ప్రక్రియ మొదలవుతుందని, పోస్టుల భర్తీతో ముగుస్తుందని తెలిపింది. తగిన అనుమతి ఉంటే తప్ప నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఉద్యోగాల అర్హతలను మార్చకూడదని పేర్కొంది. ఆ నిబంధనలకు చట్టబద్ధత ఉందని, వాటిని పాటించాల్సిన బాధ్యత నియామక సంస్థలపై ఉందని తెలిపింది. అదే సమయంలో సెలక్ట్ లిస్టులో పేరున్నంత మాత్రాన ఉద్యోగం పొందేందుకు తిరుగులేని హక్కు ఉన్నట్టు కాదని స్పష్టం చేసింది. సహేతుక కారణాలు ఉంటే ఆ పోస్టును



భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. ఆ కారణాలను వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొంది. ఒకవేళ పోస్టులు ఖాళీగా ఉంటే సెలెక్ట్ లిస్టులో చోటు దక్కించుకున్న అభ్యర్థులకు ఉద్యోగాలను నిరాకరించి, ఏకపక్షంగా వ్యవహరించకూడదని వివరణ ఇచ్చింది. తగిన కారణాలు, అనుమతుల మేరకు మధ్యలో నిబంధనలు మార్చినా అవి పరీక్షలు నిర్వహించేవారికి, పేపర్లు దిద్దేవారికి, ఇంటర్వ్యూలు జరిపే వారికి ఆశ్చర్యం కలిగించేవిగా ఉండకూడదని స్పష్టంచేసింది.

ఏమిటీ కేసు?

రాజస్థాన్ హైకోర్టులో 13 అనువాదకుల పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. తొలుత రాత పరీక్ష ఉంటుందని అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా నియామక ప్రక్రియ ముగుస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆ పరీక్షకు 21 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అందులో మూడు ఉద్యోగాలకు ముగ్గురిని ఎంపిక చేశారు. కనీసం 75% మార్కులు సాధించిన అభ్యర్థులనే ఉద్యోగాలకు ఎంపిక చేశామని హైకోర్టు తన ప్రకటనలో స్పష్టంచేసింది. నోటిఫికేషన్‌లో 75% మార్కులు తప్పనిసరి అనే విషయాన్ని ప్రస్తావించలేదని, నిబంధనలు సవరించి ఆ తర్వాత ఆ ముగ్గురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని మిగిలిన అభ్యర్థులు ఆరోపించారు. తమకు అన్యాయం జరిగిందంటూ మరో ముగ్గురు అభ్యర్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. 2010 మార్చిలో ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. 2008లో కె మంజుశ్రీ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించారు. నిబంధనలను మధ్యలో మార్చలేరంటూ ఆ కేసులో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ఇదే సమయంలో హరియాణాకు చెందిన మరో కేసులో తగినంత మంది అర్హులు లేనప్పుడు పరీక్షను రద్దు చేయవచ్చన్న తీర్పు కూడా ఉంది. ఈ సమస్యను ప్రస్తుతం రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించింది. నిబంధనలను మధ్యలో మార్చుకూడదని చెబుతునే తగిన సహేతుక కారణాలు, అనుమతులు ఉంటే సవరించుకోవచ్చని తెలిపింది. ఈ తీర్పు నేపథ్యంలోనే రాజస్థాన్ హైకోర్టులోని పోస్టుల భర్తీపై మరో ధర్మాసనంలో విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.



ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేశ్

దేశానికే తలమానికంగా ఏపీ విద్యా విధానం

- వికసిత్ భారత్ స్ఫూర్తితో వికసిత్ ఆంధ్రప్రదేశ్
- మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్

తుళ్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం దేశానికే తలమానికంగా ఉండే విధంగా మార్పులు తీసుకువస్తామని మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాజధాని అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో గురువారం ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 50కి పైగా ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఇందులో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లోకేశ్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ప్రధాని పిలుపు మేరకు వికసిత్ భారత్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. దీనిలో భాగంగానే అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. వీఐటీ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

వెరీ'గుడ్డు' అయితేనే..

- విద్యార్థులకు, గర్భిణులకు అందించే గుడ్లపై కొత్త నిబంధనలు
- పరిమాణం, నాణ్యత పక్కాగా ఉండాలి
- గుడ్డు బరువు 50 గ్రాములు తగ్గితే వెనక్కి
- సరఫరా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్
- సకాలంలో ఇవ్వకపోతే జరిమానా, బ్లాక్‌లిస్ట్
- గత ప్రభుత్వంలో భారీగా అక్రమాలు
- వాటికి చెక్ పెట్టిన కూటమి ప్రభుత్వం



అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులకు అందించే గుడ్లలోనూ గత వైసీపీ ప్రభుత్వం అక్రమాలు, అవినీతికి పాల్పడింది. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పరిమాణంలో చిన్నవి, పాడైన గుడ్లు సరఫరా చేశారు. కాంట్రాక్టును టెండర్ల ద్వారా కాకుండా కేవలం కొనసాగింపుతో వందల కోట్ల రూపాయలు అడ్డగోలుగా దోచిపెట్టారు. దీనికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. పరిమాణం, నాణ్యత విషయంలో కొత్త నిబంధనలు రూపొందించింది. వీటితోనే గుడ్లకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ టెండర్లు పిలిచింది. ప్రస్తుతం గుడ్డు బరువు 50 గ్రాములు తగ్గకూడదు అనే నిబంధన ఉన్నా, తూకం వేసి తీసుకునే విధానం లేదు. ఇకపై ట్రేలు వారీగా పాఠశాలల్లో తూకం వేసిన తర్వాతే దిగుమతి చేయాలని నిబంధన పెట్టారు. చిన్న గుడ్లు ఉంటే వెంటనే వెనక్కి పంపే వెసులుబాటు కల్పించారు. అలాగే కొత్తగా థర్డ్ పార్టీ చెకింగ్ విధానాన్ని తీసుకొస్తున్నారు. నాణ్యతపై లేబొరేటరీల్లో పరీక్షలు చేస్తారు. ఎన్ఏబీఎల్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోయినా, నిర్దేశిత సమయంలో గుడ్లు సరఫరా చేయకపోయినా జరిమానా విధించనున్నారు. మొదటిసారి ఆలస్యానికి సరఫరా చేసే గుడ్ల విలువలో ఒక శాతం, రెండోసారి ఆలస్యానికి 5 శాతం, మూడోసారి ఆలస్యానికి 10 శాతం జరిమానా విధిస్తారు. నాలుగోసారి కాంట్రాక్టు సంస్థపై అనర్హత వేటు వేసి, బ్లాక్ లిస్టులో పెడతారు. అలాగే గుడ్లు సరఫరా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉండాలనే నిబంధన పెట్టారు. గోడౌన్లలో బయలుదేరిన వాహనాలు నిర్దేశిత సమయంలో పాఠశాలలు, అంగన్‌వాడీలకు చేరుకుంటేనే గుడ్లను తీసుకుంటారు. గతంలో రవాణా ఖర్చు తగ్గించుకునేందుకు కాంట్రాక్టర్లు పాఠశాలలకు ఒకేసారి ఎక్కువ మొత్తంలో గుడ్లు దిగుమతి చేసేవారు. దీంతో ఎక్కువకాలం బడుల్లో నిల్వ ఉంటున్న గుడ్లు పాడైపోతున్నాయి. దానిని నివారించేందుకు ఇకపై ఒక వారానికి అవసరమైన మేరకు మాత్రమే సరఫరా చేయాలని నిబంధన పెట్టారు. ఒకవేళ ఒక వారంలో పంపిన గుడ్లు శుక్రవారానికి మిగిలితే వాటిని వెనక్కి పంపుతారు. నిబంధనల ప్రకారం గుడ్లపై వారానికో రంగులో స్టాంపులు లేకపోయినా జరిమానాలు విధిస్తారు.

కాంట్రాక్టుల కోసం పేర్లు మార్చుకుని..

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 అక్టోబరులోనే కాంట్రాక్టు ముగిసినా అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పాత వారికే కాంట్రాక్టులు కొనసాగించారు. వారికి బిల్లులు ఇవ్వకుండా గత ప్రభుత్వం బకాయిలు పెట్టింది. బకాయిలు ఇవ్వకపోతే గుడ్లు సరఫరా చేయబోం అంటూ మొదట్లో కూటమి ప్రభుత్వాన్ని కాంట్రాక్టర్లు బ్లాక్‌మెయిల్ చేశారు. అయితే ఇప్పుడు మళ్లీ కాంట్రాక్టు దక్కించుకునేందుకు వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నారు. రావులపాలేనికి చెందిన ఓ సంస్థ గతంలో చిక్కీలు సరఫరా చేయగా, ఇప్పుడు వేరే పేరుతో గుడ్లు కాంట్రాక్టు కోసం టెండరు దాఖలు చేసింది. శ్రీకాకుళంలోని ఓ వైసీపీ నేతకు చెందిన పౌల్ట్రీ, అనంతపురంలో ఓ మాజీ మంత్రి అనుచరుడి సంస్థ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని కంపెనీలు అప్పట్లో అక్రమాలకు పాల్పడి.. ఇప్పుడు మళ్లీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు సిద్ధమయ్యాయి. బిల్లులు చెల్లించకపోతే గుడ్లు ఆపేస్తామని బ్లాక్‌మెయిల్ చేసినవారిలో వీరూ ఉండటం కొసమెరుపు.

వశిష్ఠ గోదావరిలో కాలుష్యంపై ఎన్జీటీ ఆందోళన

- తదుపరి చర్యల కోసం సంయుక్త కమిటీ ఏర్పాటు
- రెండు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని వశిష్ఠ గోదావరి నదిలో కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆందోళన వ్యక్తం చేసింది. కోస్టల్ కారిడార్ నిబంధనలకు విరుద్ధంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం వద్ద గోదావరి తీరంలో వ్యర్థాలు కలుస్తున్నాయని, వరద వచ్చినప్పుడల్లా అందులోని వ్యర్థాలు తీరానికి చేరుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎన్జీటీలో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌ను జస్టిస్ సుధీర్ అగర్వాల్, అఫ్రోజ్ అహ్మద్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌కు జతచేసిన ఫొటోలు చూసి ఆందోళన వ్యక్తం చేసిన ధర్మాసనం.. ఈ విషయంలో తదుపరి చర్య తీసుకునే ముందు సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ.. పశ్చిమగోదావరి జిల్లా మేజిస్ట్రేట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) అందులో సభ్యులుగా ఉంటారని పేర్కొంది. సమన్వయం కోసం నోడల్ అథారిటీగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వ్యవహరిస్తుందని స్పష్టం చేసింది. రెండు నెలల్లో చెన్నైలోని దక్షిణ జోనల్ బెంచ్‌కు నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్

- మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీల్లో గుట్టురట్టు
- 1000 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు స్వాధీనం, రైస్ మిల్లులు సీజ్

నరసరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పేదల బియ్యం పెద్దఎత్తున బ్లాక్ మార్కెట్ జరుగుతోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా గురువారం జరిపిన ఆకస్మిక తనిఖీల్లో బ్లాక్ మార్కెట్ గుట్టురట్టయింది. వెయ్యి మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అక్రమ నిల్వలు వెలుగుచూశాయి. ఈ తనిఖీల్లో కొన్ని నెలలుగా అక్రమార్కులు రైస్ మిల్లులు లీజుకు తీసుకొని బియ్యం బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్నట్టు వెల్లడైంది. కొందరు అధికారుల సహాయ సహకారాలు అందిస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. మంత్రి తనిఖీలు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాయి. ఒకే మిల్లులో వందలాది బస్తాల రేషన్ బియ్యం గోతాలు ఉన్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నేరుగా రైస్ మిల్లులకు బియ్యం నిల్వలు తరలిస్తున్నట్టు గుర్తించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏడు చోట్ల రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. వెయ్యి మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. మిల్లుల నిర్వాహకులపై మంత్రి ఆదేశాల మేరకు అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రామలింగేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లులో మనోహర్ తనిఖీ చేశారు. ఈ మిల్లులో వందలకొద్దీ రైస్ బ్యాగుల్లో ప్రభుత్వ చౌక ధరల బియ్యం నిల్వలను గుర్తించారు. ఈ మిల్లులో దాదాపు 100 టన్నుల రేషన్ స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని సీతారామాంజనేయ సాయి, గణేష్ రైస్ మిల్ ఫ్లోర్ మిల్, శ్రీదేవి ట్రేడర్స్, రావు రైస్ మిల్ ఫ్లోర్ మిల్, సత్తెనపల్లి మండలంలోని కొమరపూడి గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లును కూడా మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత బియ్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వారిని కఠినంగా శిక్షిస్తామని మనోహర్ హెచ్చరించారు.



సత్తెనపల్లిలోని సీతారామాంజనేయ సాయి రైస్ మిల్లులో ప్రభుత్వం సరఫరా చేసిన గోతాలను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

త్వరలో సీసీఐ కేంద్రాలు తెరుస్తాం

- అచ్చెన్నాయుడు

తాటికొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీసీఐ కేంద్రాలు త్వరలో తెరవనున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాటికొండ మండలం లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ముంబైకి చెందిన సీసీఐ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పత్తి కొనుగోళ్లపై చర్చిస్తామని తెలిపారు. రైతులు కూడా సీసీఐ నిబంధనలకు లోబడి తేమ శాతం తక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్లు అందుబాటులో ఉంచేందుకు సుమారు 40 వేల డ్రోన్లను సమకూర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా కాంగ్రెస్ లాంతర్ల ర్యాలీ



లాంతరు చేతపట్టి ర్యాలీగా వెళ్తున్న షర్మిల

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి విజయవాడలో లాంతర్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. గవర్నరుపేటలోని ఆంధ్రరత్న భవన్ నుంచి చల్లపల్లి బంగ్లా వరకు సాగిన ఈ ర్యాలీలో ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి పలక్‌వర్మ, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రజలపై భారం మోపొద్దని నినాదాలు చేశారు. ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

15 నుంచి 17 వరకు వీవీఐటీ బాలోత్సవ్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 15 నుంచి 17 వరకు ప్రసిద్ధిగాంచిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024ను నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. బాలోత్సవ్ సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన ప్రచార ప్రతులను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు వీవీఐటీ బాలోత్సవ్ ఒక మంచి వేదికని, వారిలోని ఒత్తిడిని దూరం చేసి ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలగచేయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. 2017 నుంచి నిర్వహిస్తున్న వీవీఐటీ బాలోత్సవ్‌లో పాల్గొనే విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం రెట్టింపు అవుతోందని చెప్పారు. బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కండె గిరిబాబు మాట్లాడుతూ మూడు రోజులపాటు 20 అంశాలు 60 విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.బిఏఎల్‌ఓటిఎస్‌ఎవి.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న ఎంట్రీ ఫారాలను పూర్తిచేసి పోస్టు ద్వారా పంపవచ్చని, లేదా వెబ్‌సైట్‌లోని గూగుల్ ఫారంను పూర్తిచేసి అప్ లోడ్ చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బాలోత్సవ్ సంధానకర్త బి.జగదీష్‌ను 7386225336 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ముగ్గురు టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణం

తిరుమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మరో ముగ్గురు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ముని కోటేశ్వరరావు, సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డితో శ్రీవారి ఆలయంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం భానుప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 2019-24 మధ్య తిరుమల క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చారని ఆరోపించారు. ఆలయం ముందు రాజకీయ ప్రసంగాలు చేయడం మంచిది కాదన్నారు. తిరుమలలో స్వామి దర్శనం తర్వాత ఇతరులు నాశనం అవ్వాలనేలా మాట్లాడారని, భవిష్యత్‌లో ఎవరూ కొండపై రాజకీయ ప్రసంగాలు చేయకూడదన్నారు. అలాకాదని ప్రసంగాలకు పూనుకుంటే కేసులు నమోదు చేసేలా ధర్మకర్తల మండలిలో కఠినమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. తిరుమల శేషాచల అడవుల్లో కనుమరుగవుతున్న ఎర్రచందనం పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పాటుపడతామన్నారు. అలాగే పార్వేట మండపాన్ని పునర్నిస్తామన్నారు. అలిపిరిలోని పాదాల మండపంతో పాటు కొన్ని ప్రాచీనమైన మండపాలను ఆర్కియాలజీ విభాగం సలహాలతో పరిరక్షిస్తామని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు.

అగ్రిగోల్డ్ ముసుగులో 130కి పైగా కంపెనీలు

- 32 లక్షల మంది నుంచి రూ.6,380 కోట్లు సేకరణ
- నాంపల్లి కోర్టులో ఈడీ అనుబంధ ఛార్జిషీట్

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నాంపల్లి ఎంఎస్‌జే ప్రత్యేక కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అగ్రిగోల్డ్ ముసుగులో 130కన్నా ఎక్కువ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆకర్షణీయమైన పథకాల పేరుతో 32 లక్షలకన్నా ఎక్కువ మంది పెట్టుబడిదారుల నుంచి రూ. 6380 కోట్లు సేకరించినట్లు తేలింది. తాజాగా అగ్రిగోల్డ్ ఎగ్జిమ్స్, అమృతవర్షిణి డైరీ ఫామ్స్ కేసుల్లో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఇన్ఫోటెక్, మాతాంగి ఇన్‌ఫ్రా వెంచర్స్ శక్తి టింబర్ ఎస్టేట్స్, అవ్వా సీతారామారావు, అవ్వా వెంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, శాంక్చురీ హోమ్స్‌లపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, అండమాన్ సహా పలు రాష్ట్రాల్లో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. రియల్ ఎస్టేట్ పెట్టుబడి పేరుతో సుమారు 32 లక్షల మంది ఖాతాదారుల నుంచి డిపాజిట్లు సేకరించి మోసం చేసినట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఈడీ ఇప్పటికే అగ్రిగోల్డ్ సంస్థలకు చెందిన రూ. 1414.33 కోట్లు అటాచ్ చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

370పై సభాసమరం

జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో గురువారం యుద్ధవాతావరణం కనిపించింది. ఆర్టికల్ 370 పునరుద్ధరించాలంటూ ఇంజనీర్ రషీద్ సోదరుడు, అవామీ ఇత్తెహాద్ పార్టీ ఏకైక ఎమ్మెల్యే ఖుర్షీద్ షేక్ ప్లకార్డు ప్రదర్శించినందుకు బీజేపీ ఎమ్మెల్యేలకు ఆగ్రహం కలిగింది. ఎమ్మెల్యేలు పరస్పరం దాడి చేసుకుంటున్న దృశ్యాలు మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ఐదేళ్ళక్రితం కేంద్రం తొలగించిన 370, 32 (ఏ)లను తిరిగి ఇచ్చేయాలంటూ పీడీపీ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టబోవడం, బీజేపీ అడ్డు పడటం, నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ జాతివ్యతిరేకశక్తులతో, ఉగ్రవాదులతో చేయికలిపారంటూ ఆ పార్టీ విమర్శలు చేయడం తెలిసిందే. రెండురోజులుగా జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ప్రత్యేక ప్రతిపత్తి అంశం ఘర్షణకూ, గందరగోళానికీ కారణమవుతోంది. అటు కేంద్రానికి ఆగ్రహం కలగకుండా, ఇటు కశ్మీరీల అనుగ్రహం కోల్పోకుండా ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం సాధ్యమైనంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది.

మీరు లాక్కున్న హక్కులనూ అధికారాలను తిరిగి ఇవ్వండి అని కనీసం ప్లకార్డు ప్రదర్శించే హక్కు కూడా సభలో ఓ ఎమ్మెల్యేకు ఉండదా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఆర్టికల్ 370 ముగిసిన చరిత్ర అని ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రకటించినందువల్ల కాబోలు, దాని ఊసెత్తడమే దేశద్రోహమన్న స్థాయిలో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ప్లకార్డు ప్రదర్శనమీద వారు అభ్యంతరం వ్యక్తంచేయడంతో సరిపెట్టకుండా లాక్కోవడం, చించివేయడం మరింత గందరగోళానికి దారితీసింది. నిజానికి, బుధవారం నాటి తీర్మానం బీజేపీ సభ్యులను అప్పటికే బాగా వేడెక్కించింది. ఆ చర్యను విమర్శించేందుకు, ఖండించేందుకు గురువారం చేసిన ఓ ప్రయత్నానికి మిగతాపార్టీలు అడ్డుతగలడం దానికి మరింత కోపం తెప్పించింది.

నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్–ఆమ్ ఆద్మీపార్టీ సంయుక్తంగా బుధవారం ప్రవేశపెట్టిన తీర్మానం ప్రత్యేకప్రతిపత్తిని పునరుద్ధరించాలని కోరిందే తప్ప ఆర్టికల్ 370 ప్రస్తావన చేయలేదు. వీసమెత్తు ప్రయోజనం లేని ఈ తీర్మానం ద్వారా కశ్మీరీ ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షలనూ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం బలి పెట్టిందనీ, ఢిల్లీకి దాసోహపడిందనీ లోయలోని మిగతా పార్టీలు ఘాటుగా విమర్శించాయి. కానీ, తీర్మానంలో 370 అన్నపదాన్ని వాడకపోవడం ద్వారా అటు కేంద్రంతో ఘర్షణపడినట్టుగా కనిపించకుండా ఒమర్ ప్రభుత్వం జాగ్రత్తపడింది, తెలివిగా వ్యవహరించింది. మరోపక్క ప్రత్యేకప్రతిపత్తిని అభ్యర్థించడం ద్వారా ఎన్నికల ప్రచారంలో తాను ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా అడుగులు వేసినట్టూ అయింది. పైగా, రాష్ట్రహోదా గురించి పోటు పడతామని మాత్రమే ప్రజలకు హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఆప్‌లను ఈ తీర్మానంలో తనతో కలుపుకోగలిగింది. ఆర్టికల్ 370 ఊసెత్తనప్పుడు ఆ తీర్మానాన్ని బలపరచడంలో తప్పేముందని ఆ పార్టీలు అనగలిగాయి. ప్రత్యేకప్రతిపత్తి, ఇతర రాజ్యాంగబద్ధమైన హామీలు కల్పించే విషయంలో కొత్తగా ఎన్నికైన జమ్మూకశ్మీర్ ప్రజాప్రతినిధులతో కేంద్రం చర్చలు ఆరంభించాలని ఆ తీర్మానం కోరింది. అలనాటి 370 రద్దు నిర్ణయాన్ని తప్పుబట్టకుండా, ఇప్పుడు ఆ సంఖ్యను ప్రస్తావించకుండా తీర్మానం చేయడం వల్ల ఏ ప్రయోజనమూ లేదని పీడీపీ వాదించడం, నచ్చినవిధంగా ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ఆ తరువాత కొందరు ప్రయత్నించడం తెలిసినవే. ఒక అర్ధరాత్రి, సమస్త సేనలనూ మోహరించి, రాష్ట్రానికి దశాబ్దాలుగా ఉన్న హక్కులన్నీ రద్దుచేసి, దానిని స్వాధీనం చేసుకొని రెండుగా విడగొట్టిన కేంద్రప్రభుత్వం, ఆ తరువాత ఐదేళ్ళుగా ఎవరితోనూ ఒక్కముక్కకూడా మాట్లాడని కేంద్రాన్ని ఇప్పుడు చర్చలకు ఉపక్రమించమని ఒమర్ ప్రభుత్వం సవినయంగా ప్రార్థిస్తోందని పీడీపీ విమర్శిస్తోంది. అయితే, ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎంతో సున్నితంగా నడిపిందని, అనవసర రాద్ధాంతం కాక, ఆచరణాత్మకంగా వ్యవహరించిందని మెచ్చుకుంటున్నవారు లేకపోలేదు. ఆర్టికల్ 370 ప్రస్తావన చేయకపోవడం ద్వారా కేంద్రాన్ని కూడా ఒమర్ మంచి చేసుకున్నారని వారి అభిప్రాయం. 2019 ఆగస్టు 5 అనంతర వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా ఈ పరిణామం ఉన్నదని బీజేపీ నాయకుడు అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల్లో ఒక వ్యాఖ్య చేశారు. కానీ, ప్రత్యేకప్రతిపత్తి ఊసెత్తితే సహించబోమన్నది స్థానిక బీజేపీ నాయకులు హెచ్చరిక.

విద్యుత్ చార్జీల పాపం జగన్‌దే!

బిల్లులు కట్టలేక ఇంట్లో దీపం వెలగని పరిస్థితి ఎక్కడా అంటే అది ఆంధ్రప్రదేశ్‌లో 2019–2024 మధ్యకాలంలో అని చిన్న పిల్లవాడిని అడిగినా చెపుతారు. అసలు బిల్లు మూరెడైతే కొసరు బిల్లు బారెడు ఉండేది. విద్యుత్ చార్జీలపై వైసీపీ నేతలు అలవోకగా అబద్ధాలు వల్లెవేస్తున్నారు. మాటల గారడీతో ప్రజలను బురిడీ కొట్టించే కుట్రలు చేస్తున్నారు. జగన్‌రెడ్డి చేసిన పాపాలు రాష్ట్ర ప్రజలను వైసీపీ ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయిన తరువాత కూడా పట్టిపీడిస్తున్నాయి. గతకాలపు నేరాలు విద్యుత్ వినియోగదారులను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి.

2022–23లో అధిక ధరకు బహిరంగ మార్కెట్లో ఎడాపెడా విద్యుత్ కొనడంతో రూ.6,072.86 కోట్ల అదనపు చార్జీల భారాన్ని ప్రజలు మోయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈఆర్సీ తాజాగా చేసిన ప్రతిపాదన పాపం జగన్‌దే. తల్లికి, చెల్లికి అన్యాయం చేసినట్టు 5 ఏళ్ళు ప్రజలకు అన్యాయం చేశారు. 2022–23లో విద్యుత్ కొనుగోలు భారంతో ఇప్పుడు చార్జీలు పెంచేలా ఈఆర్సీ ప్రతిపాదించింది. ఈ ప్రాసెస్ అంతా జరిగింది వైసీపీ హయాంలోనే అనే విషయం జగన్ తెలివిగా మర్చిపోయారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదించిన వీటీపీఎస్, కృష్ణపట్నం మూడో యూనిట్ థర్మల్ విద్యుత్ కేంద్రాలను జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో డిస్కంలు బహిరంగ మార్కెట్లో అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేశాయి.



రాష్ట్రంలో ఉన్న మూడు డిస్కంల పరిధిలో 1.52 కోట్ల గృహ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. పేదలు, సామాన్యులు, మధ్యతరగతి అన్న విచక్షణ లేకుండా వైకాపా ప్రభుత్వం వారికి షాక్‌లు ఇచ్చింది. 2019లో అధికారంలోకి రాగానే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. బహిరంగ మార్కెట్‌లో కమిషన్ల కోసం అధిక రేట్లకు జగన్ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు చేసింది. 2022–23 జగన్ ప్రభుత్వ బకాయిలే రూ.6072.86 కోట్లు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన పాపాలే ఇప్పుడు జనం మెడకు చుట్టుకుంటున్నాయి. జగన్ హయాంలోనే వసూలుకు డిస్కంలు అనుమతి కోరినా నిర్ణయాన్ని వాయిదా వేస్తూ తెలివిగా కాలయాపన చేశారు.

జగన్‌రెడ్డి తన అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ప్రజల సొమ్మును అస్మదీయులకు దోచిపెట్టారు. విద్యుత్ రంగాన్ని భ్రష్టుపట్టించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పీపీఏ విధానాన్ని అధికారంలోకి రాగానే రద్దు చేయడమే కాక, జగన్‌రెడ్డి హయాంలో విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ఎక్కడా పారదర్శకతలేదు. వైసీపీ అనుసరించిన విద్యుత్ విధానాల వల్లే ప్రజల మెడలకు సర్దుబాటు చార్జీలు చుట్టుకున్నాయి. ఆయన హయాంలోనే తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెరిగాయి. గత ప్రభుత్వ హయాంలో వసూలు చేయాల్సిన సర్దుబాటు చార్జీలను వాయిదా వేస్తూ, చివరికి ఈఆర్సీ కాలపరిమితి ముగుస్తుందనగా, సర్దుబాటు చార్జీల వసూలుపై ప్రభుత్వం ఇప్పుడు నిర్ణయం తీసుకుంది.

2022–23 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదిత ఎఫ్‌పీపీసీఏ ఆధారంగా యూనిట్‌కు అదనంగా రూ.1.27 చార్జీ విధించాలని డిస్కమ్‌లు ఆ రోజే అడిగాయి. ఎఫ్‌పీపీసీఏ ద్వారా విద్యుత్ కొనుగోలు ఖర్చులను తగ్గించేందుకు నాడు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనకు ఏపీఈఆర్సీ 2023 లోనే సమీక్ష అనంతరం ఆమోదం తెలిపింది. ప్రజలపై రూ.6,072.86 కోట్ల భారం మోపండని 2023లో ఈఆర్సీకి చెప్పింది జగన్ ప్రభుత్వమే. ఎన్నికల ఏడాది కూడా చార్జీలు పెంచితే ప్రజలు తరిమికొడతారని వైసీపీ ప్రభుత్వంలో వడ్డించాల్సిన చార్జీలను వాయిదా వేసారు. ఆ కారణంగా ఆ మొత్తం భారం కూటమి ప్రభుత్వంలో కట్టాల్సి వస్తోంది.

బినామీ కంపెనీల నుంచి అధిక ధరలకు జగన్‌రెడ్డి విద్యుత్ కొనుగోలు చేసారు. మార్కెట్‌లో యూనిట్ రూ.3–4కి దొరుకుతుంటే, యూనిట్ రూ.12 పెట్టి మరీ తమ బినామీల నుంచి విద్యుత్ కొని దోచుకున్నారు. కేవలం విద్యుత్ కొనుగోళ్లు మాత్రమే కాకుండా బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం అంతా కూడా రహస్యంగా జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి నడిపించారు. నాడు డిస్కంల ప్రతిపాదనలపై వెంటనే స్పందించాల్సిన ఈఆర్సీ రెండేళ్ల తరువాత స్పందించింది. దీని ఫలితమే విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు. పాపాలన్నీ జగన్ అండ్ కో చేసి కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. ఇప్పుడు ఏమీ తెలియని నంగనాచిలా జగన్‌రెడ్డి కబుర్లు చెప్తున్నారు. ఆయన చేసిన పాపాలన్నీ నేడు కూటమి పాలనకు శాపాలై చుట్టుకున్నాయి. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక విద్యుత్ చార్జీలపై జగన్‌రెడ్డి విషప్రచారం చేస్తున్నారు.



● **అనగాని సత్యప్రసాద్**
రెవెన్యూ శాఖ మంత్రి

అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్!



ప్రజాస్వామ్య పవనాలను ఎవరు ఆపగలరు? మరి రెండు నెలలలోగా ముగియనున్న 2024 సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక సమాజాలకు ఒక మరపురాని ప్రత్యేక సంవత్సరంగా గుర్తుండిపోతుంది. ఎన్నికల సంవత్సరాలు అన్నిటికీ తల్లిలాంటి ఈ సంవత్సరంలో 60కు పైగా దేశాలలో జాతీయ స్థాయి ఎన్నికలు జరిగాయి. అనేక దేశాలలో ప్రజలు దిగ్భ్రాంతికరమైన తీర్పునిచ్చారు. ప్రభుత్వాలు మారాయి. ఎదురులేని మొనగాళ్లలా వ్యవహరించిన నేతలు అధికార వైభవం కోల్పోవడమో లేక తగ్గిపోవడమో జరిగింది. గతంలో ప్రజల చేత తిరస్కరించబడిన నాయకులు అనూహ్యమైన ప్రజా మద్దతుతో మళ్లీ అధికారానికి వచ్చారు.

ఈ ఏడాది వేసవిలో భారతీయ ఓటర్లు నడుస్తున్న చరిత్రను విస్మయపరిచారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి 400కు పైగా సీట్లు ఖాయమనుకుంటే గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆ పార్టీ ఈ సారి పార్లమెంటరీ మెజారిటీని కోల్పోయింది. ప్రధాని మోదీ ఒక సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అనివార్యమయింది. ఆ తరువాత జూలైలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పథనిర్దేశకులు అయిన బ్రిటిష్ ప్రజలు యువనేత, సాహసోపేత ప్రధానమంత్రి రిషి సునాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేశారు. ప్రతిపక్షమైన లేబర్ పార్టీని అనూహ్య మెజారిటీతో గెలిపించారు. సునాక్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని చాలా మంది ముందుగానే భావించినప్పటికీ లేబర్ పార్టీకి తిరుగులేని మెజారిటీ లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఇక అమెరికా. ప్రపంచంలో అత్యంత పురాతన ప్రజాస్వామిక దేశమైన అమెరికాలో మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ఘనవిజయంతో చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడుగా ఉండి ఎన్నికలలో ఓడిపోయి తదుపరి పర్యాయం అధ్యక్ష ఎన్నికలలో ఘనవిజయం సాధించిన అధ్యక్షుడుగా ట్రంప్ తనకొక విలక్షణ కీర్తిని సృష్టించుకున్నారు. గత 120 సంవత్సరాలలో ఒక అధ్యక్షుడు ఒకసారి విజితుడై మళ్లీ విజేత కావడం ఇదే మొదటిసారి. రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసిన మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేసిన కమలా హారిస్ మధ్య పోటీ సమస్థాయిలో ఉందని ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేమని ఓటర్ల సర్వేలు ఘంటాపథంగా వెల్లడిస్తూ వచ్చాయి. అయితే అమెరికన్ ఓటర్ల తీర్పు ఆ అంచనాలకు విరుద్ధంగా ఉండి ప్రపంచ ప్రజలను చకితపరిచింది.

ప్రపంచ ప్రధాన ప్రజాస్వామిక దేశాల ప్రజల తీర్పులలో ఒక స్పష్టమైన పద్ధతి లేదా రీతి గోచరమవుతుందా? ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎన్నిక, అధికారంలో ఉన్న నేతలు, పార్టీలకు ఒక స్పష్టమైన హెచ్చరికే అవడం పరిపాటి. అధికారంలో ఉన్న వారి పట్ల ఓటర్లలో వ్యక్తమయ్యే అసంతృప్తి, ఆగ్రహం పాలకులకు తెలుస్తూనే ఉండడం కూడా కద్దు. తత్కారణంగా తాము అధికారాన్ని నిలబెట్టుకోవడం కష్టమవుతుందనే జడుపు కూడా వారికి కలుగుతుంది. అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఓటమికి ఒక ప్రధాన కారణం. పదవీ విరమణ చేయనున్న అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వ పాలన, విధానాలలో ఆమె భాగస్వామ్యమే.

ప్రజలలో సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందనే సూత్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత సార్వత్రిక ఎన్నికల వరకు ఒక మినహాయింపుగా ఉండేవారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో ఆయన పార్టీ సైతం 63 స్థానాలను కోల్పోయింది. ఒక దశాబ్ద కాలంగా బీజేపీలోను, దేశ రాజకీయాలలోను తిరుగులేని రీతిలో ఉన్న ప్రభావ ప్రాబల్యాలకు తీవ్ర విఘాతం వాటిల్లింది. నిజమైన ప్రజాస్వామ్య ఎన్నికలలో ఒక అధికార పక్షం గతంలో కంటే మరింత మెజారిటీతో మళ్లీ అధికారానికి రావడమనేది అరుదుగా జరుగుతుంది. ప్రజలలో ప్రభుత్వ వ్యతిరేక మనస్థితి నెలకొనడానికి కారణం ఆర్థిక వ్యవస్థ. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రభుత్వాలు కోవిడ్ అనంతర ఆర్థిక దురవస్థల నెదుర్కోవడంలో సతమతమవుతున్నాయి. సంపన్న రాజ్యమైన అమెరికాలో సైతం కొత్త ఉద్యోగాల సృష్టి జరగలేదు. ఉన్న ఉద్యోగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రజల ఆదాయాలు పడిపోయాయి. జీవన వ్యయాలు అంతకంతకు పెరిగిపోసాగాయి. మరి స్వల్ప ఆదాయాలతో బతుకులను ఈడుస్తున్న కార్మిక శ్రేణులు డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి మద్దతుదారులుగా ఉండడంలో ఆశ్చర్యమేముంది? ఆర్థిక వ్యవస్థను బాగుపరచగల సమర్థుడు ఎవరన్నదే ఓటర్ల ఆలోచన. అటువంటి సమర్థ నేతను వారు ట్రంప్‌లో చూశారు. ఆయన విజేత అయ్యారు. భారత్‌లో సైతం లోక్‌సభ ఎన్నికలలో అటువంటి పరిస్థితే ఉన్నది. ఉదాహరణకు 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అన్న నినాదం దళిత ఓటర్లను బాగా ప్రభావితం చేసింది. రిజర్వేషన్ల ప్రయోజనాలను కోల్పోవడం జరిగితే తమకు ఉద్యోగావకాశాలు దాదాపుగా మృగ్యమవుతాయని దళితులు భయపడ్డారు. సరే, రైతుల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వ్యవసాయ రంగ దురవస్థలు, అనిశ్చిత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పాలక బీజేపీ 'చార్ సౌ ఆర్' స్వప్నాన్ని భంగపరిచాయి.

ఓటర్ల ప్రాధాన్యాల్లో సాంస్కృతిక గుర్తింపు ఒక ప్రధాన అంశంగా ఉండడమనేది ప్రజల తీర్పుల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఉదాహరణకు అమెరికాలో కమలా హారిస్ మద్దతుదారులు మరింత సమ్మిళిత 'కొత్త' అమెరికాను నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అన్ని మతాల, సకల జాతుల ప్రజలను సమానంగా గౌరవించే ఒక 'కొత్త' అమెరికాను నిర్మించుకోవల్సిన సమయమాసన్నమయిందని వారు వాదించారు. అమెరికన్ సమాజం 'వైవిధ్యం'తో వర్ధిల్లాలన్న వాదనను డోనాల్డ్ ట్రంప్ తలకిందులు చేశారు. వలస వచ్చిన, వస్తున్న వారికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడారు. భిన్న జాతుల, మతాలకు చెందిన వలసకారులు అమెరికన్ల శ్రేయస్సును దెబ్బ తీస్తున్నారని ఆయన వాదించారు. ట్రంప్ ధోరణి గత లోక్‌సభ ఎన్నికలలో ప్రధాని మోదీ, బీజేపీ నాయకుల ధోరణికి భిన్నమైనది కాదు.

నాగరిక విలువలు సమున్నతంగా ఉన్న ప్రపంచంలో అయితే, ట్రంప్, మోదీ, యోగి లాంటి నేతల విద్వేష పూరిత వ్యాఖ్యలు తీవ్రంగా గర్హింపబడేవి. అయితే 2024 ఎన్నికల ప్రచారాల్లో అటువంటి వ్యాఖ్యలు ఓటర్లలో అత్యధిక సంఖ్యాకులను తమ ఊహాత్మక 'అంతర్గత' శత్రువుకు వ్యతిరేకంగా పరిణమింపచేశాయి. మరింత సమ్మిళిత సమాజం కోసం కమలా హారిస్ చేసిన విజ్ఞప్తిని ఆమె ప్రత్యర్థులు పూర్తిగా వామపక్ష– ఉదార వాద రాజకీయ దృక్పథానికి మితిమీరిన ప్రాధాన్యమిస్తుందని, అది 'శ్వేతజాతి' అమెరికన్ల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని దుయ్యబట్టారు; మన దేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే నెహ్రూ ఆదర్శానికి నిబద్ధులయిన వారిని 'బూటకపు లౌకికవాదులు'గా కొట్టివేయడం జరుగుతుంది.

ఒక విధంగా శక్తిమంతమైన రాజకీయ నాయకులు అయిన డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఒకే విధమైన విజయ సూత్రాన్ని కనుగొన్నారు. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి 'వికసిత్ భారత్' అనే స్వప్నాన్ని మోదీ పూయించగా 'అమెరికాను మళ్లీ గొప్ప దేశం'గా రూపొందిస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. జాతీయవాద భావోద్వేగాలను దృఢతరం చేసే ఈ జనాకర్షక నినాదాలు ట్రంప్– మోదీ రాజకీయ సందేశాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు సృష్టించడం ఇరువురి ప్రచారాలలో ఒక ఉమ్మడి అంశం. అమెరికాలో ప్యూర్టోరికన్, హైతియన్ వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్, భారత్‌లో రోహింగ్యాలు లేదా బంగ్లాదేశీ ఘుస్‌పేటియా (చొరబాటుదారులు)కు వ్యతిరేకంగా మోదీ ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహాలలో భాగంగానే 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు రెచ్చగొట్టడం జరుగుతోంది. ఒక విభిన్న అస్తిత్వాన్ని పటిష్ఠం చేసుకునేందుకు అనుసరిస్తున్న జాగరూక వ్యూహమది. అమెరికాలో ట్రంపియన్ అమెరికనిజం, భారత్‌లో బీజేపీ హిందుత్వ భావజాలాలు ఒక జాతీయవాద దాడిగా వ్యక్తమవుతున్న అదుపులేని, చేయలేని సాంస్కృతిక వక్కాణింపు ప్రాతిపదికపై ప్రభవించినవే.

డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఇరువురి విజయసూత్రం ఒకటే. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి 'వికసిత్ భారత్' అనే స్వప్నాన్ని మోదీ పూయించగా 'అమెరికాను మళ్లీ గొప్ప దేశం'గా రూపొందిస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. జాతీయవాద భావోద్వేగాలను దృఢతరం చేసే ఈ జనాకర్షక నినాదాలు ట్రంప్– మోదీ రాజకీయ సందేశాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు సృష్టించడమనేది ఇరువురూ ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహాలలో ఒక ఉమ్మడి అంశం.

ఈ వ్యూహాలు చెప్పుకోదగిన రీతుల్లో ఫలిస్తున్నాయి. కారణమేమిటి? అటు అమెరికాలోను, ఇటు భారత్‌లోను ప్రతిపక్షాలు తమ సొంత ప్రత్యేక విధానాలను ప్రతిపాదించడానికి బదులుగా, భావజాల ప్రత్యర్థుల వ్యక్తిత్వాలను సవాల్ చేయడమనే వలలో చిక్కుకోవడమే. భారత్‌లో ప్రతిపక్షాలు ఎంతకూ మోదీని విమర్శించడానికే పరిమితమవుతున్నాయి; అలాగే అమెరికాలో డెమొక్రాట్లు అమెరికా భవిష్యత్తు విషయమై ఒక సుసంబంధ దార్శనికతతో ఓటర్లను కొత్త సమున్నత లక్ష్యాల సాధనకు ప్రేరేపించడానికి బదులుగా నిరంతరం ట్రంప్ వ్యక్తిత్వంలోని లోపాలు, లొసుగులను ఎండగట్టేందుకే పరిమితమయ్యారు. ఈ క్రమంలో ట్రంప్ తనను ప్రత్యర్థుల కుట్రకు బాధితుడుగా, వాషింగ్టన్ అధికార వ్యవస్థకు 'బయటి వ్యక్తి'గా చిత్రించుకోవడంలో సఫలమయ్యారు. నరేంద్ర మోదీ తనను తాను 'చాయ్ వాలా కా బేటా'గా చెప్పుకుంటూ 'నామ్ దార్' ప్రత్యర్థులను ఎదుర్కొంటున్న 'కామ్ దార్'గా తనను అభివర్ణించుకుని దేశ ప్రజలను ఆకట్టుకున్న విషయం మనకు బాగా తెలుసు.

డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఇరువురూ స్వతంత్రంగా, సొంత పద్ధతులతో తమ రాజకీయ విజయాలను సాధించుకున్న సమర్థులే. మోదీ తరచు తన విమర్శకులు ఎంతగా పొరపడుతున్నారో రుజువు చేసిన నాయకుడు. ట్రంప్ సైతం ఒకసారి విజితుడు అయిన తరువాత చరిత్రాత్మక విజేతగా ప్రభవించేందుకు తనదైన రీతిలో విజయ పథాన్ని నిర్మించుకున్న అరుదైన నేత. ఐదు సంవత్సరాల క్రితం అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికల సందర్భంలో కాబోయే విజేత అని ట్రంప్‌ను మోదీ తొందరపాటుగా ప్రస్తుతించారు. 'అబ్ కి బార్ ట్రంప్ సర్కార్' అని నినదించారు. 2024లో అమెరికా ఎన్నికల తీరుతెన్నులు ఒక కొత్త విశేషాన్ని సంతరించుకున్నాయి. ప్రపంచ రాజకీయాలలో వాక్శూరులకు ఇంకా స్థానమున్నదన్నదే ఆ విశేషం.



■ **రాజ్‌దీప్ సర్దేశాయి**

దీపశిఖ

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

బహిరంగ విమర్శలు సరికాదు!

అయిదేళ్ల జగన్‌రెడ్డి బాధ్యతలేని పరిపాలనలో వ్యవస్థలన్ని ధ్వంసం అయ్యాయి. పోలీసు శాఖతో సహా, ప్రభుత్వ శాఖలన్ని నిర్వీర్యం అయ్యాయి. ఏ శాఖ కూడా బాధ్యతగా వ్యవహరించలేదు. ఐఏఎస్, ఐపీఎస్‌ల నుంచి గ్రామ సచివాలయ కార్యదర్శి వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా అన్న విధంగా వ్యవహరించారు. పోలీసు శాఖను తమ రాజకీయ ప్రయోజనాలకు రాళ్లెత్తే కూలీగా మార్చింది వైసీపీ ప్రభుత్వం. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు వ్యవస్థలను సరిదిద్ది గాడిలో పెట్టేందుకే నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని సంఘటనలపై పోలీసు శాఖ నిర్లిప్తంగా ఉండటం మీద హోమ్ శాఖ పనితీరుపై ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. బహిరంగ వేదికలపై సాటి శాఖ పనితీరును విమర్శించడం సహేతుకం కాదు. మంచిచెడులు కేబినెట్‌లో మాట్లాడుకోవాలి, సరిదిద్దుకోవాలి. సమస్యలు వినే, పరిష్కరించే ముఖ్యమంత్రి ఎలాగూ ఉన్నారు. ఒక అంశంపై బహిరంగంగా మాట్లాడి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విరుచుకుపడే అవకాశం ఇవ్వడం సరైనది కాదు. పరిపాలనలో కాబినెట్ మంత్రులు అందరికి సమిష్టి బాధ్యత ఉంటుంది. ఈ మధ్య గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా అయి పలువురు అతిసార వ్యాధి బారిన పడి ఆసుపత్రుల పాలైన వార్తలు వచ్చాయి. మరి కలుషిత నీరు సరఫరా కావడానికి, ప్రజలు అతిసార వ్యాధి బారిన పడటానికి ఎవరు కారణం అని నిందించాలి? బాధ్యతాయుత స్థానంలో ఉన్నవారు ఆలోచించి మాట్లాడాలి. అట్లాగే, కొందరు అధికారులు కూడా ఇంకా వైసీపీ నాయకులకు అడుగులకు మడుగులొత్తడం వల్లనే రాష్ట్రంలో ఈ దుస్థితి దాపురించింది. దురదృష్టమేమంటే రాష్ట్రంలో ప్రభుత్వం మారినా, ఇంకా కొందరు పోలీసుల్లో మార్పు రాకపోవడం బాధాకరం. గత ఐదేళ్లు జగన్ మెప్పుకోసం అధికార యంత్రాంగమే తప్పుడు పనులకు పాల్పడింది. రాష్ట్రంపై కమ్మిన కారు చీకట్లను చీల్చడానికే రాష్ట్రంలో కొత్త పొత్తు పొడిచింది. జగన్‌రెడ్డి దురాగతాల నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా తెదేపా, జనసేన జట్టు కట్టాయి. ఆ లక్ష్యానికి అనుగుణంగా పని చెయ్యాలి. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం చేసేందుకు అభివృద్ధి జోడీగా తమ ముందుకు వచ్చిన కూటమిని రాష్ట్ర ప్రజానీకం నిండు మనసుతో ఆశీర్వదించింది. జగన్ భస్మాసుర పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసమైపోగా, అభివృద్ధి పూర్తిగా అడుగంటి ఆంధ్రప్రదేశ్ అస్తిత్వమే ప్రశ్నార్థకమయిన వేళ కొత్తగా జతకట్టిన కూటమి ముందున్న లక్ష్యం ఛిద్రమైన వ్యవస్థల్ని రాజ్యాంగ నైతికతతో సత్వరం పునర్నిర్మించడమే.

– నీరుకొండ ప్రసాద్

పౌష్టికాహారం లేని బాలభారతం

మన పిల్లల ఆరోగ్యం చాలా దారుణంగా ఉంటున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం దేశంలో 6–23 నెలల మధ్య వయస్సు గల 77శాతం మంది శిశువులు కనీస ఆహార వైవిధ్యాన్ని పొందడం లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 88.5శాతం బాలలు ఆహార వైవిధ్య ప్రమాణాలను అందుకోలేకపోతున్నారు. నాణ్యత లేని ఆహారం పిల్లల మనుగడ, పెరుగుదల, అభివృద్ధికి అవశ్యం మాత్రమే కాకుండా వారి అలవాట్లు సామర్థ్యాలకు కూడా అత్యంత ముఖ్యమైన అవరోధాలలో ఒకటి. కనీస ఆహార వైవిధ్యాన్ని నిర్ధారించడానికి అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. వీటిలో అత్యంత భయంకరమైనది ఆహార ద్రవ్యోల్బణం. గత 12 నెలల్లో పప్పుల ధర 10శాతం పెరిగింది. మెజారిటీ భారతీయులు మాంసాహారులు కూడా. పప్పు దినుసుల నుండి వృద్ధికి కీలకమైన పోషకాలైన ప్రోటీన్‌ను పొందుతున్నారు. ఐక్యరాజ్యసమితి సంస్థల బృందం నివేదిక ప్రకారం భారత జనాభాలో 55.6శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. మహిళలను ప్రతికూలంగా ప్రభావితం చేసే లింగ వివక్ష మరొక అడ్డంకి. తల్లులలో కనీస ఆహార వైవిధ్యం లేకపోవడం వల్ల పిల్లలు ఆకలి బాధతో అలమటిస్తున్నారు. తల్లుల మధ్య విద్యా స్థాయి పిల్లల ఆహార వైవిధ్యాన్ని ప్రభావితం చేస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆహార భద్రతకు సంబంధించిన విధానాలు పిల్లలు మరియు వారి ఆహారపుటల వాట్లపై అసంఖ్యాక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించడానికి విస్తృత చర్యలు చేపట్టాలి. బాలల శక్తి సామర్థ్యాల పెరుగుదలకు పౌష్టిక ఆహారం అందించుటకు ప్రభుత్వం విస్తృతంగా తగిన ఏర్పాట్లు చేయాలి.

– దండంరాజు రాంచందర్‌రావు

నినాదాల్లో వినపడి, వ్యవస్థలో కనపడని న్యాయం!

కళ్ళకు గంతలు లేని నూతన న్యాయ దేవత విగ్రహాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తుల లైబ్రరీలో ఇటీవల నెలకొల్పారు. వలస వాద చిహ్నాలను చెరిపేయడానికి ఇలా చేసినట్లు పేర్కొన్నారు. విగ్రహం పాతదయినా, కొత్తదయినా, వ్యవస్థ పని తీరు ఎలా ఉందన్న దాన్ని బట్టే న్యాయం నిర్ణయించబడుతుంది.

న్యాయ వ్యవస్థకు సంబంధించి మన దేశంలో రెండు నినాదాలు అత్యంత బలంగా వినబడుతూ ఉంటాయి. ఒకటి "జస్టిస్ డిలేయిడ్ ఈస్ జస్టిస్ డినైడ్". అంటే ఆలస్యంగా న్యాయం జరగటం న్యాయాన్ని నిరాకరించటంతో సమానం అని అర్థం. రెండోది వెయ్యి మంది దోషులైనా తప్పించుకోవచ్చు గాని ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు అన్నది. ఈ రెండు అంశాల అమలులోనూ ఘోరమైన వైఫల్యం మన న్యాయవ్యవస్థలో స్పష్టంగా కనపడుతోంది.

మన దేశంలో హైకోర్టులు, క్రింది కోర్టుల్లో కలిపి సుమారు ఐదు కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయి. ఒక్కొక్క కేసులో ఆరుగురు కక్షిదారులు ఉన్నారనుకున్నా, ఆ లెక్కన కనీసం ముప్పై కోట్ల మంది, అంటే అమెరికా జనాభా కంటే ఎక్కువ మంది వివిధ కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ కేసులలో తీర్పులు రావటంలో తీవ్రమైన ఆలస్యం జరుగుతోంది. దేశంలో సగటున ఒక కేసు పరిష్కారం కావడానికి పదమూడున్నరేళ్లు పడుతోంది. సుప్రీంకోర్టులో నలభై శాతం కేసులు ఐదేళ్ళకు పైగా పెండింగులో ఉన్నాయి. దేశ ఉన్నత న్యాయస్థానంలో ఒక కేసు మూడు దశాబ్దాలకు పైగా పెండింగులో ఉంది. బెర్హంపూర్ బ్యాంకు కేసులో తీర్పు రావడానికి ఏకంగా డెబ్బై రెండేళ్లు పట్టింది. 1951లోని ఈ కేసు తుది తీర్పు 2023లో వచ్చింది. కొన్ని కేసులలో ముఖ్యంగా సివిల్, క్రిమినల్ కేసుల రెంటిలోనూ కేసులు వేసిన మనుషులు కూడా చనిపోతున్నారు. తరాలు మారినా తీర్పులు మాత్రం వెలువడని ఉదంతాలు ఎన్నో. ఎవరినైనా ఇబ్బంది పెట్టాలంటే కోర్టులో ఒక కేసు వేసేస్తే ఇక అవతలి వారి పని అయినట్లే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నట్టుగా పెండింగ్ కేసుల పరిష్కారం న్యాయ వ్యవస్థ ముందు పెద్ద సవాలు. వరల్డ్ జస్టిస్ ప్రాజక్టు వివిధ అంశాల ఆధారంగా విడుదల చేసే ర్యాంకింగులలో మన దేశం 79వ స్థానంలో ఉంది. మన పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్ వంటివి మన దేశం కంటే మెరుగ్గా ఉన్నాయి.

ఈ రకంగా కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరగడం ద్వారా ఎవరికి లాభం, ఎవరికి నష్టం? కేసు వేగంగా పరిష్కారం కావాలని నష్టపోయినవాడు కోరుకుంటే, ఎంత ఆలస్యం అయితే అంత మంచిదని లాభపడేవాడు కోరుకుంటాడు. ఇప్పుడు మన న్యాయ వ్యవస్థలో లాభపడుతున్నది రెండవ కోవకు చెందినవారే. అంటే నష్టపోయినవాడు న్యాయవ్యవస్థ వల్ల కూడా నష్టపోతున్నాడు. చట్టం ముందు అందరూ సమానమే అని చెప్పినా– సామాన్యుడు కోర్టుల చుట్టూ తిరగలేకపోవడంతో, వాస్తవంగా ఆచరణలో న్యాయం ఆర్థిక స్తోమత ఉన్న వారికే అనుకూలంగా ఉంటోంది.

కొన్ని మంచి తీర్పులు కూడా ఆలస్యంగా రావడంతో ఆ తీర్పుల సాఫల్యం పూర్తిగా దక్కడం లేదు. ఉదాహరణకు ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల బాండ్లు చెల్లవని తీర్పు ఇచ్చింది. కానీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. బీజేపీ వేల కోట్ల రూపాయలు ఈ బాండ్ల ద్వారా సంపాదించి లబ్ధి పొందింది. ఆ సొమ్మును కక్కించే పని కోర్టు ఎలాగూ చేయలేదు. ఇక్కడ కూడా ఆలస్యంగా జరిగిన న్యాయం, న్యాయమెలా అవుతుందన్న ప్రశ్నే ఉదయిస్తుంది. ఇలా తీర్పులు ఆలస్యం కావడానికి మౌలిక వసతులు, సిబ్బంది లేకపోవడం ప్రధాన కారణం అని చెబుతున్నా, దీనికి బాధ్యత కూడా ప్రభుత్వమూ, న్యాయ వ్యవస్థే వహించాలి. వారి లోపానికి సామాన్యులను బలి చేయడం సమంజసం కాదు.

రెండోది నిర్దోషులు, దోషుల గురించి. మహిళలపై అత్యాచారం చేసిన దోషి డేరా బాబా దర్జాగా బెయిల్‌పై బయట తిరుగుతుండగా, చేయని నేరానికి నిర్దోషి ప్రొఫెసర్ సాయిబాబా పదేళ్ల జైలు శిక్ష అనుభవించవలసి వచ్చింది. మొత్తం ఆయన జీవితాన్నే కోల్పోవాల్సి వచ్చింది. ఓ ప్రసంగం కారణంగా ఉమర్ ఖలీద్ అనే యువ పీహెచ్‌డీ విద్యార్థి గత నాలుగున్నరేళ్ళుగా జైలులో ఉన్నాడు. విశేషమేమిటంటే ఈ కాలమంతా ఆయనకు బెయిల్ లేదు, ట్రయలూ లేదు. ప్రభుత్వం తమకున్న అధికార బలంతో తప్పుడు కేసులు బనాయించి, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచడం ద్వారా అనేక మందిని కేసుల్లో ఇరికిస్తోంది. వీటిలో అత్యధిక కేసుల్లో వారిపై మోపిన నేరం నిరూపించబడడం లేదు. కానీ ఈ లోగా తీవ్ర జాప్యం జరిగి నిర్దోషులు శిక్ష అనుభవించవలసి వస్తోంది. వీరందరికీ అన్యాయమే జరుగుతోంది. పోనీ తప్పుడు కేసులు బనాయించిన వారిపై ఏమైనా చర్యలుంటాయా అంటే అలాంటి అవకాశమే చట్టంలో లేదు.

ఇంకో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే– కులం, అంటరానితనం వంటివి జైళ్ళల్లో కూడా ఉన్నాయని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. జైలులో దళితులను ప్రత్యేక ప్రదేశాలలో ఉంచడం, వారికి మిగిలిన ఖైదీలతో పోలిస్తే తక్కువ ఆహారాన్ని సరఫరా చేయడం, మిగిలిన ఖైదీలతో పోలిస్తే వారిచేత కిందిస్థాయి పనులు చేయించడం, పడుకోవడానికి కూడా జాగా సరిపోనంత ఇరుకైన ప్రదేశాల్లో వారిని నిర్బంధించడం వంటి ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగు చూశాయి. అంటే మన జైళ్ళలో నిర్దోషులు ఖైదీలుగా ఉండడమే గాక వారికి మానవత్వంతో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. దానితో పాటుగా రాజ్యాంగం నిషేధించిన వివక్ష కూడా కొనసాగుతోంది. వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా విషయంలో కూడా జైలు అధికారులు కనీసం తినడానికి ఒక స్పూన్ ఇవ్వడానికి కూడా నిరాకరించి, ఎంత అమానుషంగా ప్రవర్తించారో విదితమే.


అందువల్ల, మన న్యాయవ్యవస్థ ఎలాంటి నినాదాలు ఇచ్చినప్పటికీ, ఆచరణలో అది నష్టపోయినవారికి కాక లాభపడిన వారికే అనుకూలంగా ఉంది. ఇటువంటి లోపాలను సరిదిద్ది కక్షిదారులకు, ముఖ్యంగా సామాన్యులకు త్వరితగతిన ఒక కాలపరిమితిలోగా తీర్పులు వచ్చేటట్టుగా వ్యవస్థలో కొన్ని సమూలమైన మార్పులు చేయాలి. నిర్దిష్ట కాలపరిమితి లోగా న్యాయం జరగకపోతే దానికి నష్టపరిహారాన్ని అందుకునే హక్కు కూడా సామాన్యులకు ఉండేలా వ్యవస్థలో మార్పులు చేయాలి. అప్పుడు మాత్రమే చట్టం ముందు అందరూ సమానులే అన్న నినాదం ఆచరణలో సాకారమవుతుంది. కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఏంగిల్స్ మహాశయులు చెప్పినట్టు సమాజంలో న్యాయ వ్యవస్థతో సహా రాజ్యాంగ యంత్రం అంతా దోపిడీ సమాజాన్ని కాపాడానికి, పాలకులను రక్షించడానికే సహకరిస్తుంది. మన న్యాయవ్యవస్థ కూడా దీనికి మినహాయింపు కాదని వివిధ ఘటనలు నిరూపిస్తున్నాయి.

ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తులు గాను, ప్రధాన న్యాయమూర్తులు గాను ఉన్నవారు ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులు ఇచ్చిన తర్వాత, రిటైరయిన వెంటనే పదవులు పొందుతున్నారు. బాబ్రీ మసీద్ తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయిని పదవీవిరమణ అయిన మూడు నెలలకే రాజ్యసభకు ప్రభుత్వం నామినేట్ చేయడం చూశాం. తాజాగా నేటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వినాయక చవితి పూజ సందర్భంగా దేశ ప్రధానమంత్రి వెళ్ళడం కూడా పెద్ద చర్చనీయాంశం అయింది. ఈయన కూడా బాబ్రీ మసీదు కేసు తీర్పు బెంచిలోని ఒక న్యాయమూర్తే. చట్టాల పేర్లు మార్చినంత మాత్రాన న్యాయం జరగదు. సమూలమైన సంస్కరణలు చేపట్టినప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థ మీద సామాన్యులకు విశ్వాసం కలుగుతుంది. ఆలస్యమైన కేసులలో పరిహారం చెల్లింపు, తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవడం, న్యాయమూర్తుల ప్రవర్తనా నియమావళి అమలు వంటి చర్యల ద్వారా న్యాయ వ్యవస్థ నుండి కొంతైనా న్యాయం జరిగేలా చేయవచ్చు.

కేసు వేగంగా పరిష్కారం కావాలని నష్టపోయినవాడు కోరుకుంటే, ఎంత ఆలస్యం అయితే అంత మంచిదని లాభపడేవాడు కోరుకుంటాడు. ఇప్పుడు మన న్యాయవ్యవస్థలో లాభపడుతున్నది రెండవ కోవకు చెందినవారే. అంటే నష్టపోయినవాడు న్యాయవ్యవస్థ వల్ల కూడా నష్టపోతున్నాడు.



■ **ఎ. అజశర్మ**
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక





అకౌంట్ల పేర్లు మార్చేస్తున్నారు..

సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు

- కేసులు నమోదయ్యే సరికి పేర్లలో మార్పులు
- పోస్టింగ్‌ల్లో వైసీపీ సోషల్ మీడియా వికృత చేష్టలు
- టాస్క్‌ఫోర్స్ అదుపులో నలుగురు నిందితులు?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విధానాలపై ఉండాల్సిన విమర్శ వ్యక్తిగతంగా వెళ్లింది. సిద్ధాంతాలను వ్యతిరేకించే విభేదం కుటుంబ సభ్యులను వీధికి లాక్కొచ్చింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తాము ఏం చేసినా అడ్డులేదనే భావనతో వైసీపీ సోషల్ మీడియా, దానికి అనుబంధంగా ఉండే వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఇప్పుడు అధికారం కోల్పోయిందన్న అక్కసుతో అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ ఈ మూడింటిలోనూ కూటమి ప్రభుత్వంలోని నేతలు, వారి కుటుంబ సభ్యులపై నోటితో పలకలేనంత దారుణమైన పదాలతో పోస్టింగ్‌లు పెడుతున్నారు. దీన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సామాజిక ఉన్మాదులపై పోలీసులు కేసులు నమోదు చేసే సరికి అకౌంట్ల పేర్లను మార్చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

జనసైనిక్, కల్యాణ్ చక్రవర్తి, మోహన్ శ్రీనివాసరావు పతివాడ, నిహా కల్యాణ్ ఇవన్నీ కూటమిలోని నేతలపై ముఖ్యంగా పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులను టార్గెట్ చేసుకుని అసభ్యకరంగా పోస్టింగ్‌లు చేసిన వారి ఎక్స్ అకౌంట్లు. ఇవి కాకుండా మరికొన్ని అకౌంట్లతో సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై దారుణమైన వ్యాఖ్యలతో పోస్టింగ్‌లు చేశారు. ఈ పోస్టింగ్‌లకు సంబంధించిన ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లలో కొద్దిరోజుల క్రితం 47 కేసులు నమోదు చేశారు. వాటికి సంబంధించిన దర్యాప్తు సాంకేతికంగా జరుగుతోంది. ఐపీ లాగ్ వివరాలను సేకరించిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురిని విచారిస్తున్నారు. ఈ ముగ్గురు విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన వారని తెలిసింది. ఇంకా మరికొంతమంది కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. పోలీసులు కేసులు నమోదు చేయడంతో పోస్టింగ్‌లు పెట్టిన వారు రకరకాల రూట్లు మారుస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన అకౌంట్ల పేర్లను మార్చేస్తున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పుడు ఆ అకౌంట్లకు సంబంధించిన వివరాలను, అకౌంట్ల పేర్లను, వారు చేసిన పోస్టింగ్‌లను అందజేశారు. సైబర్ క్రైం పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తుండడంతో వారికి చిక్కకుండా ఉండేందుకు ఆ అకౌంట్లకు ఉన్న పేర్లను మార్చేస్తున్నారు. పోస్టింగ్‌లను మాయం చేస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఈవిధంగా చేస్తున్నారని తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు పెట్టి ఇప్పుడు మార్పులు చేసినంత మాత్రాన నిందితులు తప్పించుకోలేరని పోలీసులు చెబుతున్నారు. పుస్తకంలో అక్షరాలను మార్చినంత మాత్రాన సూచిక (ఇండెక్స్) మారదని పోలీసులు చెబుతున్నారు.

'ఇది అమ్మవారి రక్ష. కట్టుకుంటే అంతా మంచే జరుగుతుంది.. పిల్లలు, పెద్దలు ఎవరైనా కట్టుకోవచ్చు. ధర కేవలం రూ.100 మాత్రమే' అంటూ ఇంద్రకీలాద్రిపై పురోహితులు కొత్త వ్యాపారానికి తెరతీశారు. శఠారీల వద్ద పళ్లాల్లో పెట్టుకుని మరీ భక్తులకు విక్రయిస్తున్నారు. అమ్మవారిపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని కొందరు క్యాష్ చేసుకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



ఇంద్రకీలాద్రిపై రక్ష వ్యాపారం!



ధరిస్తే మంచి జరుగుతుందని ప్రచారం

- ఒక్కొక్కటి రూ. 100లకు విక్రయం
- శఠారీల వద్ద పళ్లాల్లో దర్శనం
- నిమ్మకాయలపైనా వ్యాపారమే!
- సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కనకదుర్గమ్మ దర్శనానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. రోజుకు 30 వేల నుంచి 40వేల మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో 50 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. తొలుత అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాత ఉపాలయాలకు వెళ్తారు. కనకదుర్గమ్మ ఆలయంతోపాటు మల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. మల్లేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో నటరాజస్వామి ఆలయం, దీనికి వెనుక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఈ ఆలయాలను దర్శిస్తారు.

అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులకు రావి చెట్టు వద్ద పురోహితులు శఠారీ ఇస్తారు. ఇక్కడ శఠారీ పెట్టే పళ్లెంలో ఎరుపు రంగు దారం కట్టిన రక్షలు కుప్పలుగా ఉంటాయి. ఈ రక్షలు అమ్మవారి పూజల్లో పెట్టినవి, కట్టుకుంటే అంతా మంచే జరుగుతుందని పురోహితులు భక్తులకు చెబుతున్నారు. ఒక్కో రక్షను రూ.100లకు విక్రయిస్తున్నారు. ఇక్కడ రక్షతోపాటు నిమ్మకాయలు ఉంటాయి. వాటినీ భక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా విక్రయించిన డబ్బులు ఆలయానికి వెళ్తున్నాయా, పురోహితుల జేబుల్లోకి వెళ్తున్నాయా అన్నది తెలియడం లేదు. రక్ష వ్యాపారం రావిచెట్టు దగ్గర నుంచే ప్రారంభమవుతోంది. ఆ తర్వాత నటరాజ స్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోనూ ఇదే వ్యాపారం కొనసాగుతోంది. పురోహితులు సొంతంగా ఈ రక్ష వ్యాపారం చేస్తున్నారని ఆలయ వర్గాలే చెబుతున్నాయి. దీనికి ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నాయి. అధికారులు తనిఖీలు చేసినప్పుడు మాత్రం ఈ రక్షలు మాయమవుతాయి. మిగిలిన సమయాల్లో శఠారీ ఉండే పళ్లాల్లో ఉంటాయి. ఇంద్రకీలాద్రిపై ఈ రక్షల మాట ఏమిటన్నది చాలామంది భక్తులకు అర్థంకావడం లేదు. కొంతమంది భక్తులు వాటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యాపారమంతా కనకదుర్గమ్మ ప్రధానాలయం నుంచి ఉపాలయాల వరకు కొనసాగుతోంది.

రావిచెట్టు దగ్గర నుంచి మొదలు

రక్షలను సీజ్ చేసినా మళ్లీ ప్రత్యక్షం

కొద్దిరోజుల కిందట ఆలయ ఈవో రామారావు ఇంద్రకీలాద్రిపై ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ సమయంలో పళ్లాల్లో ఉన్న రక్షలను గమనించి మొత్తం సీజ్ చేసినట్టు తెలిసింది. ఆ తర్వాత కొన్ని రోజులపాటు రక్షలు పళ్లాల్లో కనిపించలేదు. పురోహితుల నోట వాటి మాట వినిపించలేదు. ఇప్పుడు మళ్లీ రక్షల వ్యాపారం జోరుగా సాగుతోంది. అమ్మవారికి నిత్యం ఆర్జిత సేవలు జరుగుతాయి. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన చేస్తారు. ఇది కాకుండా కుంకుమ పూజలు జరుగుతాయి. ఇందులో ఏ ఆర్జితసేవలో, ఏ పూజలో ఈ రక్షలను పెడుతున్నారో తెలియదు. అమ్మవారి పూజలో ఉంచిన రక్షలు కట్టుకుంటే అంతా మంచే జరుగుతుందన్న మాటలు మాత్రం చెప్పి భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. నిత్యం ఈ రక్షల ముసుగులో వేలాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. ఎవరైనా వాటిని కెమెరాలో గానీ, సెల్‌ఫోన్‌లో గానీ చిత్రీకరిస్తే పురోహితులు ఆ పళ్లాలకు అడ్డుగా నిలబడుతున్నారు. లేకపోతే ఆ పళ్లాలను టేబుల్ మీద నుంచి కింద పట్టేస్తున్నారు. ఆలయ ఈవో కార్యాలయానికి చేరుకున్న తర్వాత అమ్మవారి దర్శనానికి వెళ్తారు. ఆ సమయంలో రక్షలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆయన దర్శనం చేసుకుని వెళ్లిపోయిన తర్వాత మళ్లీ పళ్లాల్లోకి రక్షలు ప్రత్యక్షమవుతున్నాయి. భక్తులకు అమ్మవారిపై ఉన్న భక్తిని కొంతమంది పురోహితులు క్యాష్ చేసుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



మైలవరంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రాన్ని సీఎం చంద్రబాబు వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

ఖర్చు కాస్త ఎక్కువే!

కృష్ణాతీరంలో రేపు సీ ప్లేన్ ట్రయల్ రన్!

- పర్యాటక రంగానికి కొత్త మలుపు
- విజయవాడ - శ్రీశైలం ట్రిప్పుకు రూ.2 లక్షల వరకు ఖర్చు
- టికెట్ ధర రూ.15 వేలు ఆపైన ఉంటేనే..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నీటిపై తేలియాడుతూ ఆకాశంలోకి దూసుకుపోయే సీ ప్లేన్ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఈ నెల 9న విజయవాడలో కృష్ణానదీ తీరాన పున్నమిఘాట్ దగ్గర ట్రయల్ రన్ నిర్వహించబోతున్నారు. ఈ ట్రయల్ రన్ అనేది ల్యాండింగ్, టేకాఫ్‌లను పరిశీలించటమే కాదు దీని వయబిలిటీ ఎంత అనేది కూడా అంతర్లీనంగా తేలనుంది. అభివృద్ధి చెందిన దేశాలలో పర్యాటక రంగాన్ని కొత్త మలుపు తిప్పుతున్న సీ ప్లేన్‌లు మనకు రావటం అన్నది ఆహ్వానించదగ్గ పరిణామం. అక్కడ ఖర్చు పెట్టగల స్థాయిని దృష్టిలో పెట్టుకుని చూసినా సీ ప్లేన్ కాన్సెప్ట్ ఎంతో విజయవంతంగా నడుస్తున్నాయి. మన దేశం విషయానికి వచ్చే సరికి ఈ ప్రాజెక్టులు చాలా వరకు విఫలమవుతున్నాయి. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు ప్రయోగాత్మకంగా నడపబోతున్న సీ ప్లేన్ వల్ల వయబిలిటీ కోణం అన్నది చాలా ముఖ్యంగా మారుతోంది. ప్రధానంగా మన దగ్గర వడోదరలో పదేళ్ల కిందట ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. తర్వాత క్రమంలో అది మూత పడింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం దగ్గర కూడా ఇలాంటి ప్రాజెక్టును తీసుకువచ్చారు. అది కూడా ఆగిపోయింది. ముంబాయిలో ఎంతో ఘనంగా ప్రారంభించిన సీ ప్లేన్ ప్రాజెక్టు కూడా మూత పడింది. దక్షిణ భారత దేశంలో మొదటి సారిగా కేరళలో ప్రవేశపెట్టిన సీ ప్లేన్ ప్రాజెక్టుకు కూడా అటకెక్కింది. సీ ప్లేన్ ప్రాజెక్టులు మూతపడటం వెనుకున్న కారణాలను పరిశీలిస్తే.. వయబిలిటీ కాకపోవటమే సమస్యగా మారుతోంది.

భారీగా నిర్వహణ వ్యయం

సీప్లేన్‌కు నిర్వహణ వ్యయం విపరీతంగా ఉంటుంది. మెయింటెనెన్స్ ఖర్చులే అధికంగా ఉంటాయి. టికెట్ ధర చూస్తే.. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు రూ. 15 వేలు ఆ పైన పెట్టకపోతే వయబిలిటీ ఉండదు. విజయవాడ నుంచి శ్రీశైలం నడిపే సర్వీసుకు ట్రిప్పుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతోందని తెలుస్తోంది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)ను అమలు చేయాలన్నా కూడా సమస్యలు ఉన్నాయి. విమానంలో 14 సీట్లు వరకు ఉంటాయి. ఇందులో నిబంధనలు మార్చితే తప్ప సగం సీట్ల వరకు ప్రభుత్వం వీజీఎఫ్ ఇవ్వటానికి అవకాశం ఉంది. అయినా కూడా ఈ ప్రాజెక్టు నడపటానికి వయబిలిటీ ఉండదన్న వాదనలు వస్తున్నాయి. ప్రభుత్వం పూర్తి ఖర్చును భరించటం కానీ వీజీఎఫ్ నిబంధనలను మార్చటం ద్వారా కానీ సాధ్యం కావటానికి అవకాశం ఉంది. ఈ విమానాలకు మెయింటెనెన్స్ కాస్ట్ ఎక్కువగా ఉండటమే అసలు సమస్య. అందువల్ల శనివారం నిర్వహించే ట్రయల్ రన్‌లో ఏమిటన్నది తేలుతుంది. పర్యాటక రంగాన్ని కొత్త మలుపు తిప్పే సీ ప్లేన్ వంటి ప్రాజెక్టు మనకు సాకారమైతే.. రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకరంగం మరింత ప్రాచుర్యం పొందుతుంది.

ఉలిక్కిపడిన యనమలకుదురు

రెండు గ్రూపుల మధ్య కొట్లాటతో కలకలం

- కర్రలు, చాకులు, బీరుబాటిళ్లతో పరస్పరం దాడులు
- ఇద్దరికి గాయాలు, ఆస్పత్రిలో చేరిక
- ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు



గొడవలో స్పృహ కోల్పోయిన యువకుడు

పెనమలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు శివాలయం కొండ వెనుక ఉన్న పెట్రోలు బంకు వద్ద మంగళవారం అర్ధరాత్రి రెండు గ్రూపుల మధ్య జరిగిన కొట్లాట గ్యాంగ్‌వార్‌ను తలపించింది. కత్తులు, కర్రలు, బీరుబాటిళ్లతో పరస్పరం దాడులకు దిగడంతో యనమల కుదురు గ్రామం ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే... యనమలకుదురుకు చెందిన గుడివాక రాహుల్, తాడిగడపకు చెందిన పెదపూడి మనోజ్‌కుమార్ మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో రెండు గ్రూపులు మంగళవారం రాత్రి కొట్టుకున్నాయి. ఈ దాడుల్లో మనోజ్‌ను కింద పడేసి కత్తులతో పొడిచారు. సంతోష్‌పై కర్రలు, బీరుబాటిళ్లతో దాడి చేశారు. కొట్లాటలో గాయపడిన తాడిగడప గ్రామానికి చెందిన పెదపూడి మనోజ్ అలియాస్ టోనీ, గుడివాక రాహుల్ వెంకటసాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొట్లాటలో టోనీ, రాహుల్ వెంకటసాయిలతో పాటు కిరణ్ అలియాస్ గనీ, సంతోష్‌చందు, భాగ్యరాజ్, దినేష్ అలియాస్ పండు, సతీష్, విన్ను, ప్రేమ్, బుడియ్య, దర్శి వెంకటసాయికుమార్, జగదీష్, రవితేజ, ఉప్పెర్ల సాయికుమార్ మరి కొంతమంది ఈ గ్యాంగ్‌వార్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గ్యాంగ్‌వార్‌లో పాల్గొన్న యువకుల్లో తొమ్మిది మందిని రిమాండ్‌కు పంపగా, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గతేడాది యనమలకుదురు డొంక రోడ్డులో యువకుల మధ్య జరిగిన గొడవ చిలికి చిలికి గాలివానగా మారి రఫీ హత్యకు దారి తీసిన సంగతి తెలిసిందే.

టీడీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని పామర్రు నియోజకవర్గంలో పోలీసులు వేధింపులకు దిగుతున్నారు. ఎప్పుడో 2020లో నమోదైన కేసును బూచిగా చూపుతూ రౌడీషీట్ తెరుస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినా మాకీ వేధింపులు ఏమిటంటూ తెలుగు తమ్ముళ్లు గగ్గోలు పెడుతున్నారు.

తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద అనుచరులతో చెన్నుపాటి శ్రీధర్



లోకేశ్ కోసం ధర్నా చేశావ్! నీపై రౌడీషీట్ తెరుస్తాం

2020 నాటి కేసును తిరగదోడి బెదిరింపులు

- టీడీపీ నాయకులకు పోలీసుమార్కు వేధింపులు
- పామర్రు నియోజకవర్గంలో చిత్రమైన పరిస్థితి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : రాజధాని రైతుల ఆందోళన సమయంలో వారికి మద్దతుగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు 24 గంటలపాటు నిరాహార దీక్ష చేశారు. ఆయనకు మద్దతుగా ఆ దీక్షలో పాల్గొన్న నారా లోకేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తోట్లవల్లూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి నిర్బంధించారు. పోలీసుల వైఖరికి నిరసనగా అప్పట్లో తోట్లవల్లూరు మండల టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎ1గా టీడీపీ బీసీ నాయకుడు వి.గురుమూర్తిని, ఏ2గా వల్లూరుపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు చెన్నుపాటి శ్రీధర్‌ను పెట్టారు. వీరితోపాటు పలువురు టీడీపీ నాయకులు కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. అలాగే 2023లో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళన చేసినందుకు గాను గురుమూర్తి, చెన్నుపాటి శ్రీధర్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులను తిరగదోడిన తోట్లవల్లూరు పోలీసులు టీడీపీ నాయకులను వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. తోట్లవల్లూరు ఎస్ఐ అర్జునరాజు బుధవారం వల్లూరుపాలెం టీడీపీ నాయకుడు చెన్నుపాటి శ్రీధర్ ఇంటికి ఇద్దరు కానిస్టేబుళ్లను పంపి శ్రీధర్‌ను స్టేషన్‌కు తీసుకురావాల్సిందిగా ఆదేశించారు. స్టేషన్‌కు వెళ్లిన శ్రీధర్‌ను రోజంతా కూర్చోబెట్టి తిరిగి గురువారం స్టేషన్‌కు రావాలంటూ పంపేశారు. గురువారం ఉదయం స్టేషన్‌కు వెళ్లిన శ్రీధర్‌ను వేలిముద్రలు, ఫొటోలు ఇవ్వాలంటూ

మిగతా 6లో..

ప్రజా క్షేమం, నగరాభివృద్ధే లక్ష్యం

- వివిధ విభాగాల అధిపతుల సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

8లో

స్నాచర్‌గా మారిన జిమ్ ట్రైనర్

- అప్పులు తీర్చడానికి గొలుసు చోరీలు

8లో



వీహెచ్‌పీ కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాండేకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న పుట్టగుంట సతీశ్

దేవాలయాల పరిరక్షణకు కృషి

» వీహెచ్‌పీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాండే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

'దేశంలో దేవాలయాలు, హిందూ ధర్మ పరిరక్షణకు విశ్వ హిందూ పరిషత్ కృషి చేస్తోంది. దేవాలయాల నిర్మాణం, నిర్వహణలో ప్రభుత్వాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది.' అని వీహెచ్‌పీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. గురువారం విజయవాడలోని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్ట గుంట సతీశ్‌కుమార్ నివాసానికి మాజీ ఎంపీ, వీహెచ్‌పీ జాతీయ ఉపా ధ్యక్షుడు గోకరాజు గంగరాజుతో కలిసి ఆయన విచ్చేశారు. గంటసేపు సతీ శ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. రెండు దశా బ్దాలుగా సతీశ్ చేస్తున్న సేవల్ని తెలుసుకుని, ప్రత్యక్షంగా కలవాలని వచ్చానని మిలింద్ తెలిపారు. పుట్టగుంట లాంటి సేవాతత్పరులు హిందూ ధర్మపరిరక్షణలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విజయ వాడలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులతో సమావేశమ య్యేందుకు వచ్చిన మిలింద్ పరాండే, పుట్టగుంట నివాసానికి రావడం.. గంటపాటు భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. మిలింద్ వెంట వీహెచ్‌పీ ముఖ్యులు శ్రీనివాసరెడ్డి, నవీన్, కోనేరు దుర్గాప్రసాద్ ఉన్నారు.



మొవ్వ అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

రూ.250 కోట్లతో ఫైర్‌స్టేషన్ల ఆధునికీకరణ

» అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసరెడ్డి

కూచిపూడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులు రూ.250 కోట్లతో అగ్నిమాపక కేంద్రాలను ఆధునీకరిస్తామని ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందులో 75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఆయన పేర్కొన్నారు. మొవ్వ అగ్నిమాపక కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అగ్నిమాపక వాహనాన్ని, అగ్ని ప్రమా ద సమయాల్లో వినియోగించే పరికరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అగ్నిమాపక కేంద్రాల్లో సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. 100 అగ్నిమాపక యంత్రాలు కొనుగోలు, 17 నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు, సచివాలయాల వద్ద, రాజమండ్రి రూరల్‌లో ఒక్కొక్కటి, విశాఖపట్నంలో ఆరు, భోగాపురం విమానాశ్రయం వద్ద, ప్రకాశం జిల్లాలో ఏడు కేంద్రాల ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సత్తెనపల్లి వద్ద అడ్వాన్స్ రిస్క్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా రూ.4.5 కోట్లతో అత్యాధునిక హంగులు గల వాహనాన్ని కొనుగోలు చేసి భారీ ప్రమాదాలు అరికడతామన్నారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు అదుపులోకి తీసుకురావటానికి 25 మంది సిబ్బందికి గుజరాత్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. భారీ అగ్ని ప్రమాదాల సమయంలో సమాచారం సత్వరం చేరేందుకు విజయవాడ లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఫైర్ అధికారి జి.ఏసురత్నం, మొవ్వ ఫైర్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 70వేల ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

» కృష్ణా జేసీ గీతాంజలిశర్మ



మచిలీపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు కృష్ణా జిల్లాలో 70వేల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామని జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. జేసీ చాంబరులో గురువారం విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.30 లక్షల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని, 70 వేల సిలిండర్లను అందించామని ఆమె తెలిపారు. వినియోగదారులకు ఏ ఇబ్బందులు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబరు 1967కు కాల్‌చేయాలని ఆమె సూచించారు. ఏడా దికి మూడు సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, మొదటి సిలిం డర్‌ను పొందేందుకు మార్చి 31వ తేదీ వరకు సమయం ఉందని ఆమె తెలిపారు. రెండో సిలిండర్‌ను ఏప్రిల్ నుంచి జూలై వరకు, మూడో సిలిం డర్‌ను ఆగస్టు నుంచి డిసెంబరు వరకు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఉచిత గ్యాస్‌సిలిండర్ కోసం బుక్‌చేసుకున్నవారు ముందుగా నగదు చెల్లిం చాలని తెలిపారు. సిలిండర్ అందిన 48గంటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీ నగదు వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుం దని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు, ఆధార్‌కార్డుకు ఈకేవైసీ చేయించక పోతే వినియోగదారుల ఇంటివద్దకే గ్యాస్‌డీలర్ల ప్రతినిధులు వచ్చి ఈకే వైసీ చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. డీఎస్వో పార్వతి పాల్గొన్నారు.



డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బైరా రామకోటేశ్వరరావు

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా

బైరా రామకోటేశ్వరరావు

విజయవాడ లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా బైరా రామకోటేశ్వరరావు గురువారం పదవీ బాధ్య తలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో ఆయన ఉదయం 11 గంటలకు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వి. రాజేంద్రప్రసాద్, ఎం.విజయ, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లాం అజోయ్ ప్రేమ్‌కుమార్ సమక్షంలో బాధ్యతలు స్వీకరిం చారు. తనను డీపీపీగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత, ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌కు బైరా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రాసిక్యూటర్లందరూ బాధితులకు న్యాయం జరిగే విధంగా పనిచేయాలని, నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రాసిక్యూటర్ వ్యవస్థను పటిష్ట పరచాలని తెలిపారు. బైరాను న్యాయవాది కళ్లే నాగేశ్వరరావు, ముప్పూరి హరీష్, న్యాయవాదులు, ప్రాసిక్యూషన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు, రాజకీయ నాయకులు అభినందించారు.

బందరు రోడ్డుపై ట్రాఫిక్‌ను తప్పించుకుని వెళ్లాలనే విజయవాడ ప్రజల ఐదున్నరేళ్ల నిరీక్షణకు తెరపడుతోంది. పంట కాల్వరోడ్డుపై వీఆర్ సిద్ధార్థ కళాశాల వంతెన పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. వంతెనపై బీటీ రోడ్డు నిర్మాణం గురువారంతో పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూనుకుని వంతెనపై వీఆర్ సిద్ధార్థ కళాశాల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రూ.లక్షల వ్యయంతో సౌండ్ బ్యారియర్స్ ఏర్పాటు చేయడం, వంతెన కింద లక్షల వ్యయంతో క్లోజ్డ్ డ్రెయిన్ నిర్మించి, చివరగా కళాశాల యాజమాన్యంతో బీటీ రోడ్డు నిర్మింపజేసి వంతెనను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం అభినందనీయమని స్థానికులు అంటున్నారు. ఈ ఘనత ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కూటమి ప్రభుత్వానిదేనని అంటున్నారు.



అందుబాటులోకి..

వీఆర్ సిద్ధార్థ కళాశాల వంతెనపై పూర్తయిన బీటీ రోడ్డు

వీఆర్ వంతెన

పంటకాల్వ రోడ్డులో వంతెనపై బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి ● బందరు రోడ్డుపై తగ్గనున్న ట్రాఫిక్

(ఆంధ్రజ్యోతి-పెనమలూరు)

విజయవాడ బందరు రోడ్డుపై రద్దీని తగ్గించేందుకు 2018లో సీఆర్డీయే ఆధ్వర్యంలో వీఆర్ సిద్ధార్థ కళాశాల వద్ద వంతెన నిర్మాణం చేపట్టారు. సిద్ధార్థ అకాడమీతో కలిసి సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవతో ఒప్పందం చేసుకున్నారు. రూ.11 కోట్లతో ఫైవంతెన నిర్మాణం బాధ్యతను అకాడమీకి అప్పగించారు. ఫైవంతెనపై శబ్ద కాలుష్య నివారణకు సౌండ్ బ్యారియర్స్ ఏర్పాటు, కింద నుంచి డ్రైనేజీ కాల్వ నిర్మాణం సీఆర్డీయే ఆధ్వర్యంలో చేపట్టాలనేది ఒప్పందం. అనుకున్నట్లుగానే ఏడాదిలోనే అకాడమీవారు సొంత నిధులతో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. కానీ 2019లో వైసీపీ ప్రభుత్వం రాకతో సీను రివర్సైంది. సీఆర్డీయే పనులు నిలిచిపోయాయి. కేవలం పదిశాతమే మిగిలి ఉన్న పనులు నిధుల లేమితో అధికారులు ఆపివేశారు. దీంతో వంతెన పూర్తయినా దానిపై రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో వాహనదారులకు అందుబాటులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే నాలుగు వందల మీటర్ల పొడవైన వంతెనపై కోటి రూపాయల ఖర్చుతో సౌండ్ బ్యారియర్స్, వంతెన కింద భాగం నుంచి ఎనిమిది వందల మీటర్ల పొడవైన డ్రెయినేజీ కాల్వ నిర్మాణం చేపట్టారు. సిద్ధార్థ అకాడమీ సొంత నిధులతో బుధ, గురువారాల్లో వంతెనపై భాగంలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. దీంతో వంతెన పంటకాల్వ రోడ్డుపై ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది.


ఎవరెవరికి ఉపయోగమంటే..

ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో బందరు, ఉయ్యూరు, కంకిపాడు, ఏలూరు రోడ్డు వైపు నుంచి వచ్చే ప్రయాణికులు బందరు రోడ్డుకు సమాంతరంగా ఉన్న పంటకాల్వ రోడ్డుపై సులువుగా వెళ్లొచ్చు. విజయవాడ వైపు నుంచి ఎనికేపాడు, ఏలూరు రోడ్డు, ఉయ్యూరు, కంకిపాడు బందరు వైపు వెళ్లే ప్రయాణికులు పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చీలి పంటకాల్వ రోడ్డుద్వారా సిద్ధార్థ వంతెన పైనుంచి వెళ్లొచ్చు. పంటకాల్వ రోడ్డు నుంచి ఆయా మార్గాల ప్రజలు రాకపోకలు సాగించడం ద్వారా బందరు రోడ్డుపై చాలా వరకు రద్దీ తగ్గుతుంది.

ఇప్పటికి సాకారమవుతోంది

ఆరేళ్లుగా వంతెన పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక, పనులు పూర్తయ్యాయి. వంతెన అందుబాటులోకి రావడంతో రద్దీ లేకుండా ప్రయాణించొచ్చు. ఎన్నో ఏళ్లుగా వంతెనపై ప్రయాణించాలన్న కల ఇప్పటికి సాకారమవుతోంది.

- వెలగపూడి శంకరబాబు, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు





ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్ఐ మిషన్

మొరాయిస్తున్న ఎంఆర్ఐ మిషన్లు

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి): సర్వజనాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాల మాట దేవుడెరుగు కనీస వైద్య సౌకర్యాలు అందడం లేదని ఈమధ్య కాలంలో తరచూ వినిపిస్తోంది. నిత్యం వేలాది రోగులు విజయవాడలో ఉన్న అతి పెద్ద ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం నిమిత్తం వస్తూ ఉంటారు. 1,657 పడకలు ఉన్న వైద్యశాలలో వైద్య సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండటంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్లు పదే పదే మొరాయించడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గంటలసేపు క్యూ లైన్‌లో నిలబడలేక రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం వచ్చి ఓపీ రాయించుకుని సంబంధిత వైద్యుల వద్దకు వెళ్లేందుకే గంటల సమయం వృథాగా పోతోందని, తీరా ఎంఆర్ఐ స్కానింగ్‌కు వెళితే అక్కడ గంటల సమయం వృథాగా పోతోందని అంటున్నారు. పదేపదే అవి మొరాయించడంతో ఇంకా ఇబ్బంది పడుతున్నామని రోగులు వాపోతున్నారు. రోజుకు కేవలం 40 మందికే స్కానింగ్ తీస్తున్నామని ఒక్కొక్క రోగికి 45 నిమిషాలు పడుతోందని టెక్నీషియన్స్ చెబుతున్నారు. అధికారులు స్పందించి, కండిషన్‌లో ఉన్న ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాలు ఉంచాలని, మరో రెండు కొత్తవి ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

నేడు మచిలీపట్నానికి

వైఎస్ షర్మిల రాక

మచిలీపట్నం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితుడైన శొంఠి నాగరాజు ప్రమాణస్వీకార కార్యక్రమానికి శుక్రవారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నగరానికి వస్తున్నారని, కార్యక్రమం విజయవంతం చేయాలని, కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా షర్మిల మచిలీపట్నం వస్తున్నారన్నారు. ఉదయం 10 గంటలకు షర్మిల మూడు స్తంభాల సెంటర్‌కు వస్తారని, అక్కడ నుంచి పెడన రోడ్డులోని జీ కన్వెన్షన్ హాలులో నిర్వహించే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని శొంఠి నాగరాజు తెలిపారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి రాజ్య పురస్కారం అందుకుంటున్న గుడి షారోన్ సంజయ్

డీఏవీ విద్యార్థికి రాజ్య పురస్కారం

ఇబ్రహీంపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డీఏవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న స్కౌట్ విద్యార్థి గుడి షారోన్ సంజయ్ అనే స్కౌట్ విద్యార్థి గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్ నుంచి రాజ్య పురస్కారం అందుకున్నారు. విద్యార్థిని హెచ్‌ఎం డి.మన్మోహన్, స్కౌట్ మాస్టర్ డి.యోగేశ్వరరావు, విద్యార్థులు అభినందించారు.

జోగి రమేశ్..గొంగలి పురుగులాంటోడు

» పెడనలో ఆయన నిర్వాకాలు వెల్లడి చేస్తాం

» ఎన్టీటీపీఎస్ బూడిదను కౌంటర్ పెట్టి అమ్మిన దౌర్భాగ్యులు జోగి ముఠా

» మిన్నకున్నామని దిగజారి ప్రవర్తిస్తే సహించం

» ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ హెచ్చరిక

మైలవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేశ్.. గొంగలి పురుగులాంటోడు. వైసీపీలో చేరక ముందు ఇలాంటి కొడుకును ఎలా కన్నావమ్మా అని జగన్‌ను ఉద్దేశించి వైఎస్ విజయమ్మను ఆయన ప్రశ్నించాడు. ఆ విషయం జోగి మర్చిపోయినా ప్రజల మర్చిపోలేదు. జోగి గురించి ఎవరు మాట్లాడినా వారి స్థాయి తగ్గించుకున్నట్లే.' అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ విమర్శించారు. బుధవారం వైసీపీ ఆత్మీయ సమావేశంలో తనపై జోగి చేసిన విమర్శలకు గురువారం ఆయన స్పందించారు. జోగి బాగోతం గురించి పెడనలో ఆయన చేసిన నిర్వాకాల గురించి రేపట్నుంచి సోషల్ మీడియాలో బాధితుల ద్వారా నిజాలు వెల్లడి చేస్తామన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిదను కౌంటర్ పెట్టి అమ్మిన దౌర్భాగ్యులు జోగి ముఠా అన్నారు. 2019లో సీటు త్యాగం చేసి పెడన వెళ్లాడో లేక అమ్ముకొని వెళ్లాడో ప్రజలందరికీ తెలుసునన్నారు. నీ ఎదుగుదలకు నారు, నీరు పోసిన సొంత బాబాయ్ వద్ద ఇండస్ట్రీశాఖ నుంచి నిధులు ఇప్పించి లంచం తీసుకున్నావా లేదా అని జోగిని ప్రశ్నించారు. సొంత బాబాయ్‌కి అప్పు ఉండి దొంగ భూములు కట్టబెట్టిన చరిత్ర జోగిదన్నారు. వైసీపీ నాయకుల వద్ద బిల్లుల ఇప్పించేందుకు జోగి లంచం కింద 20 నుంచి 30 శాతం కమీషన్ రూపంలో తీసుకున్నారని ఆధారాలతో సహా నిరూపిస్తానన్నారు. వరదల్లో ప్రజలు అల్లాడుతుంటే పీసమెత్తు మానవత్వం చూపని జోగి నేనున్నా ఆదుకుంటా అని క్యాడర్‌కు అబద్ధాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2018, 19కి ముందు ఆయనకున్న వాహనాలు ఎన్నో నివసించిన ఇల్లు ఏదో ఇప్పుడు ఉంటున్న ఇల్లు ఎక్కడి నుంచి వచ్చిన సొమ్ముతో కట్టాడో జిల్లాలోనే అత్యంత ధనికుడిగా జోగి ఎలా మారాడో ప్రజలు గమనిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఆస్తులను ఏ డబ్బులతో కొన్నాడో చెప్పాలన్నారు. మర్యాద, గౌరవం కాపాడుకోవాలంటే అది ఆయన చేతల్లోనే ఉందని ప్రజాస్వామ్యబద్ధంగా మిన్నకున్నామని గీత దాటి దిగజారి ప్రవర్తిస్తే సహించేది లేదని జోగిని హెచ్చరించారు.

ట్రాక్టర్ ఇసుకకు రూ.500లే వసూలు చేయమన్నా

» తహసీల్దార్ కుసుమకుమారి వివరణ

తోట్లవల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో నడుస్తున్న ఉచిత ఇసుక క్వారీల్లో ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.500 మాత్రమే వసూలు చేయాలని చెప్పానని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి వివరణ ఇచ్చారు. గురువారం 'దోచుకున్నోడికి దోచుకున్నంత' శీర్షికన వచ్చిన వార్తా కథనంపై ఆమె స్పందించారు. క్వారీలను మూతవేస్తే ఇసుక దొరకటం లేదంటున్నారని, క్వారీలు నడవనిస్తే నిందలు వేస్తున్నారని, తాను క్వారీల్లో ఎవ్వరి నుంచి రూపాయి కూడా తీసుకోలేదని తెలిపారు. అధికారులకు లంచాలపై బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయని తెలపగా అలాంటి వారిని తనవద్దకు తీసుకు రావాలని వాదన చేశారు. జీవో ప్రకారం ఇసుక క్వారీలపై తాము జోక్యం చేసుకోలేమని చెప్పిన తహసీల్దార్ గురువారం రూ.500 వసూలు చేయాలని ఆదేశించామని చెప్పటం విడ్డూరంగా ఉంది. క్వారీల్లో రూ.1000 చొప్పున వసూలు చేస్తుంటే తమకు సంబంధం లేదంటే అధిక దోపిడీని ఇంకెవరు అరికడతారో తెలియకుండా ఉంది.

మర్యాదపూర్వకంగా..

» ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ గురువారం గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి చిన్ని దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందించి సత్కరించారు. అనంతరం రాజకీయ పరిస్థితులపై పలు అంశాలను చర్చించారు. టీడీ పీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

లోకేశ్ కోసం ధర్నా చేశావ్!

నీపై రౌడీషీట్ తెరుస్తాం

(5వ పేజీ తరువాయి)

కోరడంతో ఆయన తనపై ఏ కేసు ఉంది.. ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నించడంతో ఎస్‌ఐ ఆగ్రహంతో ఊగిపోతూ.. ఎక్కువ మాట్లాడితే బొక్కలో తోస్తా.. రౌడీ షీట్ తెరుస్తా అంటూ బూతులు తిట్టడం మొదలుపెట్టారని తెలిసింది. 'నీ పార్టీ నాయకులే నీపై కేసులు పెట్టి లోపలేయమంటు న్నారు. నాకు పైఅధికారుల నుంచి ఒత్తిడి ఉంది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తనపై ఉన్న కేసు వివరాలు ఏమిటతో చెబితే కానీ తాను వేలిముద్రలు ఇవ్వనని శ్రీధర్ అడ్డం తిరగడంతో చేసేది లేక ఆయన్ను పంపేశారు. శ్రీధర్ తరహాలోనే పామర్రు నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులకు పోలీసుల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్టు..!

నియోజకవర్గంలో టీడీపీ నాయకులపై పోలీసులు పెట్టే కేసులు.. పాత కేసులు పేరుతో వేధిస్తుంటే పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఏం చేస్తున్నారంటూ టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో కొందరు నాయకుల చెప్పుడు మాటలు విని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎమ్మెల్యే ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. తోట్లవల్లూరు పోలీసుస్టేషన్ వద్ద వల్లూరుపాలెం టీడీపీ నాయకులు చెన్నుపాటి శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ.. తమ మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం వల్లే తాము ఇబ్బందులు పడుతున్నామని, చివరికి తమపై పోలీసులతో తప్పుడు కేసులు బనాయించే స్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేతలు చంద్రబాబు, లోకేశ్ కోసం ధర్నాలు చేయడమేనా తాము చేసిన తప్పు అని ఆయన ప్రశ్నించారు. పార్టీ కోసం ఎలాంటి కార్యక్రమాలు చేయని వారు ఇప్పుడు ఎమ్మెల్యే పక్కన చేరి పెత్తనం చలాయిస్తున్నారని వాపోయారు.

వైసీపీ నేతల అరాచకాలపై ఏకరవు

» టీడీపీ ప్రజాదర్బార్‌లో వైసీపీ బాధితుల ఫిర్యాదులు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పడిన ఇబ్బందులపై వైసీపీ బాధితులు టీడీపీ ప్రజాదర్బార్‌లో గోడు వెళ్లబోసుకున్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు రిష్వంత్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైసీపీ సానుభూతిపరులు దొంగతనంగా తన ఫ్యాక్టరీలోకి ప్రవేశించి రూ.20 లక్షల గార్మెంట్స్ తయారీ సామాగ్రిని కొట్టేశారని, ఫిర్యాదు చేస్తే.. పోలీసులు పట్టించుకోలేదని తిరుపతికి చెందిన ఎస్.అజీమ్‌బాషా వాపోయారు. తన భర్త ద్వారా సంక్రమించిన భూమికి అన్ని ఆధారాలూ ఉన్నా.. వైసీపీ నేతలతో అధికారులు కుమ్మక్కై 1బీ అడంగల్‌లో తన పేరు లేకుండా చేశారని కడప జిల్లా చిలేకాంపల్లెకు చెందిన చంద్రమ్మ గోడు వెళ్లబోసుకున్నారు. తమ అధీనంలో ఉండి, పన్ను కడుతున్న భూమికి వైసీపీ నేతలు దొంగ పత్రాలు సృష్టించి, తన భూమిలోకి తనను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన చల్లారి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తాను టీడీపీ కార్యకర్త అని, 2014-19లో చేసిన నిర్మాణపనులకు బిల్లులు ఇవ్వకుండా గత ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందని, బిల్లులు మంజూరు చేసి, ఆదుకోవాలని తిరుపతి జిల్లా చిన్న పొండూరుకు చెందిన రాజేంద్ర నాయుడు కోరారు. హ్యాపీ ఫీచర్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న రూ.6.20లక్షలను కొట్టేసి, తమకు తెలియదంటున్నారని తెనాలికి చెందిన యార్లగడ్డ వెంకటేశ్వర్లు వాపోయారు. రెవెన్యూ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వారు కేటాయించిన స్థలం అన్యాక్రాంతం చేసి, అక్రమ నిర్మాణాలు చేపట్టారని విజయవాడకు చెందిన మహ్మద్ లియాకత్‌అలీ ఫిర్యాదు చేశారు.

నాటుసారా ముడిసరుకుపై నిఘా

» బెల్టులు, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠిన చర్యలు

» ఎక్సైజ్ అధికారుల సమావేశంలో ఆదేశాలు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి వినియోగిస్తున్న ముడిసరుకుపై నిఘా పెట్టాలని ఎక్సైజ్ శాఖ ఆదేశించింది. నాటుసారాను పట్టుకోవడంతోపాటు అందుకు అవసరమైన ముడిసరుకు సరఫరా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక బృందాలతో గంజాయిపై దాడులు చేయాలని నిర్ణయించింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఈఎస్‌లతో గురువారం మంగళగిరిలో జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులు ఈమేరకు ఆదేశాలు జారీచేశారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్టులకు మద్యం సరఫరాపై పెంచిన జరిమానాలు రెండ్రోజుల్లో అమల్లోకి రానున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. షాపుల్లో మరీ ఎక్కువ మద్యం విక్రయించినా, మరీ తక్కువ అమ్మకాలున్నా వాటిని తనిఖీ చేసి కారణాలు వెలికితీయాలని సూచించారు. బహిరంగంగా మద్యం సేవించడం ఎక్కడా కనిపించకూడదన్నారు. ఇప్పటివరకూ 90వేల ఎక్సైజ్ కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేయలేదని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్టులను ఉపేక్షించవద్దన్నారు. ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధించాలని నిర్దేశించారు. కల్తీ మద్యం ఎక్కడా కనిపించకూడదని, మద్యంపై జరిపే పరీక్షలు భారీగా పెంచామని తెలిపారు. డీఅడిక్షన్ కేంద్రాలు ఏర్పాటుచేసి మద్యం వినియోగదారులను అప్రమత్తం చేయాలన్నారు.

విజయవాడ తూర్పు



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

బుడమేరు వంతెనకు రెయిలింగ్ ఏర్పాటు



గుణదల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుణదల బుడమేరు వంతెనకు ఉన్న రెయిలింగ్ కొద్ది రోజుల క్రితం వచ్చిన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. స్థానికులు సదరు సమస్యను ఎమ్మెల్యే బొండా ఉమా దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించిన ఆయన వీఎంసీ అధికారులతో మాట్లాడి రెయిలింగ్ ఏర్పాటు చేయించారు. రెయిలింగ్ ఏర్పాటు చేశాక పాదచారులు, వాహనదారుల ప్రయాణాలకు సులభంగా ఉందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణీత వ్యవధిలోగా నగదు జమ చేయాలి

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ



మహిళా సమైక్య సభ్యులతో ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.నారాయణ తదితరులు

లబ్బీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సభ్యులందరూ నిర్ణీత వ్యవధిలో నగదు జమ చేయాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. నారాయణ సూచించారు. జిల్లా మహిళా సమైక్య ప్రథమ సమావేశం సర్కిల్ 3 కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సహాయ సంఘాలు డేటా నిర్వహణ, పీఎం స్వానిధి, పట్టణ సమైక్యల పనితీరు వంటి విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్ టు రిచ్ అనే నినాదం ద్వారా రాష్ట్రంలో ప్రతి మహిళను లక్షాధికారిగా చేసేందుకు తలపెట్టిన ప్రతి కార్యక్రమానికి సమైక్య సభ్యులు అండగా నిలవాలన్నారు. జిల్లా అర్బన్ మహిళా సమైక్య అధ్యక్షురాలు కె.మీనాక్షి మాట్లాడుతూ స్వయం సహాయక సమూహాల పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకునేలా సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి లక్ష్యాలకు అనుగుణంగా సహకారం అందిస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సమైక్య అధికారులు నజీమున్, త్రివేణి, లక్ష్మీ, డాక్టర్ ఫణికుమార్, శేఖర్, సుజాత, శ్యామల, తిరువూరు, జగ్గయ్యపేట, కొండపల్లి మున్సిపాలిటీల నుంచి సమైక్యల అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగం పేరిట నగదు వసూలు

పోలీసుల అదుపులో ఒకరు

ఆటోనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన కేసులో సాతుపాటి అరవింద్ కుమార్ అలియాస్ సోనును పటమట పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. పోలీసుల వివరాల మేరకు పటమ టకు చెందిన పొట్లూరి కల్యాణికి ఇద్దరు కుమారులు. స్నేహితురాలి ద్వారా కళ్యాణికి భవానీపురానికి చెందిన వెన్నా చరణ్ పరిచయమయ్యాడు. తాను యూకే వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నానని మీ పెద్ద కుమా రుడుకి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో చరణ్ భార్య నీలిమతో కలిసి కల్యాణి ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడు. ఈ క్రమంలోనే యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పలు దఫాలుగా కల్యాణి నుంచి చరణ్, నీలిమ, లావణ్య, అరవింద్ కుమార్ అలియాస్ సోను, బొర్రా ప్రదీప్‌లు రూ.81 లక్షలు తీసుకున్నారు. తర్వాత ఉద్యోగం సంగతి గురించి అడుగుతుంటే మాట దాటేస్తూ వచ్చారు. భవనీపురంలోని చరణ్ ఇంటికి వెళ్లి కనీసం తాము ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని అడిగితే దూషిస్తు కత్తితో చంపుతానని బెదిరించాడని తెలిపారు. ఉద్యోగం ఇప్పించకుండానే డబ్బులు వసూల్ చేసి తమను మోసం చేశారని ఈ ఏడాది 27 మార్చిన పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.





రేడియా ధార్మికతపై లయోలాలో అవగాహన సదస్సు

భారతీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మేరిక్యూరీ జయంతి సందర్భంగా ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం రేడియా ధార్మికత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మారిస్ స్టెల్లా కళాశాల డీన్, అధ్యాపకురాలు డాక్టర్ జి.లిటిల్ ఫ్లవర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మేరీక్యూరీ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ అధ్యాపకులు డాక్టర్ సాయి కృష్ణ కొల్లూరు, కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డి. బాలస్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.మహేష్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కేఆర్‌యూ అంతర్ కళాశాలల స్విమ్మింగ్ చాంప్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శాతవాహన కళాశాల ఆధ్వర్యంలో గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో 8న ఉదయం 8.30 గంటలకు కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల, మహిళలు స్విమ్మింగ్ చాంపియన్‌షిప్, యూనివర్సిటీ సెలక్షన్స్‌ను నిర్వహిస్తున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీసీహెచ్ సంగీత రావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు అర్హతా పత్రాలతో ఉదయం స్విమ్మింగ్‌పూల్ వద్ద రిపోర్టు చేయాలని ఆయన కోరారు.



దుర్గగుడిలో అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న మంత్రి సుభాష్., వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, సహస్ర లింగార్చన చేస్తున్న ఆలయ అర్చకులు

దుర్గగుడిలో ఘనంగా సహస్ర లింగార్చన

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని గురువారం కొనసాగించారు. సహస్ర లింగాలకు అభిషేకం, అర్చనాది కార్యక్రమాలు, హారతి, మంత్రపుష్పం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా వల్లీ దేవసేన - సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి దురగుడిలో కళావేదికపై గురువారం శుద్ధ షష్టితిథిని పురస్కరించుకుని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి లీలా కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్ర సమ్మతంగా కల్యాణోత్సవ ప్రక్రియను నిర్వహించారు. అమ్మవార్లకు, జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, స్వామికి, అమ్మవార్లకు మాలా పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. తలంబ్రాలను కడు రమణీయంగా సమర్పిం చారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల నామస్మరణల మధ్య వేడుకగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు.



కళావేదిక పై కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

కళావేదిక పై కూచిపూడి నృత్యం

దుర్గగుడి కళావేదికపై కామకోటినగర్‌కు చెందిన కృష్ణవేణి, నళినిల ఆధ్వర్యంలోని నటరాజ నృత్యాలయం కళాకారుల బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించింది. పలు కీర్తనలకు చక్కటి ప్రదర్శన చేసి ఆహుతుల అభినందనలు అందుకున్నారు. డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులకు సర్టిఫికెట్లను అందచేసి అభినందించారు.

అన్న ప్రసాదం స్వీకరించిన మంత్రి సుభాష్

మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దేవస్థానానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన అన్నవితరణ భాగంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నవితరణ భాగంలో ఏర్పాట్ల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో కెఎస్ రామరావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి వెంట డిప్యూటీ ఈవో రత్నరాజు, సంబంధిత అధికారులు ఉన్నారు.

50 బస్తాల పీడీఎస్ బియ్యం తరలింపు

పోలీసుల అదుపులో ఒకరు

ఆటోనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 50 బస్తాల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పటమట పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఆటోనగర్ గేట్ సమీపంలోని సాయి బాబా కల్యాణ మండపం వద్ద యనమలకుదురుకు చెందిన జల్లిపల్లి శ్రీ రామ్ అనే వ్యక్తి 50 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్నేహితుడి వాహనంలో తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పటమట ఎస్‌ఐ రామకృష్ణ వర్మ సంయుక్తంగా దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ వర్మ తెలిపారు. ఈ బియ్యం బీమవరం, కైకలూరు ప్రాంతాల్లోని చేపల చెరువు రైతులకు విక్రయించేందుకు తీసుకువెళ్తున్నా రన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అవగాహనతోనే కేన్సర్ గుర్తింపు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం. సుహాసిని



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో కేన్సర్‌పై అవగాహన ఉన్నప్పుడే ప్రాథమిక దశలో ఆ వ్యాధిని గుర్తించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం. సుహాసిని తెలిపారు. కేన్సర్ 3.0 సర్వే కార్యక్రమం గురువారం హనుమాన్‌పేటలో ప్రభుత్వ పాత ఆసుపత్రిలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జిల్లాలో ఈ నెలలో 18 ఏళ్ల పైబడిన వారికి సీహెచ్‌వో, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో కూడిన బృందం ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి కేన్సర్ లక్షణాలు ఉన్నవారికి తగిన చికిత్స అందజేస్తారని తెలిపారు. డాక్టర్ ఏవీ రావు మాట్లాడుతూ కేన్సర్ 3.0 సర్వే ద్వారా సమాజంలో ప్రాథమిక దశల్లో కేన్సర్ గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ పాత ఆసుపత్రి నుంచి గాంధీనగర్ ఏలూరు లాకుల వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థిని కేన్సర్ అవగాహన గేయం పాడి అందరినీ ఆకట్టుకుంది. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.సి.కె.నాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంవోలు డాక్టర్ పద్మావతి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్రీనివాసరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆషా పర్వీన్, వివిధ విభాగాల వైద్యులు, ఎన్జీవో సభ్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నవజాత శిశువుల ఆపరేషన్ విజయవంతం



ఆపరేషన్ అయిన శిశువులతో డాక్టర్లు, తల్లిదండ్రులు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల్లో పుట్టుకతో వచ్చే అత్యంత క్లిష్టమైన వ్యాధి ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టరీస్‌కు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వారు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. గురువారం ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు, చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతి ప్రకాష్‌లు మీడియాతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గుంజాం జిల్లాకు చెందిన మమతా నాయక్ బేబీ (4 నెలలు), పూజా రవుల బేబీ (5 నెలలు)లను ఆసుపత్రికి తీసుకురాగా ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కత్తుల అనూష, డాక్టర్లు చిరుగుపాటి భరత్ సిద్ధార్థ్, పవన్‌లు పాల్గొన్నారు.

త్వరలో కోర్టుల వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

విజయవాడ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతానని ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్ బెజవాడ బార్ న్యాయవా దులకు హామీ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని, కోర్టుల ఆవరణలో న్యాయవాదుల ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని బెజవాడ బార్ న్యాయవాదులు నగర పోలీసు కమిషనర్‌కు విన్నవించారు. ఆయన ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్ గురువారం బార్ అసోసియేషన్‌కు వచ్చి న్యాయవాదులను కలిసి ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. వాహనాల చోరీలు జరగకుండా నిఘా ఏర్పాటు చేస్తానని క్రైం ఏడీసీపీ రాజారావు హామీ ఇచ్చారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్. బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, శ్రీపతిరావు, పరమేశ్వరరావు, రాజేశ్వరరావు, బాషా, వరప్రసాద్ పాల్గొన్నారు.

అనైతిక విలువల వల్లే అనర్థాలు: రావి శారద



మాట్లాడుతున్న డాక్టర్ రావి శారద

మొగల్రాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అనేక అంశాల్లో విస్తరిస్తున్న అనైతిక విలువల ప్రభావం వల్ల జరుగుతున్న అనర్థాలు ఆందోళన కలిగించే రీతిలో ఉన్నాయని తరుణీ తరంగాలు అధ్యక్షురాలు డాక్టర్ రావి శారద ఆవేదన వ్యక్తం చేశారు. కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం సమాజంపై సామాజిక మాధ్యమాల ప్రభావం- పతనమవుతున్న విలువలు పరిష్కారాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవిత ప్రమాణాలు, ఆలోచనలు, సంస్కృతి, సాహిత్యాల మీద పడుతున్న ఈ ప్రభావం వల్ల సామాజిక, రాజకీయ దశ దిశలను ఆందోళన కలిగించే రీతిలో మారిపోవడానికి కారణం అవుతున్నాయని చెప్పారు. ఉపాధ్యక్షురాలు డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడుతూ విద్యార్థులు, మేధావులు, పౌరసమాజం, ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలు, గళమెత్తి చర్చించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ కె. సుహాసిని మాట్లాడుతూ సోషల్ మీడియా విచ్చలవిడితనాన్ని అరికట్టే విధంగా ప్రభుత్వాలు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

కార్తీకమాస మహోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



లబ్బీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 11 నుంచి 17 వరకు కార్తీక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హిందు ధర్మ ప్రచార పరిషత్ కోస్తా జిల్లా సూపరింటెండెంట్ మేడవరం కాంతి కుమార్‌తెలిపారు. టీటీడీ కల్యాణ మంటపంలో గురువారం కార్తీక మహోత్సవాల కరపత్రం, బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కామకోటినగర్‌లోని శంకరమఠంలో 7 రోజుల పాటు కార్తీక పురాణ ప్రవచన కార్యక్రమాలు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు ప్రవచనాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బొగ్గరపు వెంకటబాల కోటేశ్వరరావు, నండూరి వెంకటతాండవ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో ముగిసిన వర్క్‌షాప్

మొగల్రాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో నాలుగు రోజుల వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓడెన్‌క్రిక్ సంస్థ అధినేత జక్కంపూడి వెంకట అవినాష్ మాట్లాడుతూ పైథాన్ ఫ్లాస్క్ ఉపయోగించి రియల్ టైమ్ అప్లికేషన్‌ల రూపకల్పనలో పాటించాల్సిన మెళకువలను తెలిపారు. సోలెట్ సంస్థ డైరెక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగాల్లో ఉన్నత స్థాయి పరిజ్ఞానాన్ని పొందడానికి రియల్ టైమ్ అప్లికేషన్‌లు ఉపయోగపడతాయని కళాశాల డీఎస్, ఏఐ హెచ్‌వోడీ డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్సు విద్యార్థులు, బీఎస్సీ ఏఐ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రోయింగ్ సెలక్షన్స్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రోయింగ్ జట్టు సెలక్షన్స్‌ను జంగారెడ్డిగూడెంలోని శాప్ వాటర్‌స్పోర్ట్సు కాంప్లెక్సులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, సౌత్‌జోన్ ఖేలో ఇండియా సభ్యులు డాక్టర్ తరుణ్ కాకానీ ఒక ప్రకటనలో తెలిపారు.

పచ్చని పల్లె.. స్వచ్ఛ చల్లపల్లి

గాంధీజీ కలలుగన్న స్వచ్ఛభారత్ ఆశయాన్ని ఆచరణలో చూపుతున్న గ్రామం చల్లపల్లి. ఆయన స్ఫూర్తితో 2014లో ప్రధాని నరేంద్రమోదీ భారతీయులకిచ్చిన స్వచ్ఛభారత్ నినాదాన్ని అందుకుని చీపురు పట్టుకున్న చేతులు పదేళ్లుగా శ్రమిస్తూనే ఉన్నాయి. స్వచ్ఛత, పరిశుభ్రత లక్ష్యాలుగా ప్రజలకు ప్రాణం పోసే వైద్య దంపతులు చీపుర్లు చేతబట్టి నిరంతరం శ్రమిస్తున్న వైనం దేశంలో మరెక్కడా లేదుమో, ఇంతటి మహోద్యమానికి సారథ్యం వహించిన డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు నిత్యస్మరణీయులు, స్ఫూర్తిదాతలు.

స్ఫూర్తివంతమైన స్వచ్ఛసేవా ఉద్యమానికి పదేళ్లు

తెల్లవారుజామున నాలుగున్నర గంటలు అయిదంటే చాలు ఇంటినుంచీ ఒక్కొక్కరుగా కార్యకర్తలు స్వచ్ఛసేవకు బయలుదేరుతారు. నిర్ణయించుకున్న ప్రాంతానికి వెళ్లి పారిశుధ్య పనులు మొదలుపెడతారు. రోడ్లు ఊడ్వటం, డ్రైనేజీలు శుభ్రపరచటం, మొక్కలు నాటటం, కుప్పలుగా మారిన చెత్తను ట్రాక్టర్లకు ఎత్తి డంపింగ్ యార్డుకు తరలించటం. ఇలా ఏ పనైనా వెనకడుగు వేసేదే లేదు. ఆరున్నర గంటలకు విజిల్ వేయటంతో పని ఆపేసి టీ, కాఫీలు తాగి అందరూ ఒకచోట చేరి జై స్వచ్ఛ సుందర చల్లపల్లి అంటూ నినదించి ఆ రోజు విశేషాలు కొద్దిసేపు ముచ్చటించి మరుసటి రోజు ఎక్కడ కలవాలో నిర్ణయించుకుని అక్కడి నుంచీ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు. ఇది ప్రతి రోజూ గ్రామంలో స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల దినచర్య. వయోభేదం, స్త్రీ, పురుష తారతమ్యం, ధనవంతులూ, పేదవారు, ఉద్యోగులూ, కార్మికులూ అన్న తేడా లేమీ లేవు. అందరూ స్వచ్ఛకార్యకర్తలేనన్న ఏకత్వం ఒక్కటే విభిన్న వ్యక్తులనందరినీ కలిపి స్వచ్ఛ చల్లపల్లి సేవా ఉద్యమంగా మారింది. - ఆంధ్రజ్యోతి - చల్లపల్లి





- దేశస్థాయిలో గుర్తింపు.. ఎల్లలు దాటిన స్వచ్ఛస్ఫూర్తి
- కార్యకర్తల నిస్వార్థ సేవానిరతి
- డీఆర్కే దంపతుల సేవాభావం స్ఫూర్తిదాయకం
- పదేళ్ల వేడుకకు 'స్వచ్ఛ చల్లపల్లి' సిద్ధం





పదేళ్ల ఉద్యమ ప్రస్థానం

జనవిజ్ఞాన వేదిక ద్వారా పాముకాటు వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్యశిబిరాలతో తమవంతు సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్న డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు ప్రారంభించిన స్వచ్ఛ ఉద్యమం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకోనుంది. 2014 నవంబరు 12న సుమారు 15మంది కార్యకర్తలతో ప్రారంభమైన ఉద్యమంలో ఎందరో భాగస్వాములయ్యారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఈ స్వచ్ఛ ఉద్యమం రాష్ట్ర, దేశస్థాయిలో గుర్తింపుతోపాటు ఎల్లలు దాటి విదేశాలకు సైతం విస్తరించింది.

సుందరీకరణతో టూరిస్ట్ స్పాట్స్

చల్లపల్లి గ్రామం స్వచ్ఛ చల్లపల్లికి ముందు, తర్వాత అని చెప్పవచ్చు. ఎటు చూసినా చెత్త కుండీలు, అపరిశుభ్రత, బహిర్భూమి వీధులు, మినీ డంపింగ్ యార్డుగా మారిన ప్రదేశాలు, పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలతో అధ్వాన్నంగా ఉండే గ్రామంలో స్వచ్ఛ చల్లపల్లి ప్రారంభం తర్వాత మారిపోయింది. చెత్తకుండీలు లేని గ్రామంగా, సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దబడింది. డాక్టర్ పద్మావతి ఆలోచనలతో గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గంగులవారిపాలెం రోడ్డును బాగు చేసి సెల్ఫీ పాయింట్, వాటర్ ఫౌంటైన్‌ను ఏర్పాటు చేసి రంగురంగుల లైట్లు అమర్చి పాత సినిమాల సంగీత పాటలను వినిపిస్తూ ఆ బజారుకు వస్తే మధురానుభూతిని మిగిల్చేలా అభివృద్ధి చేశారు.

శ్మశానవాటిక అభివృద్ధి

శ్మశానవాటిక అభివృద్ధి స్వచ్ఛోద్యమంలో మణిహారంగా చెప్పవచ్చు. శ్మశానవాటిక ప్రాంతం (చిల్లలవాగు గట్టున) గతంలో అధ్వాన్నంగా ఉండేది. ఈ ప్రాంతాన్ని కార్యకర్తలు శుభ్రం చేయటం నభూతో న భవిష్యతి ఉన్నట్టు మారిపోయింది. దాదాపు నెలరోజులు శ్రమించి శ్మశానవాటిక ప్రాంతాన్నీ, డంపింగ్ యార్డు ప్రాంతాన్ని శుభ్రపరిచి సుందరీకరణ ప్రారంభించారు. తర్వాత తరిగోపుల ప్రాంగణంగా పేరు పెట్టారు.

వేల మొక్కలతో పచ్చనిపల్లె

స్వచ్ఛ ఉద్యమం ప్రారంభించాక వర్షాకాలంలో మొక్కలు నాటడం ప్రారంభించారు. తొలుత విజయవాడ రోడ్డు, నాగాయలంక రోడ్డులో మొక్కలు నాటి తర్వాత అవకాశమున్న ప్రతి రహదారులూ, వీధుల్లో సుమారు 30వేల పైగా మొక్కలు నాటి సంరక్షించటంతో నేడు చల్లపల్లిలో ఎటువైపున చూసినా పచ్చనిచెట్లు, పుష్పసోయగం దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా కాసానగర్ నుంచీ రామానగరం వరకు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ప్రముఖులు నాటిన మొక్కల వద్ద నామఫలకాలు ఏర్పాటుచేసి ఏ రోజు నాటిందీ, ఎవరు నాటిందీ రాస్తున్నారు.

ప్రజోపయోగ కార్యక్రమాలు

స్వచ్ఛ చల్లపల్లి మొదటి వార్షికోత్సవంలో 'మన కోసం మనం' ట్రస్ట్‌ను ఏర్పాటుచేశారు. హైదరాబాద్ సన్‌షైన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ గురవారెడ్డి ప్రోత్సాహంతో ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి గ్రామంలో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టారు. ట్రస్ట్‌కు విరాళాలు 10 శాతం వస్తే 90 శాతం డాక్టర్ డీఆర్కే దంపతులే ఖర్చుచేస్తుంటారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 23 మంది సిబ్బంది పనిచేస్తుంటారు. నెల నెలా వారికి, వాహనాల నిర్వహణకు సుమారు రూ.3లక్షకు పైగా సొంత డబ్బు ఖర్చుచేస్తుంటారు. తొమ్మిదేళ్లుగా ఇలా ఖర్చుచేస్తూనే ఉన్నారు.

ప్రముఖుల రాక, ప్రభుత్వ అవార్డులు, సన్మానాలు

స్వచ్ఛ చల్లపల్లి మొదటి వార్షికోత్సవ సభకు గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా వచ్చారు. శాంతాబయోటెక్ వరప్రసాద్‌రెడ్డి, సినీ ప్రముఖులు సుద్దాల అశోక్‌తేజ, చంద్రహాస్, జొన్నవిత్తుల, సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి హోదాలో వెంకయ్య నాయుడు, మంత్రులు, ఎంపీలు, ఐఏఎస్‌లు, ప్రజాప్రతినిధులు, వైద్య ప్రముఖులు ఇలా ఎంతో మంది వచ్చి డీఆర్కే దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొని సెమినార్‌లో కేంద్ర మంత్రి చేతుల మీదుగా సన్మానాన్ని అందుకున్నారు.

ఇది సమష్టి కృషి: డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి



స్వచ్ఛ చల్లపల్లి పదేళ్ల ప్రస్థానం సమష్టి కృషి. గ్రామంలో నిస్వార్థంగా జరిగే కార్యక్రమం. ప్రతిఫలం ఆశించకుండా కార్యకర్తలు శ్రమిస్తుంటే వారికెలా కృతజ్ఞతలు చెప్పగలం. ప్రభుత్వం అన్ని పనులూ చేయలేదు. ప్రజారోగ్యం కోసం గ్రామంలో స్వచ్ఛత, పరిశుభ్రత కోసం పనిచేయాలనుకున్నాం. డబ్బు సంపాదించి మిగుల్చుకోవటం వల్ల ఉపయోగం లేదు. ధనవంతులు తమకు నచ్చిన రంగంలో 10శాతం ఖర్చుచేస్తే బావుంటుంది. స్వచ్ఛ చల్లపల్లికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

ప్రజల క్షేమం, నగరాభివృద్ధే లక్ష్యం

- ఎంపీ శివనాథ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేమాన్ని కాంక్షిస్తూ, నగరాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని విజయవాడను ప్రగతి పథం వైపు నడిపిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులతో నగరాభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విజయవాడ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర విజయవాడలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, మురుగునీటి పారుదల వ్యవస్థ, తాగునీటి సరఫరా వ్యవస్థ, క్రీడలు, స్టేడియాల అభివృద్ధి తదితర అంశాలపై అభివృద్ధికి కావాల్సిన వనరుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ముఖ్యంగా విజయవాడలో వరద ముంపునకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో కొండ ప్రాంత ప్రజలకు 24 గంట లూ తాగునీరు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా స్టేడియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీ సూచించారు. ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేయాలని వీఎంసీ ఆర్థిక పరిపుష్టికి, నగరాభివృద్ధికి, తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎంపీ చెప్పారు. ప్రాజెక్టుల అ దనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, సి.ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆ ఫీసర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్యకీర్తన, ప్రభుదాస్, డిప్యూటీ కమిషనర్ జి.సృజన, ఆర్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, ఎస్ఈలు సత్యనారాయణ, సత్యకుమారి, ఈఈలు వెంకటేశ్వరరెడ్డి, స్వామ్రాజ్యం పాల్గొన్నారు.



రైతు గాంధీ ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజధాని రైతు ఇంటికెళ్లిన మంత్రి నారాయణ

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూ సమీకరణ కింద ఇంకా భూములివ్వాల్సిన రైతుల అనుమానాలను మున్సిపల్ మంత్రి నారాయణ వారిళ్లకే వెళ్లి నివృత్తి చేస్తున్నారు. అనంతరం వారి నుంచి అంగీకార పత్రాలు తీసుకుంటున్నారు. రాజధానిలో భూములు కలిగిన విజయవాడకు చెందిన రైతు అనుమోలు గాంధీ నివాసానికి మంత్రి నారాయణ గురువారం వెళ్లారు. భూ సమీకరణ కింద తీసుకునే భూముల్లో చేపడుతున్న పనుల గురించి మంత్రి వారికి వివరించారు. ప్రభుత్వం రాజధాని పునర్నిర్మాణానికి ఎంతో కష్టపడుతోందన్నారు. భూ సమీకరణలో వారికున్న అపోహలను నివృత్తి చేశారు. మంత్రితో పాటు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రి రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి భూ సమీకరణ అంగీకార పత్రాలను స్వీకరించారు.

ఆప్కాబ్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార బ్యాంక్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ప్రతిభా పురస్కారం దక్కించుకుంది. త్రీటైర్ కేటగిరిలో దేశస్థాయిలో ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్టు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సమాచారం ఇచ్చింది. ఈనెల 26న ఢిల్లీలో ఈ పురస్కారం ప్రదానం చేస్తారు.

స్వచ్ఛసర్వేక్షణ్ 7 స్టార్ సర్టిఫికేషన్ కోసం వీఎంసీ దరఖాస్తు

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ 64 డివిజన్లలో సమయానికి చెత్తను సేకరించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటంతో 2024కుగాను 7స్టార్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసింది. 2023లో ఇదే అంశానికి వీఎంసీకి 5స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ లభించింది. ఈ మేరకు వీఎంసీ ఒక ప్రకటన విడుదల చేస్తూ 7స్టార్ అప్లికేషన్ దరఖాస్తు చేస్తున్నందున వ్యక్తికి లేదా వ్యక్తులకు ఎవరికైనా అభ్యంతరాలుంటే 10రోజుల్లోపు అభ్యంతరాలను తెలియజేయాలని కోరింది. అభ్యంతరాలను 8181960909 నెంబరుకు తెలియజేయవచ్చు.

పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యూటీ ఐజీ సరోజ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రిజిస్ట్రేషన్స్ స్టాంపుల శాఖ డిప్యూటీ ఐజీ సరోజ గురువారం పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్డ్ ప్రైమ్ 2.0 పరిశీలనతో పాటు, ఇటీవల పార్టీషన్స్‌కు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఆమె వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ రేవంత్, డిప్యూటీ ఐజీ సరోజకు పూర్తి విషయాలు తెలిపారు. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ తగ్గిపోతుండటంతో పార్టీషన్స్ తగ్గుదలకు కారణమన్న అంశాలను వివరించారు. అనంతరం ఆమె వెళ్లిపోయారు. వర్క్‌షాప్ నేపథ్యంలో ఇక్కడికి వచ్చినట్టు తెలుస్తోంది.

స్నాచర్‌గా మారిన జిమ్ ట్రైనర్

అప్పులు తీర్చడానికి గొలుసు చోరీలు



అరెస్టు చేసిన నిందితుడు వెంకటేష్‌తో ఏడీసీపీ రాజారావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. మరోపక్క హాల్టింగ్ డ్రైవర్. ఇలా రెండు చేతులా సంపాదిస్తున్నా అప్పులు తీరడం లేదు. దీంతో ఆ యువకుడు స్నాచర్‌గా మారాడు. విజయవాడలో వరుసగా చైన్ స్నాచింగ్‌లు చేసిన అతడిని సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సనత్‌నగర్‌కు చెందిన లంకాడి వెంకటేష్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ ఉన్నప్పుడు హాల్టింగ్ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. తండ్రి చేసిన అప్పులు భారంగా మారాయి. సంపాదన సరిపోవడంలేదు. సులువుగా డబ్బులు సంపాదించడానికి చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తన బావమరిది, స్నేహితుడి బైక్‌లను ఉపయోగించుకుని స్నాచింగ్‌లకు దిగాడు. అక్టోబరు 28న పెనమలూరు పీఎస్ పరిధిలోని కాల్వగట్టు కృష్ణా ఆలయం వద్ద ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి మెడలో గొలుసును కాజేశాడు. అదే రోజు వెటర్నరీ కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో బంగారం గొలుసు లాగేశాడు. దీనిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేష్‌ను సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ బృందం ఏలూరు రోడ్డులోని ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద అరెస్టు చేసింది. అతడి నుంచి 62 గ్రాముల రెండు బంగారు గొలుసులు, స్నాచింగ్‌లకు ఉపయోగించిన యాక్సిస్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3.70 లక్షలుంటుందని సీసీఎస్ పోలీసులు తెలిపారు.

ఎంఎస్ఎంఈ నిబంధనలు సరళతరం చేయాలి: మంత్రి కొండపల్లి

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరమైతే నిబంధనలను సరళతరం చేసి రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ శాఖ పనితీరుపై గురువారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన పారిశ్రామిక విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొత్తగా ఎంఎస్ఎంఈలను అధికసంఖ్యలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి: ఫ్యాప్టో

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇస్తున్న లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో రెసిడెన్షియల్ విధానాన్ని రద్దుచేయాలని ఫ్యాప్టో కోరింది. ఫ్యాప్టో నేతలు ఎస్.చిరంజీవి, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.రఘునాథరెడ్డి, జి.హృదయరాజు, సీహెచ్ మంజుల, కె.సురేశ్ తదితరులు గురువారం విజయవాడలో సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ వల్ల టీచర్లు ఒత్తిడికి గురవుతున్నారని, వారికి ఉపశమనం కలిగించేలా నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించి రాబోయే శిక్షణ కార్యక్రమాలను నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని ఎస్పీడీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు జైలు

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నేరం రుజువుకావడంతో గుంటూరు జిల్లాకు చెందిన షేక్ ఆసిఫ్, జాస్తి వెంకట సాయి, ప్రకాశం జిల్లాకు చెందిన షైదకూరి ఆసిఫ్‌కు విజయవాడ మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పును ఇచ్చింది. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన వ్యక్తి సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని డిజిటల్ స్టూడియోలో పనిచేసేవాడు. ఫిబ్రవరి 3న అతడు స్టూడియోకు వచ్చి వాహనాన్ని బయట పార్క్ చేశాడు. ఈ ముగ్గురు కలిసి ఆ వాహనాన్ని చోరీ చేశారు. తర్వాత అదే నెలలో 9న గుంటూరు పోలీసులకు చిక్కారు. వారిని పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువుకావడంతో నిందితులు ఒక్కొక్కరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి సయ్యద్ జియావుద్దీన్ తీర్పు చెప్పారు.

చిన్నారుల కోసం 3.89 లక్షల డైపర్ల విరాళం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కింబర్లీ-క్లార్క్ ఇండియా సంస్థ చిన్నారుల కోసం 3.89 లక్షల డైపర్లను విరాళంగా ఇచ్చింది. నవంబరు 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.34.95 లక్షల విలువైన డైపర్లను పేద వర్గాల పిల్లలకు ఇచ్చేందుకు ఈ విరాళం అందించింది. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి కింబర్లీ-క్లార్క్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ అస్థాన, సంస్థ ప్రతినిధి ప్రీతి బినోయ్ డైపర్ల కోసం చెక్కును అందించారు. కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి పాల్గొన్నారు.

ఏషియన్ గేమ్స్ కాంస్య పతక విజేత హిమతేజకు మంత్రి అభినందన



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన పరుగుల వీరుడు జటీ హిమతేజ ఇటీవల దుబాయ్‌లో జరిగిన అండర్-20 జూనియర్ ఏషియన్ గేమ్స్‌లో 4 ఇంటూ 100 మీటర్ల రిలే పోటీల్లో కాంస్యంతో సత్తా చాటాడు. నగరంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని హిమతేజ గురువారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసి పతకాన్ని ఆయన చేతులమీదుగా అందుకున్నారు. అతి తక్కువకాలంలో అంతర్జాతీయంగా రెండు పతకాలు, జాతీయంగా ఐదు, రాష్ట్రస్థాయిలో 9 పతకాలను సాధించడం అభినందనీయమని మంత్రి మండిపల్లి అభినందించారు. నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు మంచి భవిష్యత్ అందించేందుకు సీఎం చంద్రబాబు, తాను సిద్ధంగా ఉన్నామని రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు.



విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాల అందిస్తున్న ఏపీబీఏ సెక్రటరీ పోలినేని అంకమ్మ చౌదరి, హరికృష్ణ

సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ విజేతలు సోహాన్, మనస్వి

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాసా వడ్లమూడి మోహన్‌కృష్ణ మెమోరియల్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ అండర్-13 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌లుగా కోట సాయి సోహాన్ (గుంటూరు), ఎస్ మనస్వి (ప్రకాశం) నిలిచారు. గురువారం నాటి హోరాహోరీ ఫైనల్స్‌లో సోహాన్ ఎం జశ్వంత్ (కర్నూల్)పై 21-16,21-14తోను, బాలికల విభాగంలో ఎస్ మనస్వి డీ ఆశాశ్రీ (ప్రకాశం)పై 18-21, 21-12, 21-14తో జయభేరి మోగించి టైటిళ్లను తమఖాతాలో వేసుకున్నారు. బాలురు డబుల్స్‌లో జీ షణ్ముక్ వర్ధన్ (ప్రకాశం), ఎం జశ్వంత్ (కర్నూల్) జోడి సీహెచ్ మహీధర్ రెడ్డి, టి.వర్షిత్ (నెల్లూరు) జోడిపై 21-18, 21-3 తోను, బాలికల డబుల్స్‌లో జీ వెంకట లతా రెడ్డి (నెల్లూరు), శ్రీరామ్ కావ్య (కర్నూలు) జోడి డీ ఆశా శ్రీ, ఎస్ మనస్వి (ప్రకాశం)పై 21-16, 12-21, 21-19 గెలిచి టైటిళ్లను వశం చేసుకున్నారు. స్థానిక చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకల్లో ఏపీబీఏ సెక్రటరీ డాక్టర్‌పోలినేని అంకమ్మ చౌదరి, కేడీబీఏ ఉపాధ్యక్షుడు వడ్లమూడి హరికృష్ణ, రిటైర్డు లెక్చరర్ అడుసుమిల్లి శ్రీనివాసరావు పాల్గొని క్రీడాకారులు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



కబడ్డీలో తలపడుతున్న ఉద్యోగులు

ఉత్సాహంగా సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా సెలక్షన్స్ ఐజీఎంసీలో గురువారం నిర్వహించామని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. కబడ్డీలో 70 మంది, బాస్కెట్‌బాల్‌లో 38 మంది, ఖోఖోలో 85 మంది, క్యారమ్స్‌లో 90 మంది ఉద్యోగులు తలపడ్డారు. ఫుట్‌బాల్ ఎంపికలను గుంటూరులో 33 మందికి పోటీలు ఆయా కోచ్‌ల పర్యవేక్షణలో నిర్వహించామన్నారు.

రేపటి నుంచి స్పోర్ట్స్‌మీట్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి 11 వరకు మోంట్ జెనిత్ - 2024 పేరిట 35వ మోంట్‌ఫోర్ట్ జాతీయ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్టు బ్రదర్ రాయప్పరెడ్డి తెలిపారు. స్కూల్ ఆవరణలో ట్రోఫీలు గురువారం ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలలోని మోంట్‌ఫోర్టు విద్యాసంస్థలకు చెందిన 30 స్కూల్స్ నుంచి 1500 విద్యార్థులు బాస్కెట్‌బాల్, ఖో-ఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో తలపడతారన్నారు. ఈ పోటీలను 9న ఉదయం 9 గంటలకు స్కూల్ పూర్వ విద్యార్థి, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారని, 11న సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమానికి మరో పూర్వ విద్యార్థి, మంత్రి నారా లోకేష్, బిషప్ తెలగతోటి రాజారావు విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారన్నారు. కరస్పాండెంట్ బ్రదర్ మౌంటీ మాట్లాడుతూ 1973లో గన్నవరం సెయింట్ జాన్స్ స్కూల్‌లో క్రీడాపోటీలను ప్రారంభించామని, వివిధ చోట్ల రీజియన్‌ల వారీగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీల ప్రారంభోత్సవంలో హైదరాబాద్ ప్రోవెన్సీ సుపీరియర్ రెవరెండ్ బ్రదర్ షైన్ అలెక్స్, ఎడ్యుకేషన్ కన్వీనర్ బ్రదర్ సంతోష్‌కుమార్ పాల్గొంటున్నారన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, గుర్జిత్‌సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రియాంక, పీఈటీ అనిల్ పాల్గొన్నారు.

మెడికల్, సేల్స్ రిప్స్ సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటెటీవ్స్ ధర్నా


ధర్నాచౌక్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అండ్ సేల్స్ రిప్స్‌ను హైలిస్కిల్డ్ లేబర్‌గా గుర్తించి నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరి సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేదంటే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సెల్స్ రిప్రజెంటటీవ్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో రాష్ట్రస్థాయి ధర్నా గురువారం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటటీవ్స్‌కు చట్టబద్ధమైన పని దినాలు కల్పించాలన్నారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ఉద్యోగులపై ఫార్మా కంపెనీ యాజమాన్య దాడులను అరికట్టాలన్నారు. ప్రభుత్వరంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ ఎత్తి వేయాలన్నారు. ఆరోగ్య రంగానికి జీడీపీ కనీసం 5 శాతం నిధులు కేటాయించాలన్నారు. యూనియన్ నేత కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీహెచ్.బాబురావు, యూనియన్ నేతలు క్రిష్ణయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

నూజివీడు - వట్లూరు మధ్య పలు రైళ్లు మళ్లింపు

రైల్వే స్టేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నూజివీడు-వట్లూరు మధ్య పలు రైళ్లను దారిమళ్లిస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం.మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8, 11, 12 తేదీల్లో నడిచే ధన్‌బాద్-అల్లపూజ (13351) రైలు ఈనెల 7న నడిచే టాటా-యశ్వంతపూర్ (18111) అలాగే సత్రాగచి-సనత్‌నగర్ (07070) ఈనెల 8, 13 తేదీల్లో నడిచే విశాఖపట్నం-విజయవాడ (08567), ఈనెల 8న నడిచే టాటా-ఎస్ఎంవీ బెంగళూరు (112889), ఈనెల 11న నడిచే హాథియా-ఎర్నాకులం (22837), ఈనెల 12న నడిచే హథియా -ఎస్ఎంవీ బెంగళూరు (12835) రైళ్లను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా మళ్లిస్తారు. ధన్‌బాద్-అలపూజ రైలును తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్లలో, టాటా-యశ్వంతపూర్, సత్రాగచి-సనత్ నగర్ రైళ్లను ఏలూరు స్టేషన్‌లో, విశాఖపట్నం-విజయవాడ రైలును గన్నవరంలో, హాథియా-ఎర్నాకులం రైళ్లను ఏలూరు స్టేషన్‌లో నిలుపుదల చేయరు.

వరద బాధితులకు రూ.90,54,999 విరాళం

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొవ్వూరు నియోజకవర్గం తరపున ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రూ.90,54,999 విరాళంగా అందజేశారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి, ఆయన చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నేతలను సీఎం అభినందించారు.



HAPPY
Birthday
సినీ నిర్మాత, డైనమిక్ లీడర్
శ్రీ గొట్టిముక్కల పద్మారావు గారికి
హార్దిక జన్మదిన శుభాకాంక్షలు
Padma Priya Arts
Colour Bottles Productions



PAKKAA ENTERTAINER
నేడే
విడుదల
CHETAN MADDINENI
ధూం ధాం



నేడే
విడుదల
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
BVSN PRASAD SUDHEER VARMA



GALLA MANJUNATH PRESENTS
Releasing Today
SATHISH BABU IN
జాతర
A FILM BY SATHISH BABU RATAKONDA




MSK PRAMIDHA SHREE FILMS
PRESENTS
నేడే
విడుదల
SHRI VISHNU GLOBAL MEDIA
డేరింగ్ స్టార్ క్రిష్ణసాయి
IN & AS
జ్యూయల్ థీఫ్
మీ నగలు జాగ్రత్త
నిర్మాత: మల్లెల ప్రభాకర్
కథ - స్క్రీన్‌ప్లే - మాటలు - దర్శకత్వం: పి.యస్. నారాయణ
ADITYA MUSIC



SVM
NOVEMBER
28TH
WORLDWIDE RELEASE
IN THEATRES
శ్రీ శ్రీ శ్రీ
రాజావారు
WRITTEN & DIRECTED BY VEGESNA SATISH
PRODUCED BY CHINTHAPALLI RAMARAO



INDIA'S PRIDE
MAJOR
SUCCESS
2ND WK
THIS IS THE FACE OF THE INDIAN ARMY
అమరన్



PEOPLE'S CHOICE
ROARING
2ND
WEEK
DIWALI
BLOCKBUSTER
క

జెట్ ఎయిర్‌వేస్ దుకాణం బంద్

లిక్విడేషన్‌కు 'సుప్రీం' అనుమతి • రుణదాతలకు రూ.350 కోట్లు



రిటైల్ వాటాదారులకు మొండిచేయి

న్యూఢిల్లీ: భారత విమానయాన రంగంలో మరో విమానయాన సంస్థ కథ ముగిసింది. పాతికేళ్ల పాటు ఒక వెలుగు వెలిగిన జెట్ ఎయిర్‌వేస్ కంపెనీ ఆస్తుల అమ్మకం ద్వారా తమ బకాయిల వసూలు కోసం ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం దాఖలు చేసిన లిక్విడేషన్ పిటిషన్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ కోసం జలాన్ కల్‌రాక్ కన్సార్షియం (జేకేసీ) డిపాజిట్ చేసిన రూ.200 కోట్లను, రూ.150 కోట్ల పెర్‌ఫార్మెన్స్ బ్యాంకు గ్యారెంటీ (పీబీజీ)ని బ్యాంకులు స్వాధీనం చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ బిడ్‌లో నెగ్గిన జేకేసీ చెల్లించాల్సిన తొలి విడత మొత్తాన్ని పీబీజీ నుంచి సర్దుబాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. కాగా జెట్ ఎయిర్‌వేస్ దివాలా ప్రక్రియకు సంబంధించి ఎన్‌సీఎల్‌ఏటీ ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. తమ తీర్పు ఇలాంటి కేసుల విచారణకు కనువిప్పుని ధర్మాసనం పేర్కొంది.

వాటాదారులకు రిక్త హస్తం

సుప్రీంకోర్టు తాజా తీర్పుతో జెట్ ఎయిర్‌వేస్ ఈక్విటీలో 19.29 శాతం వాటా ఉన్న 1.43 లక్షల మంది రిటైల్ ఇన్వెస్టర్లకు చిల్లిగవ్వ కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. 2019 ఏప్రిల్‌లోనే జెట్ ఎయిర్‌వేస్ మూతపడింది. అయినా ఈ షేర్లలో ట్రేడింగ్ జరుగుతోంది. ఎయిర్‌లైన్‌ను మళ్లీ టేకాఫ్ చేయించేందుకు జేకేసీ ముందుకు రావడంతో ఈ ఏడాది మార్చి 22న జెట్ ఎయిర్‌వేస్ షేరు బీఎస్‌ఈలో రూ.63.15 స్థాయిని తాకింది. తాజాగా సుప్రీం తీర్పుతో గురువారం కంపెనీ షేరు ధర 5 శాతం నష్టంతో రూ.34.04కి స్థాయికి చేరింది. మరోవైపు మార్కెట్ క్యాప్ రూ.386.69 కోట్లకు పడిపోయింది. ఐదు శాతం సర్క్యూట్ బ్రేకర్ లేకపోతే షేరు మరింత కుప్పకూలేది. గురువారం నాటి మార్కెట్ క్యాప్ ఆధారంగా చూస్తే రిటైల్ ఇన్వెస్టర్ల వాటా విలువ రూ.74.6 కోట్లుగా ఉంది.

మార్కెట్ల నుంచి డీలిస్టింగ్ ఖాయం కావడంతో ముందు ముందు జెట్ ఎయిర్‌వేస్ షేర్లు చిల్లిగవ్వకు కూడా కొరగావని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కంపెనీ ఈక్విటీలో రిటైల్ ఇన్వెస్టర్లకు 19.29 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కి 26 శాతం, ఎతిహాద్ ఎయిర్‌వేస్‌కు 24 శాతం, నరేశ్ గోయల్ కుటుంబం, ఇతరులకు మరో 25 శాతం వాటా ఉంది.

ఈ-కామర్స్ విక్రేతలకు ఈడీ షాక్

హైదరాబాద్ సహా 15 చోట్ల సోదాలు

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్.. ప్రిఫర్డ్ విక్రేతల (వెండార్స్)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం షాకిచ్చింది. హైదరారాబాద్, ఢిల్లీ, బెంగళూరు, పంచకుల, గురుగ్రామ్‌లలో వారికి చెందిన 15 కార్యాలయాల్లో సోదాలు జరిపింది. ఈ సోదాల్లో ఈడీ అధికారులు కొన్ని కీలక పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టాన్ని (ఫెమా) తుంగలో తొక్కి ప్రిఫర్డ్ వర్తకుల ద్వారా ఈ సంస్థలు అడ్డగోలు డిస్కౌంట్లతో దేశంలోని చిన్న చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నాయని ఎప్పటి నుంచో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈడీ ఈ సోదాలు జరపడం విశేషం. అయితే అమెజాన్ ఇండియా, ఫ్లిప్‌కార్ట్ ఇప్పటి వరకు ఈ సోదాలపై నోరు విప్పలేదు. ఈడీ తాజా చర్యను అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ స్వాగతించారు. ఎట్టకేలకు ఈడీ సరైన చర్యలు తీసుకుందన్నారు. కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా ఇప్పటికే ఈ సంస్థలకు పెనాల్టీ నోటీసులు జారీ చేసిందన్నారు.

ఫేక్ ఈ-మెయిల్‌తో అడ్డంగా దొరికిన రిలయన్స్ పవర్

న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ అక్రమాలు ఆగడం లేదు. పీకల్లోతు అప్పుల్లో ఉన్నా కంపెనీ కొత్త ప్రాజెక్టుల కోసం పోటీపడుతోంది. 2,000/3,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న భారీ సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం ఇటీవల ప్రభుత్వ రంగంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) ఇటీవల బిడ్స్ ఆహ్వానించింది. ఈ బిడ్స్ సందర్భంగా రిలయన్స్ పవర్, రిలయన్స్ ఎన్‌యూ బీఈఎస్ఎస్ అనే తన అనుబంధ సంస్థ ద్వారా బిడ్ సమర్పించింది. ఈ బిడ్‌తో పాటు తమ కంపెనీకి ఎస్‌బీఐ నుంచి బ్యాంకు హామీ ఉందని చెబుతూ, దాన్ని నిజమనిపించేలా ఎస్‌బీఐ పేరు మీద ఈ-మెయిల్ పంపించింది. అయితే ఆ ఈ-మెయిల్ నకిలీ (ఫేక్)దని ఎస్ఈసీఐ తేల్చింది. దీంతో రిలయన్స్ పవర్, దాని అనుబంధ సంస్థలు మూడేళ్ల పాటు తాము ఫ్లోట్ చేసే ఎటువంటి బిడ్స్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది.

మార్కెట్లో ట్రంప్ ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో రెండు రోజుల భారీ లాభాల ర్యాలీకి అడ్డుకట్ట పడింది. బ్యాంకింగ్, ఆటో రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు గురువారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 836.34 పాయింట్లు కోల్పోయి 79,541.79 వద్దకు జారుకుంది. నిఫ్టీ 284.70 పాయింట్ల నష్టంతో 24,199.35 వద్ద ముగిసింది.

బిజినెస్

ఎన్‌సీసీ లాభంలో రెండింతల వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా రెండింతలు వృద్ధితో రూ.174.79 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.86.49 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.4,746.40 కోట్ల నుంచి రూ.5,224.36 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.4,760 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకోవటంతో మొత్తం ఆర్డర్ బుక్ రూ.52,370 కోట్లకు చేరుకుంది.

లీడ్ గ్రూప్ నుంచి టెక్‌బుక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎడ్‌టెక్ సంస్థ లీడ్ గ్రూప్.. టెక్‌బుక్ పేరుతో ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్‌ను తీసుకువచ్చింది. సాంప్రదాయ పాఠ్యపుస్తకాలను పూర్తిగా ఇంటలిజెంట్ పుస్తక రూపంలో టెక్‌బుక్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు సుమిత్ మెహతా తెలిపారు. మూడు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలు.. అగ్‌మెంటెడ్ రియాల్టీ, పర్సనలైజ్డ్ రీడింగ్ ఫ్లూయెన్సీ, పర్సనలైజ్డ్ ప్రాక్టీస్ పేరుతో దీన్ని రూపొందించినట్లు ఆయన చెప్పారు. 3డీ విధానంలో విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకోవచ్చన్నారు. యాప్ ద్వారా పాఠాన్ని స్కాన్ చేయటం ద్వారా విద్యార్థులు పాఠాలను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ టెక్‌బుక్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వందకు పైగా పాఠశాలల్లో టెక్‌బుక్ టూల్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు సుమిత్ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,560 ▼	72,000 ▼	1,02,000 ▼
ముంబై	76,780 ▼	70,331 ▼	90,369 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	125
వరంగల్	120	గుంటూరు	126
కరీంనగర్	120	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	120
కర్నూలు	120	నెల్లూరు	120
విశాఖపట్నం	111	అనంతపురం	120
గోదావరి	125		



దాతృత్వంలో మేటి నాడార్

రోజుకు 5.9 కోట్ల విరాళం ● గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,153 కోట్ల దానం

- ఆ తర్వాత స్థానంలో అంబానీ
- సీఎస్ఆర్‌లో రిలయన్స్ టాప్
- ఎడెల్‌గివ్-హురున్ లిస్ట్ విడుదల

జాబితాలో 18 మంది తెలుగు రాష్ట్రాల వారు


న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్.. భారత దాతల జాబితాలో మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. గురువారం విడుదలైన 'ఎడెల్‌గివ్-హురున్ ఇండియా ఫిలాంత్రఫీ లిస్ట్- 2024' ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నాడార్ మొత్తం రూ.2,153 కోట్ల విరాళాలిచ్చారు. అంటే, రోజుకు సగటున రూ.5.9 కోట్లు దానం చేశారు. శివ్ నాడార్ ఫౌండేషన్ సంస్థల ద్వారా నాడార్, ఆయన కుటుంబం విద్య, సాంకేతిక సంబంధిత కార్యక్రమాలకు అధికంగా సాయం చేశారు. ఎడెల్‌గివ్-హురున్ దాతల జాబితాలో నాడార్ అగ్రస్థానంలో నిలవడం గత ఐదేళ్లలో ఇది మూడోసారి. ఈ లిస్ట్‌లోని మరిన్ని ముఖ్యాంశాలు..

- భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఫౌండేషన్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.407 కోట్ల విరాళాలిచ్చింది. దాంతో అంబానీ ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. రూ.352 కోట్ల విరాళాలతో బజాజ్ కుటుంబం మూడో స్థానంలో ఉంది. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా (రూ.334 కోట్లు), అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ (రూ.330 కోట్లు) టాప్-5లో చోటు దక్కించుకున్నారు.
- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని (రూ.307 కోట్లు), తెలుగు తేజం కృష్ణ చివుకుల (రూ.228 కోట్లు), వేదాంత గ్రూప్ అధిపతి అనిల్ అగర్వాల్ (రూ.181 కోట్లు), సుస్మిత, సుబ్రతో బాగ్చీ (రూ.179 కోట్లు), రోహిణి నీలేకని (రూ.154 కోట్లు) టాప్ టెన్‌లోని మిగతా స్థానాల్లో నిలిచారు.
- దేశంలోని మహిళా దాతల్లో రోహిణి నీలేకని (నందన్ నీలేకని భార్య) అగ్రస్థానంలో ఉండగా.. సుస్మితా బాగ్చీ (రూ.90 కోట్లు), బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్ షా (రూ.85 కోట్లు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.
- ఆన్‌లైన్ బ్రోకరేజీ సేవల సంస్థ జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ (38 ఏళ్లు) దాతల జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు, తన సోదరుడు నితిన్ కామత్‌తో కలిసి ఆయన రూ.120 కోట్ల విరాళాలిచ్చారు.
- ఈ ఏడాది జాబితాలో మొత్తం 203 మందికి చోటు దక్కగా.. వారి మొత్తం విరాళాలు రూ.8,783 కోట్లుగా ఉన్నాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే 55 శాతం అధికమిది. జాబితాలోని వ్యక్తుల్లో 18 మంది రూ.100 కోట్లకు పైగా దానం చేయగా.. 30 మంది రూ.50 కోట్లకు పైగా, 61 మంది రూ.20 కోట్లకు పైగా విరాళాలిచ్చారు.
- కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కోసం అత్యధికంగా ఖర్చు చేసిన కంపెనీల జాబితాలో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో నిలిచింది. 2023-24లో ఆర్ఐఎల్ ఇందుకోసం రూ.900 కోట్లు వెచ్చించింది. నవీన్ జిందాల్‌కు చెందిన జిందాల్ స్టీల్ అండ్ పవర్ (రూ.228 కోట్లు) ఆ తర్వాత స్థానంలో ఉంది.
- హురున్ దాతల జాబితాలో 18 మంది తెలుగువారికి చోటు దక్కగా.. కృష్ణ చివుకుల అగ్రస్థానంలో ఉన్నారు. ఐఐటీ మద్రాస్‌కు ఈ ఏడాది రూ.228 కోట్లు విరాళంగా ఇచ్చారు. చివుకుల 1970లో ఐఐటీ మద్రాస్ నుంచే ఎం.టెక్ పూర్తి చేశారు. ఏపీలోని బాపట్లలో పుట్టి పెరిగిన చివుకుల ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. కాగా, మేఘా ఇంజనీరింగ్ (ఎంఈఐఎల్) ప్రమోటర్లు పీవీ కృష్ణా రెడ్డి, పీ పిచ్చి రెడ్డి ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

హురున్ దాతల జాబితాలోని తెలుగు రాష్ట్రాలవారు

ర్యాంక్	పేరు	కంపెనీ	విరాళం (రూ.కోట్లు)	ప్రాంతం
7	కృష్ణ చివుకుల	ఇండో ఎంఐఎం	228	ఒడెస్సా(అమెరికా)
40	పీపీ కృష్ణా రెడ్డి	ఎంఈఐఎల్	33	హైదరాబాద్
41	పీ పిచ్చి రెడ్డి	ఎంఈఐఎల్	32	హైదరాబాద్
62	జూపల్లి రామేశ్వర్ రావు	మై హోమ్	18	హైదరాబాద్
69	మురళి కే దివి	దివీస్ ల్యాబ్స్	17	హైదరాబాద్
78	పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి	అరబిందో ఫార్మా	15	న్యూజెర్సీ(అమెరికా)
113	బీ పార్థసారధి రెడ్డి	హెటెరో ల్యాబ్స్	10	హైదరాబాద్
135	సీ వెంకటేశ్వర్ రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	8	హైదరాబాద్
138	ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	8	హైదరాబాద్
142	జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్	7	హైదరాబాద్
145	కే సతీశ్ రెడ్డి	డాక్టర్ రెడ్డీస్	7	హైదరాబాద్
165	మహిమ దాట్ల	బయోలాజికల్-ఈ	6	హైదరాబాద్
172	జుగ్‌రాజ్ జైన్, ప్రవీణ్ జైన్	గోల్డ్‌మెడల్	6	విజయవాడ
176	డీ. రాంరెడ్డి	స్నేహ ఫామ్స్	6	హైదరాబాద్
188	చావా సత్యనారాయణ	లారస్ ల్యాబ్స్	5	హైదరాబాద్
193	కృష్ణప్రసాద్ చిగురుపాటి	గ్రాన్యూల్స్ ఇండియా	5	హైదరాబాద్
196	పీ బ్రహ్మానందం	దేవి సీ ఫుడ్స్	5	విశాఖపట్నం
198	గంటా రామచంద్ర నాయుడు	జీఆర్ఎన్ కన్‌స్ట్రక్షన్స్	5	నెల్లూరు

స్పోర్ట్స్



అర్జున్ @ 2

చెన్నై: సంచలన ప్రదర్శనతో అదరగొడుతున్న తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి ప్రపంచ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ మూడో రౌండ్‌లో అలెక్స్ సరీనా (సెర్బియా)పై అర్జున్ గెలిచాడు. తెల్ల పావులతో ఆడిన ఇరిగేసి 37 ఎత్తుల్లో సరీనా ఆట కట్టించాడు. ఈ విజయంతో అర్జున్ 2805.8 లైవ్ రేటింగ్‌తో వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్ (2831) తర్వాతి స్థానంలో నిలిచాడు. కాగా, చాలెంజర్స్ టోర్నీ మూడో రౌండ్‌లో పురానిక్‌తో గేమ్‌ను హారిక డ్రా చేసుకొంది.

హంపిక మరో డ్రా: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీలో కోనేరు హంపి మరో గేమ్‌ను డ్రాగా ముగించింది. టైటిల్ రేసు నుంచి ఇప్పటికే అవుటైన హంపి.. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినాతో పాయింట్ పంచుకొంది. స్టవ్‌రౌలా (గ్రీస్)తో గేమ్‌ను దివ్య డ్రాగా ముగించింది. 8 రౌండ్ల తర్వాత హంపి, దివ్య చెరి 4 పాయింట్లతో 5,6 స్థానాల్లో ఉన్నారు.

కష్టాల్లో ఆంధ్ర

- తొలి ఇన్నింగ్స్‌లో 92/4
- ఉత్తరాఖండ్ 338 ఆలౌట్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): బ్యాటర్ల వైఫల్యంతో.. ఉత్తరాఖండ్‌తో రంజీమ్యాచ్‌లో ఆంధ్ర కష్టాల్లో పడింది. గురువారం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆంధ్ర రెండో రోజు ఆట చివరకు 92/4 స్కోరు చేసింది. కెప్టెన్ షేక్ రషీద్ (0) డకౌట్ కాగా.. ఓపెనర్ అభిషేక్ (35) ఫర్వాలేదనిపించాడు. దీపక్ 2 వికెట్లు పడగొట్టాడు. ఓవర్‌నైట్ స్కోరు 232/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 338 పరుగులకు ఆలౌటైంది. రవికుమార్ (59) హాఫ్ సెంచరీ చేశాడు. లలిత్ మోహన్ 4 వికెట్లు పడగొట్టాడు. ఉత్తరాఖండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు కు ఆంధ్ర ఇంకా 246 పరుగులు వెనుకబడింది.

అయ్యర్ డబుల్ సెంచరీ

ముంబై 602/4 డిక్లేర్డ్ — ఒడిశా 146/5

ముంబై: శ్రేయాస్ అయ్యర్ (233) ద్విశతకంతో చెలరేగడంతో.. ఒడిశాతో రంజీలో ముంబై 602/4 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సిద్దేశ్ లాడ్ (169 నాటౌట్), సూర్యాంశ్ షడ్గే (79 నాటౌట్) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఒడిశా 146/5తో కష్టాల్లో పడింది.

ఐదు దేశాలతో పోటీ

ఒలింపిక్ బిడ్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్‌కు పోటీగా పలు దేశాలు గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. 2036లో జరిగే ఈ గేమ్స్ కోసం ఇప్పటికే భారత ఒలింపిక్ సంఘం అధికారికంగా ఐఓసీకి లేఖ రాసింది. మరోవైపు సౌదీ అరేబియా, కతార్, చిలీ, ఇండోనేసియా, తుర్కియే దేశాలు కూడా తమ ఆసక్తిని వ్యక్తపరిచాయి. ఇందులో భారత్‌కు సౌదీ, ఖతార్ నుంచి కాస్త గట్టి పోటీ ఎదురుకానుంది.

కుర్రాళ్లు కుమ్మేస్తారా?

జోష్‌లో యువ భారత్
ప్రతీకారం కోసం దక్షిణాఫ్రికా
నేటి నుంచి నాలుగు టీ20ల సిరీస్



ట్రోఫీతో కెప్టెన్లు మార్క్రమ్, సూర్య

రాత్రి 8.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో...

డర్బన్: సుదీర్ఘ ఫార్మాట్‌లో చిత్తుగా ఓడిన టీమిండియా ఇప్పుడు ధనాధన్ పోరుపై దృష్టి సారించింది. టీ20 వరల్డ్‌కప్ చాంపియన్ హోదాలో.. అదే టోర్నీ ఫైనలిస్టు దక్షిణాఫ్రికాతో నాలుగు టీ20ల సిరీస్‌కు సిద్ధమైంది. నేడు ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. అయితే పూర్తిస్థాయి జట్టుతో కాకుండా సూర్యకుమార్ నేతృత్వంలోని భారత్.. యువ ఆటగాళ్లతో బరిలోకి దిగనుంది. ఇటీవలి టెస్టు సిరీస్‌లో తమ సీనియర్లకు న్యూజిలాండ్ చేతిలో ఎదురైన దారుణ పరాభవాన్ని కుర్రాళ్లు మరిపించాలనుకుంటున్నారు. బౌన్సీ పిచ్‌లపై అటు బౌలర్లు.. ఇటు బ్యాటర్లు రాణిస్తూ ప్రస్తుతం సంధి దశలో ఉన్న భారత్ తరఫున తమ బెర్త్‌లను ఖాయం చేసుకోవాలనుకుంటున్నారు. అటు తొలి వరల్డ్‌కప్ దక్కకుండా చేసిన భారత్‌పై ఈసారి మాత్రం పైచేయి సాధించాలన్న కసితో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఉంది. కానీ తమ చివరి ఆరు టీ20 మ్యాచ్‌ల్లో ఐదింటిని ఓడిన ఈ జట్టు ఏమేరకు పోటీనిస్తుందో చూడాల్సిందే. భారత్ మాత్రం ఆడిన 12 మ్యాచ్‌ల్లో పది నెగ్గి ఓ మ్యాచ్‌ను టై చేసుకుంది. మరోవైపు భారత జట్టులోని 15మంది ఆటగాళ్లలో 11 మందిని ఐపీఎల్ జట్లు అట్టిపెట్టుకోవడం విశేషం.

ఓపెనర్లపై దృష్టి: ఓపెనర్లుగా సంజూ శాంసన్, అభిషేక్‌ల రాణింపుపై అందరి దృష్టి నెలకొంది. వాస్తవానికి శాంసన్ ఆడిన 33 మ్యాచ్‌ల్లో ఎనిమిదిసార్లు మాత్రమే ఓపెనింగ్ చేశాడు. బంగ్లాతో తన చివరి మ్యాచ్‌లో 47 బంతుల్లో 111 రన్స్‌తో ఆకట్టుకున్నాడు. ఇక్కడ కూడా అదే రీతిన రాణిస్తే రెగ్యులర్ ఓపెనర్లు జైస్వాల్-గిల్‌లకు పోటీనివ్వడం ఖాయమే. ఈ స్లాట్ కోసం పోటీలో ఉన్న మరో ఓపెనర్ అభిషేక్ ఐపీఎల్‌లో అదరగొట్టినవాడే. కానీ అతడి రెండో టీ20లో శతకం తర్వాత మరో ఆరు మ్యాచ్‌ల్లో కనీసం 20 దాటలేకపోయాడు. తిలక్ వర్మ కూడా ఈ ఫార్మాట్‌లో రెగ్యులర్ బెర్త్‌ను ఆశిస్తున్నాడు. ఇక అర్ష్‌దీప్, అవేశ్, వైశాక్, యష్ దయాల్‌లతో కూడిన పేస్ విభాగం అనుభవలేమిగా కనిపిస్తోంది. ఇందులో వైశాక్, యష్‌లకు తొలిసారిగా చోటు కల్పించారు. ఆర్‌సీబీ రిటైన్ చేసుకున్న యష్‌కు చాన్స్ లభిస్తే ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. రమణ్‌దీప్ అటు మిడిలార్డర్‌లో హిట్టర్‌గానే కాకుండా మీడియం పేసర్‌గా సేవలందించగలడు. అలాగే అతడి ఫీల్డింగ్ కూడా జట్టుకు ఉపయుక్తమే.

పటిష్ఠంగానే..: తమ చివరి సిరీస్‌ల్లో ఐర్లాండ్, విండీస్‌లపై ఓటములు దక్షిణాఫ్రికా జట్టుపై ఒత్తిడిని పెంచాయి. దీంతో విజయాల జోష్‌లో ఉన్న భారత్‌ను కట్టడి చేయడం సవాల్ కానుంది. అయితే మిడిలార్డర్‌లో క్లాసెన్, మిల్లర్‌ల రాకతో బ్యాటింగ్ విభాగం పటిష్ఠమైంది. అలాగే వీరికి జతగా స్టబ్స్ ఉండనే ఉన్నాడు. మరోవైపు గాయాల నుంచి కోలుకున్న పేసర్లు జాన్సెన్, కొట్జీ జట్టులోకి రావడం ఉత్సాహాన్నిస్తోంది. కెప్టెన్‌గా మార్క్రమ్‌కు ఈ సిరీస్ గెలవడం అత్యవసరం కానుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్, రింకూ సింగ్, రమణ్‌దీప్, అక్షర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, అవేశ్.
దక్షిణాఫ్రికా: రికెల్టన్, హెన్‌డ్రిక్స్, మార్క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, మిల్లర్, క్లాసెన్, క్రుగెర్, జాన్సెన్, కేశవ్, బార్ట్‌మన్, కొట్జీ.

పిచ్, వాతావరణం

కింగ్స్‌మీడ్ మైదానం అనూహ్య బౌన్స్, పేస్‌కు చిరునామా. ఈ సారి కూడా పేసర్లకే అనుకూలించడం ఖాయం. అలాగే ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టుకు విజయావకాశాలెక్కువ. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు 153. ఆకాశం మేఘావృతంగా ఉండి చిరుజల్లులకు ఆస్కారం ఉంది.

దబాంగ్ ఢిల్లీకో విజయం

ప్రో కబడ్డీ లీగ్


హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్ సీజన్11లో దబాంగ్ ఢిల్లీ నాలుగు వరుసఓటముల తర్వాత విజయం రుచి చూసింది. గురువారం గచ్చిబౌలి స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు బెంగాల్ వారియర్స్‌పై 33-30 తేడాతో నెగ్గింది. ఆ తర్వాత జరిగిన రెండో గేమ్‌లో హరియాణా స్టీలర్స్ 35-22 తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.

ఆసియా నెం:1 షూటర్ ఇషా



న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన టీనేజ్ పిస్టల్ షూటర్ ఇషా సింగ్ ఆసియా నంబర్ వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకొంది. తాజాగా విడుదల చేసిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ర్యాంకింగ్స్‌లో ఇషా 1500 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలిచింది. కాగా, భారత్‌కే చెందిన రిథమ్ సంగ్వాన్ 1200 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానం, సురభి రావు 896 పాయింట్లతో ఐదో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నారు. పాకిస్థాన్ షూటర్ కిష్మాల తలత్ (1350) రెండో స్థానంలో దక్కించుకొంది.

రాహుల్ ఫట్.. జురెల్ హిట్



- ధ్రువ్ అర్ధ శతకం
- నెసర్‌కు 4 వికెట్లు
- భారత్-ఎ 161, ఆసీస్-ఎ 53/2
- రెండో అనధికార టెస్ట్

మెల్‌బోర్న్: కేఎల్ రాహుల్ తీరు.. అదే కథ.. అదే వ్యథ అన్నట్టుగా తయారైంది. తాజాగా ఆస్ట్రేలియా-ఎతో గురువారం ఆరంభమైన రెండో అనధికార టెస్ట్‌లో మరోసారి విఫలమయ్యాడు. కానీ, రాహుల్‌తోపాటే హడావుడిగా ఇక్కడకు వచ్చిన ధ్రువ్ జురెల్ (80) అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్-ఎ 161 పరుగులకు ఆలౌటైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. పేసర్ నెసర్ (4/27) దెబ్బకు కేవలం 11 పరుగులకే నాలుగు టాపార్డర్ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ రేసులో ఉన్న అభిమన్యు ఈశ్వరన్ (0)తోపాటు సాయి సుదర్శన్ (0)ను నెసర్ తొలి ఓవర్‌లోనే డకౌట్ చేసి గట్టి దెబ్బకొట్టాడు. ఇక రాహుల్ (4) నాలుగు బంతులే ఆడి బొలాండ్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచిచ్చాడు. పెర్త్ టెస్ట్‌లో ఓపెనర్ స్థానం కోసం పోటీపడుతున్న రాహుల్ అవుటైన తీరు చూస్తే.. మేనేజ్‌మెంట్ మరో ప్రత్యామ్నాయాన్ని వెదకాలేమో..! కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (4) కూడా స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జురెల్.. క్లిష్టమైన వికెట్‌పై బంతిని గమనించి ఆలస్యంగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. అతడికి దేవ్‌దత్ పడిక్కల్ (26) నుంచి కొంత సహకారం అందింది. నితీశ్ కుమార్ (16)ను వెబ్‌స్టర్ (3/19) వెనక్కిపంపాడు. జురెల్‌ను మెక్‌స్వీనీ అవుట్ చేశాడు. అనంతరం వర్షం కారణంగా తొలి రోజు ఆటనిలిచే సమయానికి ఆసీస్-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 17.1 ఓవర్లలో 53/2 స్కోరు చేసింది. మెక్‌స్వీనీ (14)ని ముకేష్.. బాన్‌క్రాఫ్ట్ (3)ను ఖలీల్ అవుట్ చేశారు.

క్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్

ఇక్సాన్ (దక్షిణ కొరియా): కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ కిరణ్ జార్జ్ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ చి యు జెన్ (చైనీస్ తైపీ)ని 21-17, 19-21, 21-17 తేడాతో ఓడించాడు.

విశాఖలో సింధు అకాడమీ

తల్లిదండ్రులతో కలిసి భూమి పూజ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు గురువారం భూమి పూజ చేసింది. అకాడమీ ఏర్పాటు నిమిత్తం ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం విశాఖపట్నంలోని పెదగదిలి జంక్షన్‌లో రెండెకరాలు కేటాయించింది. అయితే అదనంగా మరింత భూమి కావాలని సింధు కోరగా, ఆ తరువాత ప్రభుత్వం మరో ఎకరా కేటాయించింది. మొత్తం మూడెకరాల్లో అకాడమీ నిర్మాణానికి ఇటీవల భూమి చదును చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో సింధు.. సీఎం చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరించింది. ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని, అక్కడే పనులు ప్రారంభించుకోవాలని సీఎం ఆమెకు సూచించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను ఆ మేరకు తగిన సహకారం అందేలా చూడాలని ఆదేశించారు. కాగా తాము ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే పనులు చేపడుతున్నామని సింధు తండ్రి రమణ చెప్పారు. ఏడాదిలోగా అకాడమీ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.



తల్లిదండ్రులతో కలిసి భూమి పూజ చేస్తున్న పీవీ సింధు

ఆంధ్రజ్యోతి

నవ్య నివేదన

శుక్రవారం • 8 నవంబరు 2024

ధర్మపథం

శైవ -బౌద్ధ సమాగమం

హిందూ చాంద్రమానంలో కార్తిక మాసం ఎనిమిదో నెల. ఇది దక్షిణాయనంలో వస్తుంది. బౌద్ధంలో 'కఠిన మాసం' మూడు నెలల వర్షాకాలం ముగింపులో వస్తుంది. బౌద్ధ భిక్షువులకు వస్త్రాలు, ఔషధాలు, భోజనం, నివాస స్థలాలు లాంటి నాలుగు ప్రాథమిక అవసరాలను అందించడం ద్వారా భక్తులు తమ కృతజ్ఞతలను తెలియజేస్తారు. హిందువులకు కార్తికమాసం మాదిరిగా ఇది బౌద్ధులకు ఒక పవిత్ర మాసం. నిజానికి హిందూ, బౌద్ధ సంప్రదాయాల మధ్య చాలా సామ్యం కనిపిస్తుంది. హిందువులకు శివుడు ఆరాధ్య దైవమైతే... బౌద్ధులకు అవలోకితేశ్వరుడు ఆరాధ్య దైవం. ఇండోనేసియాలోని జావా, బాలి ప్రాంతాల్లోని హిందూత్వం... శైవ, బౌద్ధ అంశాల సమ్మేళనం. అక్కడ దీన్ని 'ఆగమ శివ-బుధ' లేదా 'ఆగమ హిందూ-బుధ' సంప్రదాయం అంటారు.

అవలోకితేశ్వరుడి గురించి రాసిన ప్రధాన మహాయాన సూత్రాలలో 'కారండక వ్యూహ సూత్రం' ఒకటి. ఈ సూత్రంలో అవలోకితేశ్వరుణ్ణి అందరికన్నా పూర్వీకుడిగా కీర్తించారు. ఒకానొక సమయంలో బుద్ధుడు శ్రావస్తి నగరంలో, అనాథపిండకుడి ఉపవనంలో నివసిస్తున్నాడు. అక్కడికి స్వర్గలోక దేవతలు, బోధిసత్త్వులు, భిక్షువులు వేంచేసారు. విష్ణువు, శివుడు స్వయంగా బుద్ధుడి ఉపదేశాలను వినడానికి హాజరైనట్టున్న వర్ణనలు 'కారకండ వ్యూహసూత్రం'లో దొరుకుతాయి.



> బౌద్ధులు మొదట్లో శైవ సిద్ధాంతాన్ని విమర్శించారు. చివరకు శివుణ్ణి జ్ఞానోదయం పొందిన బుద్ధుడిగా మహాయాన బౌద్ధంలో అంగీకరించడం జరిగింది. శివుడు... అవలోకితేశ్వరుడి నుంచి ఉద్భవించినట్టు పరిగణిస్తున్నందున... శివుని లక్షణాలు అనేకం అవలోకితేశ్వరుడికి ఆపాదించారు.

ఈ సూత్రం ప్రకారం... అవలోకితేశ్వరుడి నుదుటి నుంచి శివుడు జన్మించాడు. తన శరీరం నుంచి శివుడు ఉద్భవించిన తరువాత... అతనితో అవలోకితేశ్వరుడు మాట్లాడుతూ కలియుగంలో తను జన్మస్థాననీ, ప్రపంచ సృష్టికర్త అయిన ఆది దేవుణ్ణి తనేననీ చెప్పాడు. కలియుగంలో జ్ఞాన మార్గాన్ని కోల్పోయిన మానవులు అవలోకితేశ్వరుణ్ణి విస్మరించి... శివారాధన వైపు మళ్ళారని, 'అంతరిక్షం అతని లింగం, భూమి అతని పీఠం, ఇంకా అన్ని జీవులు అతనిలో కలిసిపోతాయి' అని పేర్కొంటూ.. శివుణ్ణి లింగ రూపంలో ఆరాధించడం మొదలుపెట్టారనీ ఆ సూత్రం పేర్కొంటోంది.

మరి కొన్ని గాథల ప్రకారం... వ్యాకరణ శాస్త్రాన్ని బోధించమని అడిగిన శివుని అభ్యర్థనపై అవలోకితేశ్వరుడు బుద్ధత్వానికి సంబంధించిన 'భవిష్యసి త్వం కుల పుత్ర విప్రుతాయాం లోకధాతౌ, భస్మేశ్వరో నామ తథాగతోర్హన్ సమ్యక్ సంబుద్ధో విద్యాచరణ-సంపన్నో, సుగతో, లోకవిదనుత్తరో పురిస దమ్మ సారథీ, సత్తా దేవ మనుస్సానం' అనే ప్రవచనాన్ని అందించాడు. 'తథాగత తత్త్వ సంగ్రహం'లో... శివుడు భవిష్యత్ బుద్ధుడిగా మారాడనే విషయం ఉంది. బౌద్ధులు మొదట్లో శైవ సిద్ధాంతాన్ని విమర్శించారు. చివరకు శివుణ్ణి జ్ఞానోదయం పొందిన బుద్ధుడిగా మహాయాన బౌద్ధంలో అంగీకరించడం జరిగింది. శివుడు... అవలోకితేశ్వరుడి నుంచి ఉద్భవించినట్టు పరిగణిస్తున్నందున... శివుని లక్షణాలు అనేకం అవలోకితేశ్వరుడికి ఆపాదించారు. ఇదంతా శివుణ్ణి బౌద్ధమతంలో ఒక దేవతగా మార్చే ప్రయత్నమేనని కొందరు భావిస్తారు. ఈ విషయంలో లోతైన అధ్యయనం అవసరం.



ఆచార్య చౌడూరి ఉపేంద్రరావు
జెఎన్‌యూ, ఢిల్లీ.

సహజయోగ

శివుడు ప్రసన్నం కావాలంటే...

ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న మాసం కార్తికం. భక్తులందరూ శివాలయాల దర్శనం, అభిషేకాలు, పూజలు, ఉపవాసాలతో ఈ మాసమంతా గడుపుతారు. శివారాధనలో లీనమవుతారు. కానీ ఈ పూజలన్నీ శివుడికి ఆనందాన్ని ఇస్తున్నాయా? ఆ శంకరుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... నిత్య జీవితంలో మనం ఎలా ఉండాలి? ఈ అంశాలను సహజయోగప్రదాయిని శ్రీ మాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాలలో వివరించారు.



మన సూక్ష్మ శరీరంలో శివుని స్థానం... మన హృదయం. అక్కడ ఆత్మ రూపంలో శివుడు నివసిస్తాడు. సచ్చిదానంద స్వరూపమైన శివతత్త్వాన్ని, అంటే ఆయన సాన్నిధ్యాన్ని పొందడం సమస్త మానవాళి ఆధ్యాత్మిక ఉత్థానంలో పరమ గమ్యం. కొన్ని వేల సంవత్సరాల నుంచి ఋషులు, మునులు ఆ గమ్యాన్ని చేరడానికే కఠోరమైన తపస్సులు ఆచరించారు. ఇంతకీ శివతత్త్వం అంటే ఏమిటి? శివుని గుణగణాలు, స్వరూప స్వభావాలు ఏమిటి? వాటిని మనం ఎలా ఆకళింపు చేసుకోగలం? ఎలా ఆచరించుకోగలం? అనేవి ముందుగా తెలుసుకోవాలి.

అడిగినవన్నీ ఇచ్చే అమాయకత్వం, తనకోసం ఏమీ దాచుకోని త్యాగశీలత... ఇవి ప్రేమకు ప్రతిరూపమైన శివుడి ప్రత్యేక గుణాలు. ఆయనది అపరిమితమైన దయాగుణం. అందుకే రాక్షసులకైనా వారు కోరుకున్న వరాలు ఇచ్చేవాడు. శివుని అనుగ్రహంతో వరాలను పొంది, ఆ తరువాత లోకాన్నే కాదు, ఆయననూ ఇబ్బంది పెట్టిన రాక్షసుల కథలు కోకొల్లలు. భస్మాసురుడి కథ దీనికి ఒక ఉదాహరణ. అయినా ఆయన అడిగినవి కాదనకుండా ఇస్తూనే ఉంటాడు. అందుకే శివుణ్ణి భోళా శంకరుడు అంటారు. కానీ దుష్టులు, దుర్మార్గులు ఎప్పుడూ భౌతికమైన భోగ భాగ్యాలను, అధికారాన్ని, అపారమైన శక్తులను కోరుకుంటారు. వాటి కారణంగా అహంకారం పెంచుకుంటారు. తమ వినాశనాన్ని తామే కొనితెచ్చుకుంటారు. సజ్జనులు ఆధ్యాత్మికమైన సుగుణాలను, భగవంతుడి సేవా భాగ్యాన్ని కోరుకుంటారు. వాటి ద్వారా మోక్షాన్ని పొందుతారు. ఆ భగవంతుడికి చేరువవుతారు. సర్వాంతర్యామి అయిన శివుడికి ఇది తెలుసు.

విలువనిచ్చేది భక్తిప్రపత్తులకే...

విశ్వానికి అధినాథుడైన, లోకాలను ఏలే రాజైన శివుడికి తల మీద కిరీటమైనా ఉండదు. దేవతలందరూ కిరీటాలను, ఆడంబరమైన ఆభరణాలను ధరించినా... ఆ మహాదేవుడు మాత్రం జటాజూటంతోనే ఉంటాడు. ఆయన విలువనిచ్చేది భౌతికమైన వస్తువులకు, ఆభరణాలకు కాదు... ఆధ్యాత్మికతతో నిండిన వైఖరికి, భక్తిప్రపత్తులకు మాత్రమే. శంకరుడి నిరాడంబరత గురించి శ్రీ మాతాజీ ఒక సందర్భంలో ప్రస్తావిస్తూ.... శివపార్వతుల వివాహ ఘట్టాన్ని వివరించారు. తన వాహనమైన ఎద్దును ఎక్కి, ఎలాంటి ఆభరణాలు లేకుండా, కేవలం వ్యాఘ్ర చర్మాన్ని ధరించి, విభూతిని, చందనాన్ని పులుముకొని... ఒక సన్యాసిలా శివుడు తన పెళ్ళికి తరలివచ్చాడు. పర్వతరాజ కుమార్తె అయిన పార్వతి. ఆమె సోదరుడైన విష్ణువు రాజులా సకల సిరిసంపదలతో, సమస్త అలంకారాలతో తులతూగుతూ ఉంటాడు. శివుణ్ణి, అతని పరివారాన్ని చూసిన పార్వతీదేవి సిగ్గుపడింది. 'ఏమిటీయన? వివాహానికి ఇలా వచ్చారు? ఆయన పరివారం కూడా అలాగే ఉన్నారు. ఒకరికి ఒకే కన్ను ఉంటే, మరొకరికి ఒక కొమ్ము ఉంది. ఇలా వస్తే మా బంధువులందరూ ఏమనుకుంటారు?' అనుకుంది. కళ్ళు మూసుకొని, విష్ణువును తలచుకుంటూ 'మన స్థాయి ఏమిటో అందరికీ అర్థమయ్యేలా చెయ్యి' అని ప్రార్థించింది. ఆమె కళ్ళు తెరిచి చూసేసరికి... శివుడి పాదాలను విష్ణువు కడుగుతూ కనిపించాడట. "నా దగ్గర ఉన్న సంపదలన్నీ నా సోదరికి కట్నంగా ఇచ్చినా... ఈయన పాదధూళికి సరితూగవు" అన్నాడట. శివుని నిరాడంబరతను, ఆయన గొప్పతనాన్ని ఈ కథ వెల్లడిస్తుందని శ్రీమాతాజీ పేర్కొన్నారు.

> **శివకేశవులు ఇద్దరూ ఒక్కటే. మార్గం విష్ణువు అయితే గమ్యం శివుడు. మన సూక్ష్మ శరీరంలోని కుండలినీ శక్తి జాగృతి చెందిన తరువాత... విష్ణువు అధిష్ఠానదేవతగా ఉండే సుషుమ్నా మార్గం ద్వారా... ఊర్ధ్వ ముఖంగా ప్రయాణించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సహస్రారంలో ఉండే శివుణ్ణి చేరుకుంటుంది.**

సకల చరాచర సృష్టికర్త అయిన శివుడికి తన సృష్టి పట్ల ఉన్న ప్రేమను తెలియజేసే అద్భుతమైన ఘట్టం క్షీరసాగర మథనం. దేవతలు, రాక్షసులు, అమృతం కోసం అర్రులు చాస్తే... శివుడు మాత్రమే హాలాహలాన్ని స్వీకరించి... సమస్త విశ్వాన్నీ రక్షించాడు.

ఆత్మావలోకనం చేసుకోవాలి...

శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... మనలో ఆయన నివసించే చోటైన మన హృదయం స్వచ్ఛంగా ఉండాలి. దానిలో సాటి మానవుల పట్ల ప్రేమ ఉండాలి. కామం, లోభం, ప్రతిఫలాపేక్ష ఉండకూడదు. మన హృదయంలో ఆ మహాదేవుడి ప్రతిబింబం కొలువై ఉన్నదనీ, అది అన్నిటికీ మించినదనీ, మన మనస్సుకు, ఆలోచనలకు అతీతమైనదనీ గ్రహించాలి. శివతత్త్వాన్ని గ్రహించాలంటే ఆత్మావలోకనం చేసుకోవాలి. మన హృదయంలోని మురికిని తొలగించుకోవాలి. మనకు అసూయ ఉంటే హృదయం అనే అద్దం శుభ్రంగా ఉండదు. దానిలో భగవంతుడి ప్రతిబింబం కూడా పరిపూర్ణంగా ఉండదు. రోజూ శివుణ్ణి పూజిస్తున్నా, అభిషేకాలు చేస్తున్నా... మనలోని అరిషడ్వర్గాలను వదిలిపెట్టకపోతే శివతత్త్వాన్ని అందుకోలేం. దాన్ని పొందాలంటే హృదయం నిర్మలంగా ఉండాలి. ఎలాంటి అలజడులు లేకుండా, స్వచ్ఛమైన నీరు ఉన్న సరస్సు మాత్రమే ఆకాశంలోని సూర్యుణ్ణి చక్కగా ప్రతిబింబిస్తుంది. అదే విధంగా మన హృదయంలో ఎలాంటి ఆలోచనలు లేకుండా, నిర్విచారంగా, ఎవరిపట్లా ఏ విధమైన ద్వేషం, కోపం లేకుండా ఉన్నప్పుడు మాత్రమే.... భగవంతుడి నిజమైన స్వరూపాన్ని ప్రతిబింబించగలుగుతాం.

శివకేశవుల మధ్య భేదాన్ని చూడకూడదని కూడా శ్రీమాతాజీ ఉపదేశించారు. శివకేశవులు ఇద్దరూ ఒక్కటే. మార్గం విష్ణువు అయితే గమ్యం శివుడు. విష్ణువును పూజించనిదే శివుణ్ణి చేరుకోలేం. శివుణ్ణి పూజించకపోతే విష్ణువు మార్గంలో ఉండలేం. మన సూక్ష్మ శరీరంలోని కుండలినీ శక్తి జాగృతి చెందిన తరువాత... విష్ణువు అధిష్ఠానదేవతగా ఉండే సుషుమ్నా మార్గం ద్వారా... ఊర్ధ్వ ముఖంగా ప్రయాణించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సహస్రారంలో ఉండే శివుణ్ణి చేరుకుంటుంది. మన సూక్ష్మ శరీరంలో ఎడమవైపున... శివుడి స్థానమైన హృదయ చక్రం... మన తల్లితో మనకు ఉన్న అనుబంధాన్ని సూచిస్తుంది. ఎవరైతే తల్లిని దైవ సమానంగా భావిస్తారో... వారిపట్ల శంకరుడు అత్యంత ప్రసన్నుడై ఉంటాడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రుల సంరక్షణను, బాగోగులను పట్టించుకోనివాళ్ళు కాశీకి వెళ్ళి గంగానదిలో ఎన్నిసార్లు మునిగినా శివుడి అనుగ్రహం పొందడం కష్టం.

> **శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే మనలో ఆయన నివసించే చోటైన మన హృదయం స్వచ్ఛంగా ఉండాలి. దానిలో సాటి మానవుల పట్ల ప్రేమ ఉండాలి. కామం, లోభం, ప్రతిఫలాపేక్ష ఉండకూడదు.**

సత్యం తెలిసేది అక్కడే...

ఇక... ఆదిదంపతులైన శివపార్వతులు... భార్యాభర్తల మధ్య ఉండవలసిన ప్రేమానుబంధానికి ప్రతీకలు. ఏ ఇంట్లో భార్యాభర్తలు అటువంటి ప్రేమానుబంధాన్ని కలిగి ఉంటారో... వారి ఇంట్లో ఆ ఆది దంపతులు కొలువై ఉంటారు.

శివుణ్ణి సచ్చిదానంద స్వరూపునిగా వర్ణించారు పూర్వులు. అంటే సత్యాన్ని, చిత్తాన్ని, ఆనందాన్ని స్వరూపంగా కలిగినవాడు. ఏ విషయంలోనైనా సత్యం అనేది సహస్రారంలో ఉండే ఆ సదాశివుడి పాదాల చెంతనే మనకు తెలుస్తుంది. మన చిత్తం ప్రకాశవంతమైనప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. నిర్మలమైన ఆనందంతో ఉండే వ్యక్తి భగవంతుణ్ణి సంపూర్ణంగా ప్రతిబింబించగలుగుతాడు. సచ్చిదానంద స్వరూపమైన శివతత్త్వాన్ని పొందగలిగినవారి జన్మ ధన్యం. కానీ మన లోపల ఉండే అరిషడ్వర్గాలు దానికి అడ్డుపడతాయి. సహజయోగంలో కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మనలోని ఆత్మ ఉనికిని అనుభూతి చెందడం ప్రారంభిస్తాం. ఆత్మ పరిశీలనద్వారా అరిషడ్వర్గాలను క్రమంగా తొలగించుకున్నప్పుడు పరిపూర్ణమైన ఆత్మస్వరూపులం అవుతాం. అప్పుడు భగవంతుడి ప్రతిబింబాన్ని మన హృదయంలో స్పష్టంగా ప్రతిబింబించగలుగుతాం. అలాంటి వ్యక్తులలో దైవిక గుణాలన్నీ ప్రస్ఫుటం అవుతూ ఉంటాయి. వారు నిత్యమైన, నిరామయమైన సదాశివుడి సాన్నిధ్యాన్ని పొందుతారు.



డాక్టర్ పి. రాకేష్ 8988982200
పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్, తెలంగాణ

ఆలయ దర్శనం

తొండమనాడు ప్రసన్న వేంకటేశ్వరుడు



తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దివ్య ధామాన్ని నిర్మించిన తొండమాన్ చక్రవర్తి... తన ఇంట కొలువు తీరిన ఆ స్వామి కోసం నిర్మించిన క్షేత్రం... ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తొండమనాడులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయం. పురాతనమైన ఈ ఆలయం ఎంతో మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఏ ఆలయంలోనైనా వేంకటేశ్వరుని విగ్రహం నిలువెత్తుగా కనిపిస్తుంది. కానీ తొండమనాడులో మాత్రం స్వామి యోగముద్రలో ఆసీనుడై ఉంటాడు.

ఈ ఆలయానికి ఆసక్తికరమైన స్థలపురాణం ఉంది. దాని ప్రకారం... శ్రీ వేంకటేశ్వరునికి తొండమనాడు మండలాన్ని పాలించిన తొండమాన్ చక్రవర్తి పరమ భక్తుడు. స్వామి పరిణయమాడిన పద్మావతీదేవి తండ్రి అయిన ఆకాశరాజుకు సోదరుడు. ప్రతిరోజూ అతను తిరుమలకు వెళ్ళి, శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొనేవాడు. వివిధ సేవల్లో పాల్గొనేవాడు. వృద్ధాప్యం వచ్చిన తరువాత... తొండమానుడికి శక్తి సన్నగిల్లింది. నిత్యం తిరుమలకు రావడం కష్టంగా ఉందని స్వామివారికి అతను మొరపెట్టుకున్నాడు. తన కోటలో కొలువై, కైంకర్యాలు స్వీకరించాలని ప్రార్థించాడు. అతని కోరికను మన్నించిన శ్రీ వేంకటేశ్వరస్వామి... తొండమానుడి ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. శ్రీదేవి, భూదేవి సమేతంగా అక్కడే కొలువయ్యాడు. ఇంటిలో ఆవిర్భవించిన స్వామి కాబట్టి ఆయనను తమిళులు 'వీటిల్ ఇరందురాయ్ పెరుమాళ్' అని పిలుస్తారు. తిరుమలలో శ్రీవారి ఆనంద నిలయ నిర్మాత అయిన తొండమానుడు అదే ఆకృతిలో తొండమనాడులో ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయంలోని విమానం తిరుమలలోని ఆనందనిలయ విమానాన్ని పోలి ఉంటుంది. ఆలయం సమీపంలో ఒక పెద్ద తటాకాన్ని తొండమానుడు తవ్వించాడు. తిరుమలలోని ఆకాశగంగ, కపిల తీర్థాల నుంచి ఈ పుష్కరిణిలోకి నీరు వచ్చి చేరుతుంది. ఆ నీటితోనే స్వామి నిత్యాభిషేకాలకు ఆ జలాలను వినియోగిస్తారు.

ఈ ఆలయాన్ని క్రీస్తుశకం తొమ్మిది, పది శతాబ్దాల మధ్య నిర్మించినట్టు చారిత్రకమైన ఆధారాలు చెబుతున్నాయి. మహామండపం, ముఖ మండపం, అంతరాలయం దాటిన తరువాత గర్భగుడిలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు తన దేవేరులతో, శంఖం, చక్రం, అభయహస్తం, యోగ ముద్రలతో దర్శనమిస్తారు. ఇలా కూర్చున్న భంగిమ మరెక్కడా కనిపించదు. ఈ స్వామిని దర్శిస్తే వైవాహిక జీవితంలో ఇబ్బందులు తొలగుతాయని, పెళ్ళికానివారికి వివాహాలు జరుగుతాయనీ భక్తుల నమ్మిక.



ఎలా వెళ్ళాలి?:

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తికి 8 కిలోమీటర్లు, తిరుపతికి 36 కిలోమీటర్ల దూరంలో తొండమనాడు ఉంది. శ్రీకాళహస్తి నుంచి, తిరుపతి నుంచి బస్సు సదుపాయం ఉంది.

సుభాషితం

దైవేన ప్రభుణా స్వయం జగతి యద్యస్య ప్రమాణీకృతం
తత్త్ర స్యోపనమే న్మనా గపి మహా న్నైవా శ్రయః కారణమ్
సర్వాశాపరిపూరకే జలధరే వర్షత్యపి ప్రత్యహం
సూక్ష్మ ఏవ పతంతి చాతకముఖే ద్విత్రాః పయోబిందవః

దక్కేది అంతే



ఎవరు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ, వారికి రాసి పెట్టి ఉన్నదే దక్కుతుందని తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి చెప్పాడు.

ఎవ్వనికి నిజ్జగంబున
నెంతఫలము
దైవకృత మగునది వొందు దప్ప కతని
గారణము గాదు పెనుబ్రాపు ఘనుని జేరు
చాతకము వాతబడు నల్ప జలకణములు అని దాన్ని తెలుగులోకి ఏనుగు లక్ష్మణకవి అనువదించాడు.

భావం: ఈ జగత్తులో ఎవరికి ఎంత ఫలం కలగాలని దేవుడు నిర్ణయించాడో అది మాత్రమే లభిస్తుంది. ఆకాశమంతటా మేఘాలు కమ్ముకొని, కుంభవృష్టి కురుస్తున్నప్పుడు చాతక పక్షి చెట్టు మీద కూర్చొని నోరు తెరిచి ఉంచినా... దాని నోట్లో పడిన కొన్ని వర్షపు బిందువులు మాత్రమే దానికి దక్కుతాయి. ఎంతో ఘనమైన వ్యక్తిని సహాయం కోసం ఆశ్రయించినా.... ప్రాప్తం ఎంత ఉంటుందో అంతే దొరుకుతుంది.. కష్టపడి పని చేయాలి. దానికి తగిన ప్రతిఫలం ఇవ్వాలని ఆ దైవాన్ని కోరుకోవాలి. దైవ కృపను పొందడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే.. సత్ఫలాలు లభిస్తాయి.

చింతన

అదే పరమాత్మ తత్త్వం



ధర్మ స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్మ దివ్య సాన్నిధ్యంలో... ధర్మ పరితత్త్వవేత్త అయిన భీష్మ పితామహుడు... ధర్మజ్ఞుడైన ధర్మరాజుకు బోధించినదే శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం. శ్రీకృష్ణుడి దివ్య తత్త్వాన్ని పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకున్న మహనీయుడు భీష్ముడు. ఆయన శ్రీకృష్ణుణ్ణి చూపిస్తూ ధర్మరాజుతో... "శ్రీ విశ్వస్మై నమః... ఇదిగో ఈయనే విశ్వ పదార్థం" అని చెప్పాడు. 'బ్రహ్మైవేదం విశ్వం (ఈ ప్రపంచం మొత్తం బ్రహ్మ పదార్థమే), 'పురుష ఏవేదం సర్వం' (ఈ సమస్త ప్రపంచం పరమ పురుషుడే) తదితర వేద వాక్యాలు ఈ విశ్వమే పరమాత్మ అని చెబుతున్నాయి. పరమాత్మ అసలైన తత్త్వం విశ్వతత్త్వమే. 'తత్త్వం' అనే పదం స్థానంలో 'రూపం' అని చేర్చుకుంటే... విశ్వరూపం అవుతుంది. 'మత్తః పరతరం నాన్యత్ కించి దస్తి' (నాకంటే వేరైనది ఇక్కడ ఏమీ లేదు) అంటూ ఆ పరమాత్మ తన తత్త్వాన్ని తనే ఆవిష్కరించుకున్నాడు. పరమాత్మ కన్నా వేరైన పదార్థం ఏదీ లేదు కదా! ఆ పరమాత్మే అర్జునుడిపై పరమ దయతో... గీతోపదేశం సందర్భంలో "దివ్యం దదామి తే చక్షుః... నా ఈ విశ్వరూపాన్ని లేదా విశ్వ తత్త్వాన్ని చూడడం లేదా అర్థం చేసుకోవడం సాధారణ మానవులకు సాధ్యం కాదు. దాని కోసం సాధకుడిలో దివ్యత్వం ఉండాలి. 'దివ్యత్వం' అంటే మనస్సు నిర్మలంగా ఉండడం అని చెప్పుకోవచ్చు. ప్రారబ్ధాతిశయం వల్ల మనస్సులు సంశయంతో, వ్యతిరేక నిర్ణయాలతో, ఆపేక్షించకూడని విషయాలతో అల్లకల్లోలంగా ఉంటాయి. నిశ్చయంగా, నిర్మలంగా ఉండవు. కాబట్టి ఓ అర్జునా! నీకు గొప్పదైన మనో నేత్రాన్ని అనుగ్రహిస్తున్నాను. తద్వారా నా విశ్వరూపాన్ని లేదా విశ్వ తత్త్వాన్ని తెలుసుకో" అని అనుగ్రహించాడు.

విశ్వరూపం అంటే నిటారుగా నిలబడిన మనిషికి రకరకాలైన 10, 15 తలలు ఉండడం, పాతికకు పైగా చేతులు ఉండడం, విచిత్రమైన ఆయుధాలను ధరించి ఉండడం అని మాత్రమే భావించకూడదు. అది మనం అర్థం చేసుకోవడానికి చేసిన ఏర్పాటు మాత్రమే. వాస్తవానికి దీన్ని సంగ్రహంగా చెప్పుకోవాలంటే... విశ్వరూపాన్ని చూసిన అర్జునుడు "ఓ శ్రీకృష్ణ పరమాత్మా! నీలో సమస్త బ్రహ్మాండాన్నీ చూస్తున్నాను. అందరూ నీనుంచి ఆవిర్భవిస్తూ, నీలో ఉంటూ, నీలోనే లీనమైపోతున్నారు. అన్ని స్వరూపాలలో నీవే కనిపిస్తున్నావు. నీకన్నా వేరైనది ఏదీ కనిపించడం లేదు, తెలియడం లేదు" అని చెప్పాడు. అసలైన విశ్వతత్త్వం అంటే అదే. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే వేదవాక్యం ద్వారా తెలిసేది ఇదే. ఇటువంటి విశ్వతత్త్వం మనకు అవగతం కావాలంటే అంటే.. మన మనస్సులను నిర్మలం చేసుకోవడానికి ఎంతో సాధన చేయాలి.

ఈ యోగ సాధనలతో పాటు భక్తి కూడా అత్యంత ఆవశ్యకం. ఎందుకంటే పరమాత్ముడు భక్తి సులభుడు. భక్తికి మాత్రమే లభ్యుడు. ఇలా భగవంతుణ్ణి సర్వాంతర్యామిగా, సర్వాత్మకుడిగా భక్తితో దర్శించిన సాధకులు చాలామందే ఉన్నారు. భక్త ప్రహ్లాదుడు తన తండ్రి అయిన హిరణ్యకశిపుడు ఎన్ని రకాల హింసకు గురి చేస్తున్నా.. కత్తిలో, సర్పాలలో, విషంలో... ఇలా ప్రతిదానిలో మహావిష్ణువునే దర్శించాడు. అందుకే అవి తమ ప్రభావం చూపించలేకపోయాయి. 'పరమాత్మ సర్వాంతర్యామి, సర్వస్వరూపుడు' అనే తన భక్తుడి విశ్వాసాన్ని నిలబెట్టడం కోసం... స్తంభంలోంచి తన స్వరూపాన్ని ఆ మహావిష్ణువు ప్రకటించుకోవలసి వచ్చింది. అలాగే రామాయణంలో శబరి అనే మహాసాధ్వి... తన గురువైన మతంగ మహర్షి ఆదేశానుసారం... శ్రీరాముడు అవతరించడానికి సుమారు వంద సంవత్సరాలకు ముందే ఆయనను ఆరాధించేది. తన ఆశ్రమ పరిసరాలలో ఏ కదలిక కనిపించినా, ఏ శబ్దం వినిపించినా... అది శ్రీరామచంద్రమూర్తే అని ఆమె భావించింది. అందుకే ఒకనాడు రాముడు స్వయంగా వెళ్ళి ఆమె సేవలు అందుకున్నాడు. అలాంటి సందర్భాల్లో ఆ భక్తులకు కలిగే ఆనందానుభూతి వర్ణించలేనిది. కాబట్టి మనం కూడా అనవసరమైన విషయాల మీద ఆసక్తిని పెంచుకోవడం ద్వారా మనస్సులో పేరుకుపోతున్న కల్లోలాన్ని తగ్గించుకుందాం. భక్తిని, విశ్వాసాన్ని పెంపొందించుకుందాం. సర్వోపగతుడైన మహావిష్ణువు తాలూకు విశ్వతత్త్వాన్ని అనుభూతిలోకి తెచ్చుకుందాం. పరమానందానుభూతిని పొందే ప్రయత్నం చేద్దాం. ఆ భగవంతుడి పరిపూర్ణ అనుగ్రహానికి పాత్రులమవుదాం.

> **ఈ యోగ సాధనలతో పాటు భక్తి కూడా అత్యంత ఆవశ్యకం. ఎందుకంటే పరమాత్ముడు భక్తి సులభుడు. భక్తికి మాత్రమే లభ్యుడు. ఇలా భగవంతుణ్ణి సర్వాంతర్యామిగా, సర్వాత్మకుడిగా భక్తితో దర్శించిన సాధకులు చాలామందే ఉన్నారు**

• కుప్పా నరసింహ శాస్త్రి, శాస్త్ర పండిట్, తిరుపతి

పీజీ ఇన్‌సర్వీస్ కోటా జీవోపై వ్యాజ్యాలు కొట్టివేత

- నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటేనే జోక్యం చేసుకుంటాం
- జీవో ఇచ్చాకే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది: హైకోర్టు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్య ప్రవేశాలలో ఇన్‌సర్వీస్ కోటాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 85ను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టివేసింది. ఇన్‌సర్వీస్ కోటా సీట్ల శాతాన్ని ఖరారు చేసి, జీవో జారీ చేశాకే. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తుచేసింది. ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయం ఏకపక్షంగా ఉంటేనే కోర్టులు జోక్యం చేసుకోగలవని స్పష్టం చేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పీజీ వైద్య విద్యలో ప్రవేశాలకు ఇన్‌సర్వీస్ కోటా సీట్లకు సంబంధించి ప్రభుత్వం జులై 20న జీవో 85 జారీ చేసింది. క్లినికల్ సీట్లలో 15శాతం, నాన్ క్లినికల్ సీట్లలో 30శాతం సీట్లను ఖరారు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు వైద్యులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ పీజీ ప్రవేశాలకు ఏప్రిల్‌లోనే నోటిఫికేషన్ ఇచ్చారని, ఆతర్వాత జీవో 85 జారీ చేశారని, అందువల్ల ఆ జీవోను కొట్టివేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ నోటిఫికేషన్ ఇచ్చాక జీవో జారీచేశామన్న పిటిషనర్ల వాదనలో వాస్తవం లేదన్నారు. ఇన్‌సర్వీస్ కోటాను ఖరారు చేస్తూ ప్రభుత్వం జులైలో జీవో ఇచ్చిందన్నారు. ఆ తర్వాత పీజీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ సెప్టెంబరులో నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పిటిషనర్ల వాదనను తోసిపుచ్చుతూ వ్యాజ్యాలను కొట్టివేసింది.

నటి కాదంబరి జెత్వాని కేసు... కౌంటర్‌కు సమయం కోరిన ప్రాసిక్యూషన్

- అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి.. విచారణ 26కి వాయిదా

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పోలీసు అధికారులు దాఖలు చేసిన పిటిషన్లలో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని ప్రాసిక్యూషన్ గురువారం హైకోర్టును అభ్యర్థించింది. దీంతో విచారణను ఈ నెల 26కి వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్ ప్రకటించారు. కౌంటర్లు వేసేందుకు చివరి అవకాశం ఇస్తున్నామని, ఆరోజు తుది విచారణ జరుపుతామని స్పష్టం చేశారు. పిటిషనర్లపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఐపీఎస్ అధికారులు క్రాంతిరాణా తాతా, విశాల్‌గున్ని, ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వినోద్‌కుమార్ దేశ్‌పాండే, ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలని కోరారు.

విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

విజయవాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. కేసు సీఐడీకి బదిలీ అయిన తర్వాత మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ సాగుతోంది. విద్యాసాగర్‌ను వారంరోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విద్యాసాగర్ తరఫు న్యాయవాది గిరీష్ చౌదరి కౌంటర్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై కోర్టులో గురువారం వాదనలు జరిగాయి. కాదంబరి జెత్వానీ వేధింపులకు అసలు కారకుడు కుక్కల విద్యాసాగర్ అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమావతి వాదనలు వినిపించారు. ఆయన నుంచి మరిన్ని వివరాలను సేకరించాల్సి ఉందని వివరించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్లు విచారణలో ఉన్నందున ఈ విచారణను ఆపాలని గిరీష్ చౌదరి కోరారు. ఇద్దరి వాదనలను విన్న తర్వాత న్యాయాధికారి తిరుమలరావు తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు.

ముగ్గురు స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

ఏపీఎస్‌పీడీసీఎల్ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది కోట వెంకట రామారావు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ల తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఎం.కృష్ణారావు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఏపీఎస్ఆర్టీసీ తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఎ.రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి వి.సునీత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెట్రోలు బంకుల్లో 'లీగల్ మెట్రాలజీ' తనిఖీలు

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తూనికలు కొలతలశాఖ అధికారులు గురువారం పలు జిల్లాల్లోని పెట్రోలు బంకుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విశాఖపట్నం, పశ్చిమగోదావరి, ప్రకాశం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని 104 బంకుల్లో తనిఖీలు చేపట్టి, లీగల్ మెట్రాలజీ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిన 16 బంకులపై కేసులు నమోదు చేశారు.

ఆలయాలపై ప్రభుత్వ నియంత్రణ వద్దు: వీహెచ్‌పీ

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'హిందూ ఆలయాలపై ప్రభుత్వ నియంత్రణ వద్దు. హైందవ సంఘాలకు ఆ బాధ్యతలు అప్పగించాలి' అని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ జనరల్ మిలింద్ పరాండే అన్నారు. విజయవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సనాతన ధర్మం, సంస్కృతి పరిరక్షణ జరగాలంటే హైందవ సమాజానికి ఆలయాల నిర్వహణ బాధ్యత అప్పగించాలి. మసీదులు, చర్చిలకు లేని ప్రభుత్వ నియంత్రణ హిందూ ఆలయాలపైనే ఎందుకు? అయోధ్య ఆలయంపై ప్రభుత్వ అజమాయిషీ లేదు. ఇదే అంశంపై జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం నిర్వహిస్తున్నాం. హిందువులకు నష్టం జరిగితే దేశానికి నష్టం. తిరుపతి లడ్డూ విషయంలో హిందువులు, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి' అని పరాండే అన్నారు. వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ ఓఎస్‌డీపై వేటు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఓఎస్‌డీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రామ్మోహనరావును విధుల నుంచి తొలగించాలని జీఏడీ పొలిటికల్ విభాగం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 4న శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జల వనరుల శాఖలో అడిషనల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తూ 2019లో రామ్మోహనరావు పదవీ విరమణ చేశారు. అప్పటినుంచి ఆయన ఆ శాఖలోనే ఓఎస్‌డీగా కొనసాగుతూ వచ్చారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులను మళ్లీ ప్రభుత్వ సేవల్లోకి తీసుకోవాలంటే సీఎస్ అధ్యక్షతన కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆగస్టు 22న(ఉత్తర్వు నం 1466) ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిప్రకారం.. కమిటీ ఆమోదం లేనందున రామ్మోహనరావును ఓఎస్‌డీ విధుల నుంచి తొలగిస్తున్నట్లుగా సాధారణ పరిపాలనా శాఖ పేర్కొంది.

వైసీపీ 'సైకో ఫ్యాక్టరీ!'

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ 'సైకో ఫ్యాక్టరీల'ను ఏర్పాటు చేసింది. తాడేపల్లి వేదికగా ఎంపిక చేసే కంటెంట్... బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు విదేశాల్లోని ఫేక్ పోస్టుల ఫ్యాక్టరీలకు వెళుతుంది. అక్కడ... మార్ఫింగ్ ఫొటోలు, హేయమైన భాష, అసహ్యకరమైన వ్యాఖ్యలతో పోస్టులను తయారు చేస్తారు. అవి... వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌కు చేరుతాయి. అక్కడి నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాల వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లకు వెళ్తాయి. అక్కడి నుంచి 175 అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు, కో కన్వీనర్లకు చేరుతాయి. ఆపై మండల స్థాయికి, చివరగా... గ్రామ, వార్డు స్థాయుల్లో ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూప్‌లు, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్టులు చేరవేస్తారు. ఇలా కొన్ని గంటల్లోనే పాతిక, ముప్పై వేల మందికి చేరుతుంది. ఆ పోస్టులపై కొందరు ఉన్మాదులు మరింత నీచమైన కామెంట్లు చేస్తారు. ఇందులో పచ్చి బూతులు, నీచ వ్యాఖ్యానాలను ఎంపిక చేసి... వాటిని జిల్లా కేంద్రానికి, రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా విభాగానికి పంపుతారు. వాటి ఆధారంగా మళ్లీ నీచ పోస్టులు తయారు చేసి సోషల్ మీడియాలోకి వదులుతారు. ఇదో... నిత్య కృత్యంలాగా సాగుతుంది.

అన్ని కోణాల్లో అష్ట దిగ్బంధనం...

సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ ఎక్కడి నుంచి వస్తోంది? ఆ ఫ్యాక్టరీ ఎక్కడుంది? తయారీదారులెవరు? కంటెంట్ ఇస్తున్నదెవరు? వాటిని ఎలా వైరల్ చేస్తున్నారు? ఆ వ్యక్తుల దినచర్య ఏమిటి? కుటుంబం, చదువు, ఆదాయం, సోషల్ మీడియా అకౌంట్లు, పరిచయాలు, పెడుతున్న పోస్టింగ్‌లు.... ఇలా అన్ని వివరాలను పోలీసులు సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా పాతిక ముప్పై వేల మంది సైబర్ సైకోల ప్రొఫైల్స్ సేకరించారు. వైసీపీ సోషల్ మీడియా విష ప్రచారంలో సజ్జల భార్గవ రెడ్డి, ఇంటూరి రవి కిరణ్ కీలకమని పోలీసులు గుర్తించారు. వైసీపీ అధికారంలో ఉండగా... డిజిటల్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ ధనంతో సోషల్ మీడియా విభాగాన్ని నడిపించారు. అధికారం కోల్పోయాక... సిబ్బంది సంఖ్యను తగ్గించుకుని నడిపిస్తున్నారు.

చట్టాల పరిధిలోనే కఠిన చర్యలు..

సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాల్లో బలమైన సెక్షన్లు లేవని, 41ఏ నోటీసు ఇచ్చి విచారణకు పిలవాల్సిందేనని జగన్ రెడ్డి గగ్గోలు పెడుతున్నారు. అయితే... పోలీసులు దీనికి బలమైన విరుగుడు కనిపెట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కుమార్తెలపై పిచ్చి వ్యాఖ్యలతో పోస్టులు పెట్టిన వారిపై 'పోక్సో' చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. పిల్లలపై అసభ్యకరమైన పోస్టులు పెడితే ఆ చట్టం వర్తిస్తుంది. అలాగే... మహిళలపై పెట్టిన పోస్టింగ్‌లకు సంబంధించి 'క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్'కు సంబంధించిన చట్టాలు, హోంశాఖ మంత్రి అనితపై పెడుతున్న వ్యాఖ్యలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగిస్తున్నారు.

> **ఇది 'ఆర్గనైజ్డ్ క్రైమ్'!**
>
> కూటమి నేతలపై సోషల్ మీడియాలో జరుగుతున్నది కొందరు వ్యక్తులు చేస్తున్న పని కాదు! ఇది... ఒక వ్యవస్థ ద్వారా చేస్తున్న దుష్ప్రచారం. ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్ కిందకే వస్తుందని పోలీసులు తేల్చారు. ఏదైనా పోస్టు వల్ల మనస్తాపం చెంది ఎవరైనా బలవన్మరణానికి పాల్పడినా, మరైదేనా అవాంఛనీయ ఘటన జరిగినా... ఇందులో భాగస్వాములైన వారందరిపైనా కేసు పెట్టవచ్చు. అంటే... ఒక్కపోస్టుతో మొత్తం వైసీపీ సోషల్ మీడియా విభాగంలో ఉన్న వాళ్లందరిపైనా చర్యలు తీసుకోవచ్చు. 'భారత న్యాయ సంహిత'లో దీనికి సంబంధించి బలమైన సెక్షన్లు ఉన్నాయి. "ఇది అమాయక గిరిజనులను బ్రెయిన్‌వాష్ చేసి... వారిచేత ఆయుధాలు పట్టించడం లాంటిదే. డబ్బు ఆశచూపించి, ఫేక్ కంటెంట్‌ను తయారు చేయించి, సోషల్ మీడియాలో పెట్టించడమూ ఆర్గనైజ్డ్ క్రైమ్ కిందికే వస్తుంది" అని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

15 వేల ఎల్‌వోసీలు...

సోషల్ మీడియాలో విష ప్రచారాన్ని అరికట్టేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. వైసీపీ సోషల్ మీడియాలో సుమారు ముప్పై వేల మంది భాగస్వాములు ఉండగా... వీరిలో 15 వేల మంది వరకూ ఉగ్రవాదుల తరహాలో చెలరేగిపోతున్నట్లు గుర్తించారు. ఇప్పటికే వారందరినీ గుర్తించారు. వాళ్ల సోషల్ మీడియా అకౌంట్లపై నిఘా పెట్టారు. దీని కోసం జిల్లాకు పది మంది చొప్పున ఓఎస్ ఇంటిలిజెన్స్ టూల్స్ నిపుణులను నియమించారు. క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవడం మొదలుకాగానే 'సైకో బ్యాచ్' ఇతర ప్రాంతాలు, దేశాలకు పారిపోయే అవకాశం కూడా ఉంటుందని అనుమానిస్తున్నారు. అందుకే... కనీవినీ ఎరుగని రీతిలో 15వేల లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ)లు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వాళ్ల కుటుంబ సభ్యులను సైతం సంప్రదించి... విచారణకు సహకరించాల్సిందిగా కోరుతున్నారు. సైబర్ సైకోలను సోషల్ మీడియాలో ఫాలో చేసే వారికి 160 నోటీసు(సాక్ష్యం చెప్పడం) ఇచ్చి పోలీసు స్టేషన్లకు పిలుస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా నెల రోజుల్లోనే సోషల్ మీడియా విష వృక్షాన్ని పెకలించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

రవాణాలో ఏటీఎస్‌లకు బ్రేకులు

- ఎంవీఐ లేకుండా ఏకపక్షంగా ప్రైవేటుకు నో
- వైసీపీ నేతల అనుచరుల దోపిడీకి అడ్డుకట్ట
- రెండేళ్ల ఆదాయం మొత్తం తీసుకునేందుకు అనుమతి లేదు
- అనంతపురం, నంద్యాల ఏటీఎస్‌లు నిలిపేసిన రవాణాశాఖ
- ఇప్పుడు ఆపేస్తే ఎలా.. కోర్టుకు వెళతాం: ఏటీఎస్ కాంట్రాక్టర్లు
- ఆర్థిక శాఖ ఆమోదం తర్వాతే అమలు: కాంతిలాల్ దండే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రవాణా శాఖలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎ‌స్)ల ఏర్పాటు గందరగోళానికి దారితీసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయాలని కమిషనరేట్ నుంచి ప్రయత్నాలు జరుగుతుంటే.. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కుమ్మక్కై ప్రభుత్వ సొమ్ము దోచుకోవడానికి చేసుకున్న విధానాన్ని ఆమోదిస్తారా..? అంటూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆయన.. వైసీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బంధువులు అనేక లొసుగులతో దోపిడీకి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేకు సూచించారు. దీంతో ఆయన ఫిర్యాదుల ఆధారంగా కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వాటికి సమాధానాలు చెప్పాలని కోరుతూ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాకు అంతర్గత మెమో జారీ చేశారు. కమిషనర్ ఈ నెల 10 వరకూ సెలవులో ఉండటంతో ఏటీఎస్‌ల ఏర్పాటుకు తాత్కాలిక బ్రేకులు వేస్తూ కాంతిలాల్ దండే ఆదేశాలిచ్చారు. ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన తర్వాతే ఏటీఎస్‌ల ఏర్పాటు జరుగుతుందని స్పష్టం చేశారు. దీనిపై ఏటీఎస్‌లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

టెండరు నిబంధనలు మార్చినట్టు ఫిర్యాదు

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలకు కారణాలపై అధ్యయనం చేసిన కేంద్ర ప్రభుత్వం వాహన ఫిట్‌నెస్ ఒక ప్రధాన కారణమని గుర్తించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఆటోమేటిక్ ఫిట్‌నెస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రైవేటు వ్యక్తులకైనా వాటిని అప్పగించవచ్చని సూచించింది. దీంతో ఏపీలో ఏటీఎస్‌లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు వైసీపీ ప్రభుత్వం ఏడాది క్రితమే ప్రక్రియ ప్రారంభించింది. ఎన్నికలకు ముందు హడావుడిగా టెండర్లు వేయగా... వైసీపీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బంధువులు ఏడు కేంద్రాలను దక్కించుకున్నారని ఇటీవల రవాణా మంత్రికి ఫిర్యాదులు అందాయి. వినగతా వాటిని కూడా ఈ ఏడాది అక్టోబరు 31లోపు ఏర్పాటు చేయాలని కేంద్రం గడువు విధించడంతో కూటమి సర్కారు ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. అయితే కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ నిబంధనలకు విరుద్ధంగా... రెండేళ్ల పాటు టెస్టింగ్ ఫీజుతోపాటు సర్టిఫికెట్ ఫీజుల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని ఏటీఎస్ నిర్వాహకులకే ఇచ్చేలా టెండరు నిబంధనలు మార్చారని మంత్రి దృష్టికి వచ్చింది. దీంతో ఆయన అధికారులతో సమీక్షించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) ప్రతిదీ తనిఖీ చేశాకే ఫిట్‌నెస్‌కు అనుమతిస్తారని, దీన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే తప్పులు ఎక్కువ జరుగుతాయని అధికారులు తెలిపారు. గుజరాత్‌లో 5వేల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు నకిలీవని తేలాయని గుర్తు చేశారు. తెలంగాణ, కేరళలో సొంతంగా ప్రభుత్వాలే ఏర్పాటు చేస్తున్నాయని, ఏపీలోనూ అదే పద్ధతి కొనసాగిస్తే బాగుంటుందని చెప్పారు. సమ్మతించిన మంత్రి.. నాన్ ఆటోమేటిక్ పరిశీలనకు ఎంవీఐలను ఏటీఎస్‌ల్లో నియవించాలని, పూర్తిగా ప్రైవేటు పెత్తనాన్ని ఒప్పుకోవద్దని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శికి చెప్పారు. అదే సమయంలో రెండేళ్ల పాటు మొత్తం ఆదాయం తీసుకునే నిబంధన కూడా మార్చాలని, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఇప్పటికే మొదలైన అనంతపురం, నంద్యాల ఏటీఎస్‌లను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం నుంచి ఆ రెండు ఏటీఎస్‌లు ఆగిపోయాయి. ఎంవీఐలు పాత పద్ధతిలోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ) ఇచ్చారు. దీనిపై రాష్ట్రంలో రవాణా శాఖ రివర్స్‌లో వెళుతుందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే.. తాము ఏటీఎస్‌లను వద్దనడం లేదని, ఆర్థిక శాఖ ఆమోదం, అనుమానాల నివృత్తి తర్వాత వాటిని ఆమోదిస్తామని కాంతిలాల్ దండే చెబుతున్నారు.

> **ఇదేమి నిర్ణయం.. కోర్టుకెళతాం**
>
> ఈ చర్యతో ఏటీఎస్ కేంద్రాలు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏటీఎస్‌లను ఏర్పాటు చేయాలంటే ఒక్కో చోట మూడు, నాలుగు కోట్లు ఖర్చవుతుందని, ప్రభుత్వం రూపాయి ఇవ్వదు గనుక రెండేళ్ల పాటు ఫిట్‌నెస్ ఫీజు మొత్తం తీసుకునేలా గత ప్రభుత్వం టెండరు షరతుల్లో పేర్కొందని గుర్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల తగ్గింపునకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా టెక్నాలజీ వైపు వెళ్తుంటే ఏపీలో అందుకు భిన్నంగా రివర్స్‌లో వెళ్లడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రవాణా శాఖ తీసుకున్న నిర్ణయంపై కోర్టుకు వెళతామని చెబుతున్నారు.

> **అడ్డగోలు దోపిడీకి బ్రేకులు..: రవాణా శాఖ**
>
> ఇప్పుడు ఒక ఆటోకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) చేస్తే ఎంత..? ఏటీఎస్ ద్వారా అదనంగా తీసుకునేది ఎంత..? భారీ వాహనానికి మాన్యువల్‌గా తీసుకునే ఫీజుకన్నా ఆటోమేటిక్ ద్వారా తీసుకునే అదనం ఎంత..? ఇలా ప్రతిదీ లెక్కించి రాష్ట్ర ప్రభుత్వం ఏటా కోల్పోయే ఆదాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుని సముచిత నిర్ణయం తీసుకుంటామని రవాణా మంత్రిత్వ శాఖ చెబుతోంది. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులు ప్రభుత్వ ఖజానాకు కాకుండా ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టేందుకు ఎలా సహకరిస్తామని ప్రశ్నిస్తోంది. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా ముందుకెళ్తామని తెలిపింది.

తాకట్టులో బరమ్ పార్క్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువెళ్లి మార్ట్‌గేజ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో పర్యాటక శాఖకు నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఏపీటీడీసీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. రెండేళ్ల క్రితం ఏపీటీడీసీకి చెందిన దాదాపు 15పర్యాటక ప్రదేశాలను రీమోడలింగ్ చేయాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు దాదాపు రూ.160 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. వాస్తవంగా పర్యాటకాభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. కానీ జగన్ ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించలేదు. కానీ పర్యాటక ఆస్తి అయిన రుషికొండను ధ్వంసం చేసి ఇంద్రభవనం లాంటి ప్యాలెస్ నిర్మించుకున్నారు. దీనికోసం రూ.500 కోట్లు ఖర్చు పెట్టారు. పర్యాటక ప్రదేశాల రీమోడలింగ్‌కు అవసరమైన నిధులు ఇవ్వకపోగా, ఏపీటీడీసీ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని అభివృద్ధి చేసుకోవాలని సలహాలు ఇచ్చారు. టూరిజం అధికారులు ఆస్తులు తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఏపీటీడీసీ ప్రతిపాదనలపై బ్యాంకు దాదాపు రూ.160 కోట్లు రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. రీమోడలింగ్ పనులు మూడు దశలో పూర్తి చేయాల్సి ఉంది. ఫేజ్-1లో 49.30కోట్ల వరకూ రుణాలు తీసుకుంటారు. ఫేజ్-2లో 54.12కోట్లు, ఫేజ్-3లో 34.80 కోట్లు రుణాలు తీసుకునేందుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. సివిల్ పనులకు మూడు దశల్లో 138.22 కోట్లు ఖర్చు చేయాలని, మరో రూ.22 కోట్లతో ఫర్నీచర్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. 2025 మార్చి నాటికి 15 యూనిట్లలో రీమోడలింగ్ పనులు పూర్తి కావాలి. 2025 మార్చి తర్వాత ఏపీటీడీసీకి రుణాలు ఇచ్చిన బ్యాంక్‌కు రీపేమెంట్ చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో ఫేజ్-1 పనులు ప్రారంభించారు. ఇందులో కొన్ని యూనిట్లలో పనులు పూర్తికాలేదు. రెండు, మూడు యూనిట్లలో పనులే ప్రారంభించలేదు. బ్యాంక్ నుంచి కాంట్రాక్టర్లకు రూ.18కోట్ల బిల్లులు చెల్లింపు చేశారు. కానీ ఏపీటీడీసీ అధికారులు ఆస్తి మార్ట్‌గేజ్ చేయకపోవడంతో బ్యాంక్ అధికారులు రుణాలు నిలిపివేశారు. దీంతో బుధవారం అధికారులు ఎస్‌బీఐకి వెళ్లి బరమ్ పార్క్ ఆస్తి పేపర్లు మార్ట్‌గేజ్ చేశారు. ఈ విషయం కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టిలో ఉందో? లేదో? తెలియదు. పర్యాటకానికి పెద్ద పీట వేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఏపీటీడీసీ అధికారులు ఇప్పటివరకూ తీసుకున్న రుణాలు రూ.18 కోట్లే. బ్యాంక్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ఆ రూ.18కోట్లు రీపేమెంట్ చేయడం పెద్ద సమస్య కాదు. ప్రభుత్వం వెంటనే తాకట్టు విషయంలో జోక్యం చేసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కాగా, సివిల్ వర్క్‌ల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పనులు ప్రారంభం కాకపోతే వెంటనే ఆపేయాలని, 25శాతం అయితే రద్దు చేయాలని, 50శాతం పనులు అయితే సమీక్ష చేయాలని సూచించింది. ఏపీటీడీసీ అధికారులు పనులపై ఇప్పటి వరకూ సమీక్ష చేయలేదు. బరమ్ పార్క్ ఆస్తిని బ్యాంక్‌కు తాకట్టు పెట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు పనులు నిలిపివేసి ఉంటే రూ.50 కోట్ల వద్ద రుణాలు నిలిచిపోయేవి.

> **రీ పేమెంట్ కష్టమే**
>
> ఏపీటీడీసీ ఆస్తులు తాకట్టు పెట్టి తెస్తున్న ఈ రూ.160 కోట్ల అప్పులను తిరిగి చెల్లించడం దాదాపు కష్టమే. ఏపీటీడీసీ తీవ్రనష్టాల్లో ఉంది. కర్నూలు, నెల్లూరు, కడప డివిజన్లతో పాటు విజయవాడ డివిజన్‌కు ఏటా నష్టాలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రీమోడలింగ్ పేరుతో యూనిట్‌కు రూ.10కోట్ల రుణం తీసుకుంటే, తిరిగి చెల్లించేంత ఆదాయం వస్తుందా అన్నది ప్రశ్న. మరోవైపు ఎస్‌బీఐతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఈఎంఐ కట్ చేసుకున్న తర్వాతే మిగిలిన రుణం మొత్తం ఏపీటీడీసీకి వస్తుంది. ఈఎంఐలు ప్రారంభమైతే తమకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని, రుణాలపై పునఃసమీక్ష చేయాలని ఏపీటీడీసీ ఉద్యోగులు కోరుతున్నారు.



ఉపముఖ్యమంత్రి పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచుల సంఘాల ప్రతినిధులు

గ్రామీణ వ్యవస్థలు బలోపేతం

పంచాయతీ నిధుల మళ్లింపు ప్రసక్తేలేదు

- సిటిజన్ చార్ట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం
- త్వరలో ఆర్థిక సంఘం నిధులు 750 కోట్లు విడుదల: పవన్‌కల్యాణ్
- పంచాయతీరాజ్ చాంబర్ ప్రతినిధులతో ఉపముఖ్యమంత్రి భేటీ

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని ఇష్టానుసారం నిర్వీర్యం చేసిందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమర్శించారు. పంచాయతీల్లో స్వపరిపాలన, సుపరిపాలనకు చోటులేకుండా చేసిందని మండిపడ్డారు. పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రతినిధులు గురువారం పవన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులు కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చాయని, దీనిని సరిచేయడానికి సీఎం చంద్రబాబు అనుభవం అవసరమన్నారు. గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి పెద్దపీట వేశామని చెప్పారు. ఇది మొండి ప్రభుత్వం కాదని, వినే ప్రభుత్వమని తెలిపారు. దేశంలో 70శాతం ప్రజానీకం పల్లెల్లోనే ఉంటారని, పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్ముడి ఆకాంక్షల మేరకు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. సర్పంచుల నుంచి వచ్చిన డిమాండ్లలో మొదట కీలకమైన వాటిని పరిష్కరించుకుంటూ వెళ్తున్నామని, ఒకటికి పదిసార్లు చెప్పించుకునే పరిస్థితి లేకుండా చూస్తున్నామని తెలిపారు. బలమైన కేరళ పంచాయతీరాజ్ వ్యవస్థలో పనిచేసిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ అనుభవాన్ని వాడుకునేందుకే డిప్యూటేషన్‌పై తీసుకొచ్చామని చెప్పారు.


పల్లెవనం ద్వారా ఆదాయం పెంపు..

గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచేందుకు పల్లెవనం కార్యక్రమానికి రూపకల్పన చేశామని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం ద్వారా గ్రామాల ఆదాయం పెంచడంతోపాటు భూఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గుతాయని పవన్ కల్యాణ్ చెప్పారు. వెదురు పెంపకంతోపాటు బయోడీజిల్ తీసే మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మనదేశం ఏటా 20 వేల కోట్ల మెట్రిక్ టన్నుల పైచిలుకు కలపను దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. దేశ అవసరాలకు సరిపడా కలపను మనమే పెంచుకోగలిగే విధానాన్ని రూపొందిస్తున్నామన్నారు. పంచాయతీ ఖాతాలు ఫ్రీజ్ చేసే పద్ధతిని తీసేశామని, గత ప్రభుత్వం 12,900 పంచాయతీలకు సంబంధించిన రూ.8,629 కోట్ల నిధులను వివిధ మార్గాల్లో మళ్లించిందని, వాటిని తిరిగి పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని సర్పంచులు కోరారని చెప్పారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.750 కోట్లు త్వరలోనే పంచాయతీల ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. ఏ పంచాయతీ నిధులు అక్కడే వినియోగమయ్యేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు. గత పాలకులు తీసుకున్న నిర్ణయాలకు జవాబుదారీతనం లేదని, పాలసీలు అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వాడేసుకున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. సర్పంచులు, స్థానికసంస్థల ప్రతినిధుల గౌరవ వేతనం పెంచే అంశం పరిశీలనలో ఉందని తెలిపారు. స్వయం పాలిత పంచాయతీల ఏర్పాటు దిశగా అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. గ్రామసభలు ఇంకా ప్రభావవంతంగా నిర్వహించాలని, తూతూ మంత్రంగా కాకుండా గ్రామ ప్రజలందరూ భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వలంటీర్లను గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రతి ఇంటికీ 24 గంటలు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నది ప్రధాని మోదీ సంకల్పమని, ఢిల్లీలో పెద్దలతో మాట్లాడుతున్న సమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వాడాలనే అంశం చర్చకు వచ్చిందని చెప్పారు. తాగునీటి పైపులైన్ల డిజైన్‌లో తప్పులున్నాయని, రాజంపేట పర్యటనలో తన దృష్టికి వచ్చిన తాగునీటి సమస్యను 8 రోజుల్లో పరిష్కరించామని తెలిపారు. మనసుతో పనిచేస్తే సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు చెక్ పెడతామని, గత ప్రభుత్వ హయాంలో భారీగా అవకతవకలు జరిగాయని తెలిపారు. పనులకు రాకుండానే మస్టర్లు వేస్తున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ బలోపేతానికి ఉన్నతస్థాయి పోలీసు అధికారిని చీఫ్ విజిలెన్స్ అధికారిగా నియమించామని తెలిపారు. జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండేలా ఫీల్డ్ విజిట్‌లు ఉండాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చామన్నారు. పంచాయతీల్లో సిటిజన్ చార్ట్ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నామని, పల్లెపండుగ పనులు జనవరి నాటికి పూర్తి కావాలని ఆదేశాలిచ్చామని తెలిపారు. పంచాయతీల్లో సమస్యలపై చర్చించేందుకు నెలకోసారి సమావేశం ఏర్పాటు చేసుకుందామని సూచించారు.

2026 మార్చికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తాం

నిర్మాణ సంస్థ బావర్ స్పష్టీకరణ

- పోలవరంపై రెండో రోజూ కొనసాగిన సమీక్ష
- నేడు ఈసీఆర్ఎఫ్ డిజైన్లపై చర్చ



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విదేశీ నిపుణుల బృందం, అధికారులు

అమరావతి, పోలవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను వచ్చే జనవరిలో ప్రారంభించి 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ బావర్ తెలిపింది. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో రెండోరోజు గురువారం డయాఫ్రమ్ వాల్ డిజైన్‌లపై సుదీర్ఘంగా సమీక్ష జరిగింది. 'ఆఫ్రీ' సంస్థ ఇచ్చిన డిజైన్లపై అంతర్జాతీయ నిపుణులు.. కేంద్ర జలసంఘం, బావర్, మేఘా, పీపీఏ, రాష్ట్ర జల వనరుల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు తదితరులంతా రోజంతా సమాలోచనలు చేశారు. గతంలో నిర్మించిన డయాఫ్రమ్ వాల్ కంటే.. ప్రస్తుతం సమాంతరంగా నిర్మించే డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో ప్లాస్టిక్ శాతం అధికంగా ఉండటం వల్ల బలం కాస్త తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. బలాన్ని పెంచేందుకు మరింతగా ఆలోచనలు చేయాలని నిర్ణయించారు. డయాఫ్రమ్ వాల్‌కూ.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌కు మధ్య 6మీటర్ల దూరం ఉండటం వల్ల.. ఆ ప్రాంతంలో ముందస్తుగా బంకమట్టి వేసి పూడ్చాక రాళ్లను వేయడం వల్ల సీపేజీని నివారించవచ్చని భావిస్తున్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నడుమ సీపేజీ జలాల తీవ్రత 80 క్యూసెక్కులు మాత్రమేనని, దీనివల్ల డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి ఎలాంటి అవరోధాలు ఉండవని అంతర్జాతీయ నిపుణుల బృందం అభిప్రాయపడింది. ఇక మూడోరోజు శుక్రవారం డయాఫ్రమ్ వాల్‌కు సంబంధించి మిగిలిన అంశాలతో పాటు.. ఈసీఆర్ఎఫ్ డిజైన్లపై చర్చించనున్నారు. కాగా, డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని బావర్ సకాలంలో పూర్తి చేస్తుందా అనే సందేహాలను సీడబ్ల్యూసీ వ్యక్తం చేసిందని తెలిసింది. నవంబరులోనే పనులు ప్రారంభిండానికి అంగీకరించిన బావర్.. ఇప్పుడు 2025 జనవరి నుంచి ప్రారంభిస్తామని చెబుతుండటంతో.. సందేహాలు నెలకొన్నాయని సమాచారం. దీనిపై స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు. మరోపక్క, డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై స్వల్పకాలిక టెండర్లకు వెళ్లాలని భావించారు. దీనివల్ల కాలాతీతం అవుతుందని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. కొత్త డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని జూన్‌లోనే నిర్ణయం తీసుకున్నప్పుడే స్వల్పకాలిక టెండర్లను పిలిస్తే.. ఈపాటికి ఎల్-1గా నిలిచే కాంట్రాక్టు సంస్థ ఏదో తేలిపోయేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మహిళలు

● సీఎం చిత్రపటానికి మహిళల పాలాభిషేకం

దీపం-2 పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజమహేంద్రవరంలో మహిళలు జేజేలు పలికారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లాలో 4,02,331 బుకింగ్‌లు రాగా ఇప్పటికే 3,59,462 మందికి గ్యాస్ సిలిండర్లు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం

చదువుకున్న మూర్ఖుడు సాయిరెడ్డి: బుద్దా

విజయవాడ వన్‌టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చదువుకున్న మూర్ఖుడని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. విజయవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయసాయిరెడ్డి అవినీతి కేసుల్లో మరోసారి జైలుకు వెళ్లటం ఖాయమని చెప్పారు. విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎక్స్ వేదికగా ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడితే దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. శాంతి భర్త వ్యాఖ్యలపై విజయసాయిరెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలను వక్రీకరించి ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారన్నారు. జగన్, షర్మిల వివాదాలకు, టీడీపీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

ఇసుక, మద్యానికి దూరంగా ఉండండి: పెమ్మసాని

గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో గాడి తప్పిన వ్యవస్థలను బాగు చేయడానికి సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. దీనికి అందరూ సహకరించాలి. ఇసుక, మద్యం దుకాణాల్లో చేతులు పెట్టొద్దని సీఎం అన్నారంటే ఎమ్మెల్యేలు ఆలోచించుకుని, తమ రాజకీయ భవిష్యత్తును చూసుకోవాలి' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హితవు పలికారు. గుంటూరు కలెక్టరేట్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో మళ్లీ గెలవాలంటే ఎమ్మెల్యేలు ఇసుక, మద్యం వంటి వ్యాపారాలకు దూరంగా ఉండాలన్నారు. 'ఎన్నికలు ఖరీదుగా మారిపోయాయి. గ్రామాల నుంచి నాయకులు వచ్చి ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను డబ్బు కోసం పీక్కు తింటున్నారు. ఈ వ్యవస్థను చూస్తే ఒక్కోసారి అసహ్యమేస్తోంది. నీతిగా ఉండాలనుకొనేవారికి రాజకీయాలు ఎప్పుడో దూరమైపోయాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో.. తమ గ్రామానికి డబ్బులు పంచలేదని ఓటర్లే వచ్చి బహిరంగంగా తనను అడిగారని గుర్తు చేసుకొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యవస్థలను సరి చేయాలని చూస్తున్నారని చెప్పారు. జగన్ హయాంలో కేంద్ర ప్రభుత్వం 40 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే మొత్తం 150 చోట్ల తవ్వి పోగేసుకొన్నారని చెప్పారు. 'వ్యవస్థలో లోపాలు ఉంటాయి. వాటిని సరి చేసుకొంటూ ముందుకు వెళ్లినప్పుడే ప్రజలకు మంచి జరుగుతుంది. జగన్ అనే వ్యక్తి సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తాడు. మేం సమస్యలను పరిష్కరించాలని ఆలోచన చేస్తాం. ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే ఈ రాష్ట్రానికి అంత మంచిది' అని కేంద్ర మంత్రి అన్నారు.

గ్రంధి ఇళ్లు, కంపెనీల్లో కొనసాగిన సోదాలు

భీమవరం క్రైం, కోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇళ్లు, పరిశ్రమలపై రెండో రోజైన గురువారం కూడా ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు జరిపారు. కేంద్రం నుంచి వచ్చిన పది మంది సభ్యుల బృందం గురువారం ఉదయం ఐదు గంటల నుంచి సోదాలు చేపట్టి, రికార్డులు పరిశీలించింది. ఈ సోదాల్లో పెద్దమొత్తంలో డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. తనిఖీల విషయమై అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఒకే ఖాతా నుంచి భారీ మొత్తంలో లావాదేవీలు జరిగినట్టు గుర్తించడం వల్లే సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. కాగా, తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడులోని జీవీఆర్ (సాగర్‌గ్రంధి ఎక్స్‌పోర్ట్) రొయ్యల పరిశ్రమలో గురువారం ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు చేశారు. సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని తనిఖీలు చేస్తున్నారు. ఈ పరిశ్రమ భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు చెందినది. శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన 11 పరిశ్రమల్లో అధికారులు సోదాలు చేస్తున్నట్లు తెలిసింది.

అందుకే ఓడిపోయాం: విజయసాయిరెడ్డి

ఎండాడ (విశాఖపట్నం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్న ఐదేళ్లలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమే. వారిని దూరం పెట్టడం వల్లనే ఓటమి చవిచూశాం' అని వైసీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త విజయసాయిరెడ్డి అన్నారు. ఇకనుంచి కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తామని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించే దిశగా పనిచేస్తామన్నారు. గురువారం విశాఖ పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ... 'అమరావతిని అభివృద్ధి చేయడం కోసం ఉత్తరాంధ్రకు చంద్రబాబు అన్యాయం చేయాలని చూస్తున్నారు. ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాన్ని అమరావతికి తరలించే కుట్ర చేస్తున్నారు' అని ఆరోపించారు.

'ఫర్నిచర్' తీసుకెళ్లమంటే స్పందించడం లేదు

» లేళ్ల అప్పిరెడ్డి వ్యాజ్యంపై నేడు హైకోర్టులో విచారణ

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను వెనక్కి తీసుకెళ్లండి. అందులో కొంత ఫర్నిచర్‌కు విలువ ఖరారు చేస్తే చెల్లిస్తాం' అంటూ మేం చేసిన అభ్యర్థనపై సాధారణ పరిపాలన శాఖ అధికారులు స్పందించడం లేదని పేర్కొంటూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది అక్టోబరు 3న తాము సమర్పించిన వినతిపై నిర్ణయం తీసుకొనేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ వద్ద విచారణకు రానుంది.

ఐసీఐసీఐ 'గోల్‌మాల్' కేసులో ఒకరి అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐసీఐసీఐ బ్యాంకు బ్రాంచీలలో నగదు, బంగారం గోల్‌మాల్ జరిగిన కేసులో కదలిక వచ్చింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బ్రాంచీలలో జరిగిన అవకతవకలపై సీఐడీ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో చిలకలూరిపేట బ్రాంచిలో గోల్డ్‌లోన్ కౌన్సిలర్‌గా ఉన్న అన్నం హరీష్(37)ను సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గుంటూరులో అరెస్టు చేశారు. అతడిని కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఈ కేసులో కీలకంగా ఉన్న డి.నరేష్‌చంద్రశేఖర్ పరారీలోనే ఉన్నారు.

కృష్ణా జలాల్లో మా వాటా కావాల్సిందే: ఏపీ

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తయినా.. కృష్ణా జలాల్లో తమ వాటాను వదులుకోబోమని కృష్ణా జలాల వివాద ట్రైబ్యునల్ ముందు ఆంధ్రప్రదేశ్ వాదించింది. ఢిల్లీలో గురువారం ట్రైబ్యునల్ ముందు రెండు రాష్ట్రాలకు చెందిన సాక్షులు అభిప్రాయాలను తెలిపారు. పోలవరం పూర్తయితే నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా డెల్టాకు నీటి అవసరాలు ఉండవని తెలంగాణ తరుపు సాక్షి వాదించారు. ఈ వాదనను ఏపీ వ్యతిరేకించింది. పోలవరం పూర్తయినా 80 టీఎంసీల్లో 35 టీఎంసీలు మహారాష్ట్ర, కర్ణాటకకు వెళితే, మిగిలిన 45 టీఎంసీలను నాగార్జునసాగర్ నుంచి ఎగువకు వాడుకుంటామని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ, ఏపీ న్యాయవాదుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగినా.. ట్రైబ్యునల్ ఏపీ వాదనను సమర్థించిందని అధికారులు తెలిపారు.

శారదాపీఠం భూములు స్వాధీనం

వేద పాఠశాల కోసం నాడు 15 ఎకరాలు..

ఎకరం 15 కోట్లు.. కానీ రూ.లక్షకు ఇచ్చిన వైసీపీ.. ఆ అనుమతులు రద్దుచేసిన సర్కార్

విశాఖపట్నం/భీమునిపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం కొత్తవలసలోని సర్వే నంబర్లు 102, 102/2, 103లలో శారదా పీఠం ఉత్తరాధికారికి కేటాయించిన 15 ఎకరాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో ఎవరైనా ప్రవేశించినా, ఆక్రమించేందుకు యత్నించినా సెక్షన్ 4(1), 4(2), 4(3) ఆఫ్ ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్టు-1982 ప్రకారం, సెక్షన్ 183, 186, 188 భారతీయ శిక్షాస్మృతి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తాజాగా అక్కడ బోర్డు ఏర్పాటుచేశారు. విశాఖపట్నం నుంచి భీమిలి బీచ్ రోడ్డులో వేద పాఠశాల ఏర్పాటుకు భూమి ఇవ్వాలని శారదాపీఠం గత వైసీపీ ప్రభుత్వాన్ని కోరింది. పీఠం కోరిన వెంటనే అప్పటి ప్రభుత్వం స్పందించి కొత్తవలసలో భూమి కేటాయింపునకు ఆదేశించింది. అక్కడ ఎకరం రిజిస్ట్రేషన్ విలువ రూ.1.89 కోట్లు ఉందని, ఆ ప్రకారం కేటాయించవచ్చునని గత కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం ఎకరం కేవలం రూ.లక్షకు కట్టబెట్టింది. అది కూడా పీఠానికి కాకుండా ఉత్తరాధికారి పేరిట కేటాయించింది. అక్కడ ఎకరం బహిరంగ మార్కెట్‌లో రూ.15 కోట్లు వరకూ ఉంటుంది. ఆ లెక్కన 15 ఎకరాల విలువ రూ.225 కోట్లు. అంత విలువైన భూమి తీసుకున్న శారదాపీఠం అక్కడ వేదపాఠశాల కాకుండా ఆదాయ ఆర్జనను అనువుగా భూ వినియోగ మార్పిడి చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. మరోవైపు పీఠానికి కేటాయించిన భూమికి ఉపయోగపడేలా వీఎంఆర్‌డీఏ రూ.రెండు కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మించింది. ఈలోగా ప్రభుత్వం మారడంతో శారదా పీఠం ఉత్తరాధికారికి అడ్డగోలుగా కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. భూమిని వెనక్కి తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలను జిల్లా యంత్రాంగం అమలుచేసి అక్కడ బోర్డు ఏర్పాటుచేసింది.



భూమిని స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

శ్రీవారి దర్శన టికెట్ల పేరుతో టూరిజంలో రూ.400కోట్ల స్కాం

» స్కాంలో మాజీ మంత్రి రోజా పాత్ర

» జనసేన నేత కిరణ్ రాయల్

తిరుపతి (జీవకోన), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం టికెట్ల పేరుతో, వైసీపీ హయాంలో టూరిజం శాఖలో రూ.400 కోట్ల స్కాం జరిగిందని జనసేన తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్ రాయల్ ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో టూరిజం శాఖలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని, తద్వారా వందల కోట్ల రూపాయలు కొట్టేశారని ఆరోపించారు. శ్రీవారి దర్శన టికెట్ల పేరుతో (టూర్ ప్యాకేజీ) గతంలో 24 బస్సులకు పర్మిషన్ ఇస్తే, అందులో తిప్పింది ఆరేడు బస్సులు మాత్రమేనని చెప్పారు. అన్ని బస్సులనూ తిప్పినట్లు, హోటల్లో రూములు బుక్ చేసినట్లు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని ఆయన ఆరోపించారు. సాధారణంగా చెన్నై, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, ఇలా ప్రధాన ప్రాంతాల నుంచి మాత్రమే టూర్ ప్యాకేజీలు ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో రాయచోటి, కడప ప్రాంతాల నుంచీ టూర్ ప్యాకేజీలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ ట్రావెల్స్ బస్సులన్నీ వైసీపీకి చెందిన మాజీ మంత్రులు రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అనుచరులవేనని ఆరోపించారు. టూరిజం శాఖలో స్కాంలకు సంబంధించి పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వీటిని టూరిజం శాఖ మంత్రికి, ఎండీకి, సీఐడీకి అందజేస్తామని చెప్పారు. ఈ స్కాం వెనుక మాజీ మంత్రి రోజా, ధనుంజయ రెడ్డి బంధువైన విశాఖపట్నంలో టూరిజం భవనం నిర్మించిన మల్లారెడ్డి, తిరుపతిలో పని చేసిన డీవీఎంలు ఉన్నారని ఆరోపించారు. ఈ అవినీతి అధికారి(డీవీఎం)తిరుపతి నుంచి ఎలా రిలీవ్ అయ్యాడో అర్థంకావడం లేదన్నారు. టూరిజం శాఖలో జరిగిన అవినీతిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సీఐడీ ఎంక్వయిరీ వేయిస్తామని స్పష్టం చేశారు. దీనిపై టీటీడీ ఉన్నతాధికారులు కూడా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అవినీతి వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులను అరెస్టు చేయాలని, ఆ డబ్బు రికవరీ చేసి శ్రీవారి హుండీలో వేయాలని కోరుతున్నామన్నారు.

ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్



తాళ్లాయపాలెంలో విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, దుర్గేశ్, సంధ్యారాణి, ఎమ్మెల్యే శ్రవణ్, కేంద్ర మంత్రి చంద్రశేఖర్ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన 400/220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో యంత్రాలను, విద్యుత్ పరికరాలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏపీ ట్రాన్స్‌కో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులపై ప్రదర్శించిన ఏవీని వీక్షించారు. అనంతరం కృష్ణాజిల్లా పెడన, శ్రీకాకుళం జిల్లా కొల్లాం, నంద్యాల జిల్లా బేతంచర్ల, తిరుపతి జిల్లా సూళ్లూరుపేట, చిత్తూరు జిల్లా వి.కోట, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, కడప జిల్లా మైదుకూరులలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. సత్యసాయి, గన్నవరం, జమ్మలమడుగు, మాంబట్టు సహా 14 ప్రాంతాల్లో నిర్మించనున్న సబ్‌స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, కృష్ణా, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తాళ్లాయపాలెంలో రూ.509 కోట్లతో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌తో సీఆర్డీఏ భవిష్యత్ అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలు కూడా తీరతాయని తెలిపారు. ప్రపంచమే తలతిప్పి చూసేలా అమరావతిని నంబర్ వన్ నగరంగా చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అమరావతిని కాపాడి, నిలబెట్టిన ఘనత రాజధాని రైతు ఆడబిడ్డలదేనని, ఆ ఉద్యమం ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. విద్యుత్ తీగలు, కరెంటు స్తంభాలు లేకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లతో రెండేళ్లలో ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ఖరాఖండీగా చెప్పినట్లు పేర్కొన్నారు. 2014లో ప్రభుత్వం ఏర్పాటు చేసిననాడే దీనికి శ్రీకారం చుట్టానని, అప్పుడే ఈ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశానని, ఐదేళ్ల వైసీపీ విధ్వంసక పాలనలో అది మరుగున పడిపోయిందని ఆరోపించారు. తిరిగి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో దానిని పూర్తిచేసి ప్రారంభించానని చెప్పారు. నిర్దిష్ట కాల పరిమితి పెట్టుకుని అమరావతిని విశ్వనగరంగా అభివృద్ధి చేస్తానని సీఎం భరోసా ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ నిర్వాకంపై విరుచుకుపడ్డారు. పోయినసారి మీరందరూ ఓటేస్తే ఆ దుర్మార్గుడు కాటేసేందుకు వచ్చారని జగన్‌పై చంద్రబాబు ధ్వజమెత్తారు. 'దుర్మార్గమైన ఆలోచనలు చేసి రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదని పీపీఏలు రద్దు చేశారు. 2014-19 మధ్యకాలంలో ప్రభుత్వం సోలార్, విండ్ పవర్‌కు టెండర్లు పిలిచి అగ్రిమెంట్లు చేస్తే, వాటిని రద్దుచేసి వేధించారు. దీనిని దేశమంతా 'ఛీ' కొట్టింది. కేంద్ర మంత్రి హెచ్చరించినా, దావోస్‌లో పారిశ్రామికవేత్తలు నిరసనలు తెలిపినా పట్టించుకోకుండా కక్షతో జగన్ పీపీఏలు రద్దు చేశారు. వారంతా కోర్టుకెళితే రూ.12వేల కోట్లకు పైగా చెల్లించాల్సి వచ్చింది. విద్యుత్ చార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32,160 కోట్ల భారం వేశారు. ఒక్క యూనిట్ సోలార్ విద్యుత్ కూడా వాడుకోకుండా రూ.9,900కోట్లు, పవన విద్యుత్‌కు రూ.500 కోట్లు, విశాఖపట్నంలో హిందూజాకు రూ.1,235 కోట్లు చెల్లించారు. వాటిద్వారా వచ్చే 2,872 మిలియన్ యూనిట్లలో ఒక్క యూనిట్ కూడా వాడుకోలేదు. చెల్లించిన మొత్తం ప్రజలపై భారంగా వేశారు. కృష్ణపట్నం స్టేజ్-2, వీటీపీఎస్ స్టేజ్-5 పనులు పూర్తిచేయకపోవడం, పోలవరం హైడల్ పవర్ పూర్తికాకపోవడం వల్ల ఆ భారం కూడా పెరిగింది' అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీల భారం కూడా జగన్ ప్రతిపాదనల నిర్వాకమేనని వివరించారు.

దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో సంస్కరణలు తీసుకొచ్చానని సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పట్లో దాన్ని అందరూ వ్యతిరేకించారని, కానీ విద్యుత్ ఉంటేనే అభివృద్ధి, పేదరికం పోతుందని చెప్పి 1998లో సంస్కరణలతో పాటు రెగ్యులేటరీ కమిషన్ తెచ్చామని, తద్వారా విద్యుత్ దుర్వినియోగం, దొంగతనాలను నివారించగలిగామని తెలిపారు. 2004 నాటికి మిగులు విద్యుత్ సాధించామని, లో-ఓల్టేజీ సమస్య లేకుండా చేశామని చెప్పారు.

బకాయిలన్నీ చెల్లిస్తాం.. పనులు ప్రారంభించండి

» ఎన్‌డీబీ కాంట్రాక్టర్లతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి భేటీ

» పనుల ప్రారంభానికి సిద్ధమన్న కాంట్రాక్టర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రోడ్డు పనుల కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం భరోసానిచ్చింది. జగన్ ప్రభుత్వ హయాంలో పెండింగ్ పెట్టిన బిల్లులను దశలవారీగా విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. పనుల నిర్వహణలో తలెత్తే సాంకేతిక, ఇతర సమస్యలను కూడా సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేసింది. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో చేపట్టే రహదారి ప్రాజెక్టుల పనులు ఇక ప్రారంభించాలని కాంట్రాక్టర్లను కోరింది. గురువారం ఇక్కడి ఆర్‌అండ్‌బీ భవన్‌లో ఎన్‌డీబీ కాంట్రాక్టర్లతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ నయీముల్లా, ఉమ్మడి జిల్లాల వారీగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే 2018లోనే సింగపూర్‌కు చెందిన ఎన్‌డీబీ నుంచి రాష్ట్రానికి రూ. 6,400 కోట్ల రహదారి ప్రాజెక్టుల రుణం మంజూరైంది. రెండు ప్రాజెక్టుల కింద పనులను విభజించారు. రాష్ట్ర, జిల్లా రహదారుల నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి ఒక ప్రాజెక్టుగా.. వంతెనల నిర్మాణం రెండో ప్రాజెక్టుగా నిర్ణయించారు. అయితే, 2019లో ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించే సమయంలో ఎన్నికలు జరిగి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్‌డీబీతో ఒప్పందాలు చేసుకుని అస్మదీయులకే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టులు కట్టబెట్టింది. కానీ, పనులు చేయడానికి నిధులు ఇవ్వలేదు. దీంతో జగన్‌ను నమ్మి పనులు చేపట్టినవారు బిల్లులు రాక ఆర్థికంగా కుదేలై పనులను పూర్తిగా నిలిపివేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులపై సమీక్ష జరిపింది. తొలిసారిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కాంట్రాక్టర్లతో సమావేశమై, వారి సమస్యలు తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో చేసిన తొలిదశ పనులకుగాను రూ. 225 కోట్లు విడుదల చేసినట్లుగా కాంట్రాక్టర్ల హర్షాతిరేకాల మధ్య మంత్రి బీసీ ప్రకటించారు. త్వరలో మరో విడత నిధులు కూడా ఇస్తామన్నారు. ఘోరంగా ఉన్న రోడ్లను బాగు చేసేందుకు వెంటనే పనులను ప్రారంభించి ప్రజలకు ఊరట కలిగించాలని మంత్రి కోరగా, కాంట్రాక్టర్లు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ కోరిక మేరకు పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్లు చెప్పారు. అయితే, తమకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు.



అధికారులు, కాంట్రాక్టర్ల సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణపై కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

రుగ్మతలను రూపుమాపామని తెలిపారు. 2014 తర్వాత జీవో 25 ద్వారా దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేశామని అన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో వర్గీకరణపై స్పష్టత వచ్చిందని, దీనికి అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జగన్ పాలనలో దళిత జాతి తీవ్ర అణచివేతకు, వివక్షకు గురైందని... గత ప్రభుత్వ దళిత వ్యతిరేక విధానాలతో తమ వర్గ ప్రజల జీవన ప్రమాణాలు తీవ్రంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు, పథకాలు అందేలా చూడాలని కోరారు. కాగా, సీఎంతో సమావేశానికి ముందు దళిత ఎమ్మెల్యేలు భేటీ అయి దళితుల సమస్యలపై చర్చించారు. మాల, మాదిగ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలందరూ వాటిని కలసికట్టుగా సీఎంకు వివరించారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు చేపడతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని, దీన్ని జిల్లాస్థాయిలో వర్తింపజేయాలని కోరారు.

- ఎస్సీ వర్గీకరణను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా కాకుండా ఏ, బీ, సీగా (మాదిగ, ఇతర/ మాల, ఇతర/ రెల్లి, ఇతర)గా వర్గీకరించాలి.
- ఎస్సీ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వేషన్లు 16 శాతం నుంచి 18 శాతానికి పెంచాలి.
- వర్గీకరణ అమలుకు ఒక కమిటీని గానీ కమిషన్‌ను గానీ నియమించాలి. అధ్యయనం అనంతరం నిర్దిష్ట కాలపరిమితి లోపు నివేదిక ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలి. ఈలోగా గత ప్రభుత్వ నిర్వాకంతో దారుణంగా తయారైన ఎస్సీ హాస్టళ్ల, గురుకులలో సమస్యలపై దృష్టి పెట్టాలి అని ఎమ్మెల్యేలు సీఎంకు విన్నవించారు.

సీఎం హామీలు ఇవీ...

- ఈ నెల 11న అసెంబ్లీ సమావేశాల ప్రారంభం తర్వాత వర్గీకరణ అమలు కోసం కమిషన్ ఏర్పాటు చేసే విషయంపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటాం.
- కొత్త సెన్సస్ ప్రకారం వర్గీకరణ అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిందే చేస్తాం.
- పీ4 విధానం ద్వారా ఎస్సీలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చే పథకాలు అమలు చేయడంతో పాటు ఎస్సీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడతాం.
- గురుకులాలు, హాస్టళ్లలో ఖాళీ పోస్టులు భర్తీ చేయడంతో పాటు ప్రాథమిక వసతులు కల్పిస్తాం. వాటిలో ప్రాంతాల వారీగా డైట్ ఏర్పాటు చేసి, ఆ మేరకు నిధులు అందిస్తాం.

మూడు కేటగిరీలు చాలు: దళిత ఎమ్మెల్యేలు

ఎస్సీ వర్గీకరణలో డీ-కేటగిరీ వద్దని సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు దళిత ఎమ్మెల్యేలు చెప్పారు. మాల, మాదిగ ఉప కులాలను బీ, సీ-కేటగిరీల్లో చేర్చాలని కోరినట్లు తెలిపారు. ఏ-కేటగిరీలో రెల్లి, బీ-కేటగిరీలో మాదిగ, అనుబంధ కులాలు, సీ-కేటగిరీలో మాల, అనుబంధ కులాలు ఉంటాయని, ఈ మూడూ చాలని చెప్పామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వివరించారు. వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ తరఫున 20 ఏళ్లుగా పోరాటం చేశానని, తన కల ఇప్పటికి సాకారమైందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. దళితులందరికీ ఈ రోజు శుభదినమని, జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేపడతామని సీఎం చంద్రబాబు చెప్పారని వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. దళితుల అభివృద్ధిపై చంద్రబాబు హామీ ఇచ్చారని మద్దిపాటి వెంకటరాజు తెలిపారు.



అందరికీ కేన్సర్ పరీక్షల పోస్టరును ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు తదితరులు

వైద్య శాఖపై చర్చకు సిద్ధమా?

» జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్

» అసెంబ్లీకి వచ్చి నిర్మాణాత్మక విపక్షపాత్ర పోషించాలని హితవు

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జగన్ ప్యాలెస్‌లో కూర్చుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. జగన్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలంటే అసెంబ్లీకి రావాలన్నారు. వైసీపీకి 11 సీట్లు వస్తే ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లతోనే నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర పోషించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై జగన్ చర్చకు రావాలని మంత్రి సవాల్ విసిరారు. జగన్ వచ్చినా, గతంలో మంత్రులుగా పనిచేసినవారు వచ్చినా తాము చర్చకు సిద్ధమని చెప్పారు. 2023 జూలై నుంచి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఒక్కపైసా చెల్లించలేదన్నారు. మెడికల్, సర్జికల్ సప్లైయర్స్‌కూ బకాయిలు పెట్టారన్నారు. రూ.2,500 కోట్లు బకాయిలు పెట్టిపోయారని, కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతవరకు నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించామన్నారు. రాష్ట్రంలో 108 అంబులెన్సుల నిర్వహణ సరిగా చేయని అరబిందో సంస్థను కొనసాగించాలా? అని మంత్రి ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలోనే అరబిందోకి పెనాల్టీలు విధించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. జూలై నెలలో 85అంబులెన్సులను ఆడిట్‌చేస్తే 70-80 శాతం లోటుపాట్లు కల్పించాయని, అలాంటి వాటిని కొనసాగించాలా? అని ప్రశ్నించారు. హోంమంత్రి పదవి తీసుకుంటానని పవన్ కల్యాణ్ అనలేదని.. తాను తీసుకుంటే పరిస్థితులు వేరేవిధంగా ఉంటాయని.. ఆవేదనతో మాట్లాడారని సత్యకుమార్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి అయినా తండ్రే కదా! కూతుళ్ల గురించి మాట్లాడితే ఎవరికైనా రక్తం మరగదా? అని ప్రశ్నించారు. రైతుల ఉద్యమానికి వెళితే నాపైనా దాడి చేశారు. బూతులు తిట్టారు. వైసీపీలో మానసిక రోగులు ఎక్కువ ఉన్నారు. వారితో మాట్లాడించి, వీడియోలు తీయించి, జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారు' అని మంత్రి విమర్శించారు.

పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించిన ఆరోగ్య మంత్రి సత్యకుమార్

ఏపీని కేన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిర్వహించతలపెట్టిన కేన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను సీఎం చంద్రబాబు త్వరలో ప్రారంభిస్తారని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు ఈ డ్రైవ్ జరుగుతుందని చెప్పారు. ఇంటి వద్దే ఉచితంగా కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన 3.94 కోట్ల మందికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో 18 వేల మంది ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో కేన్సర్ నివారణ కోసం ఏడాదికి రూ.700 కోట్లు వెచ్చించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా కేన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు.

దేవదాయ శాఖలో 500 ఖాళీలు భర్తీ చేస్తాం

» ఆలయాల ఆస్తుల కబ్జాపై నివేదిక రూపొందించండి: ఆనం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో ఖాళీగా ఉన్న అధికారులు, అర్చకులకు సంబంధించిన 500 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేవాలయాలన్నీ పరిశుభ్రత, ఆధ్యాత్మికతతో పని చేయాలని సూచించారు. కార్తీకమాసంలో చతుర్వేద సభలు నిర్వహించాలన్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో అదనంగా ఇద్దరి సభ్యులను నియమించాలన్న నిర్ణయానికి సంబంధించిన ఆర్డినెన్స్ త్వరలో జారీ అవుతుందన్నారు. వేద పండితులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేశామని, ఈ పథకం ద్వారా 600 మందికి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సాయం అందిస్తామన్నారు. దేవాలయాల్లో ప్రసాదం తయారీలో వినియోగించే సామాగ్రి ఏ గ్రేడ్ రకానివే వినియోగించేలా చూసేందుకు కేంద్రీకృత వ్యవస్థను తీసుకువస్తామన్నారు.



నేనూ సోషల్ సైకోల బాధితురాలినే

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'కొంతమంది సైకోలు, సైకో పార్టీలతో కలసి ఉచ్చం నీచం లేకుండా సోషల్ మీడియాను భ్రష్టు పట్టించారు. మానవ, రక్త సంబంధాలు మరిచి మృగాల లెక్క మారారు. అలాంటి సోషల్ సైకోల బాధితుల్లో నేనూ ఒకరిని' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. సైకో వర్రా రవీంద్రారెడ్డి అరెస్టును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'సోషల్ మీడియాలో సైకోలు... ఇంట్లో తల్లి, అక్క, చెల్లి కూడా సాటి మహిళే అనే ఇంగితం లేకుండా, రాష్ట్రంలో ప్రశ్నించే మహిళలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టి, వికృత చేష్టలతో రాక్షసానందం పొందారు. ప్రతిష్ఠ దెబ్బతినేలా పోస్టులు పెట్టి, పైశాచికానందం పొందే సైకోలపై కఠినంగా చర్యలు ఉండాలి. నా మీద, మా అమ్మ మీద, సునీత మీద విచ్చలవిడిగా పోస్టులు పెట్టారు. నేను, వైఎస్ రాజశేఖర రెడ్డికి పుట్టలేదని అవమానించారు. నా ఇంటి పేరు మార్చి శునకానందం పొందారు. నాపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డిపై నేను కూడా కేసు పెట్టాను. అరాచక పోస్టులు పెట్టేవాళ్లు ఏ పార్టీలో ఉన్నా అంతు చూడాల్సిందే. మరోసారి సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడాలంటే భయపడేలా అనునిత్యం చర్యలు కొనసాగాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా' అని షర్మిల పేర్కొన్నారు.

- వైఎస్ఆర్‌కు పుట్టలేదని నన్ను అవమానించారు
- నాపైన, అమ్మ, సునీతలపై విచ్చలవిడిగా పోస్టులు
- వీరు భయపడేలా చర్యలుండాలి: వైఎస్ షర్మిల

బొక్కలో ఎవరిని వేయాలి జగన్!?



'ఆంధ్రజ్యోతి'పై జగన్ ఫేక్ స్టేట్‌మెంట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణను బొక్కలో ఎయ్యాలంట! ఎందుకంటే... ఆంధ్రజ్యోతి 'ఫేక్ న్యూస్' వేసిందట... ఇది మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉవాచ! బుధవారం రాత్రి నిద్రలో ఏం కలకన్నారో తెలియదు కానీ... గురువారం ఉదయాన్నే జగన్ ఈ 'ఫేక్' మాటలు చెప్పారు. ఎప్పట్లాగానే తన భజన బృందంలాంటి మీడియా ప్రతినిధులతో గురువారం ఆయన మాట్లాడారు. "ఆంధ్రజ్యోతిలో ఈరోజు పొద్దున రాసినట్టున్నారు.. కడప ఎస్పీకి నా భార్య ఫోన్ చేసిందని! అది ఫేక్ న్యూస్ కదా మరి! ఆంధ్రజ్యోతి రాధాకృష్ణను బొక్కలో వేస్తున్నారా మరి! ఎయ్యాలి కదా మల్లి!" అని పోలీసులను ప్రశ్నించారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త, భారతీ రెడ్డి పీఏ, అవినాశ్ రెడ్డి అనుచరుడైన వర్రా రవీంద్రారెడ్డి 'గ్రేట్ ఎస్కేప్'పై 'ఆంధ్రజ్యోతి' అనేక మార్గాల ద్వారా సమాచారం సేకరించి గురువారం సవివరమైన కథనం ప్రచురించింది. ఇందులో ఎక్కడా 'కడప ఎస్పీకి భారతీరెడ్డి ఫోన్ చేశారు' అనే మాట ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగాకానీ లేదు. పత్రికలో ప్రచురితమైన ప్రతి అక్షరం అందరికీ ఒకేలా కనిపించింది. రవీంద్రారెడ్డి భారతీరెడ్డి పీఏగా పనిచేశారని మాత్రమే 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించింది. అది ఫేక్ కాదు. కానీ... జగన్‌కు మాత్రం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించని, ఎవరికీ కనిపించని వాక్యాలు కనిపించాయి. ఆయన అంతటితో ఆగలేదు. 'ఆంధ్రజ్యోతి'పైనా, సంస్థ ఎండీ రాధాకృష్ణపైనా అక్కసు వెళ్లగక్కారు. అవినీతి సొమ్ముతో పత్రిక పెట్టి, దానికి చైర్మన్‌గా వ్యవహరించిన జగన్‌కు... పత్రికలో రాయని వాక్యాలు ఎలా కనిపించాయో, తన ఊహల్లో మెదిలిన వాక్యాలకు రాధాకృష్ణ ఎలా బాధ్యుడో ఆయనకే తెలియాలి! 'ఫేక్ న్యూస్ వేసినందుకు రాధాకృష్ణను బొక్కలో వేయాలి' అంటూ 'ఫేక్ స్టేట్‌మెంట్' ఇచ్చిన జగన్‌ను కదా బొక్కలో వేయాలి! ఈ ప్రెస్‌మీట్‌కు 'ఆంధ్రజ్యోతి'నీ పిలిచి ఉంటే... విషయం అక్కడికక్కడే తేలిపోయేది. కానీ.. ఎదురు ప్రశ్నించని, చెప్పింది వినే మీడియా ప్రతినిధులతోనే ఆయన మాట్లాడతారు. సీఎంగా ఉన్నపుడూ అంతే, ప్రతిపక్షంలోకి వచ్చాకా అంతే! గత టీడీపీ ప్రభుత్వంలో డీఎస్పీల పదోన్నతులకు కులం ఆపాదించడంతో మొదలుకుని 'నారాసుర రక్త చరిత్ర'ను దాటుకుని... తాజాగా విజయవాడ వరద సాయంపై తప్పుడు లెక్కల దాకా ఫేక్ న్యూస్ రాసింది, రాసేది జగన్ రోత పత్రికే! మరి... బొక్కలో వేయాల్సింది ఎవరిని... జగన్!



డ్రోన్ల సాయంతో స్థలాలు పరిశీలిస్తున్న డీజీపీ ద్వారకాతిరుమలరావు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

రాష్ట్రంలో రెండు పోలీసు శిక్షణ కేంద్రాలు

- ఏలూరు జిల్లాలో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- స్థలాలు పరిశీలించిన డీజీపీ

ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో రెండు పోలీసు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆగిరిపల్లి మండలం నుగొండపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 69లో 76 ఎకరాల్లో ఆక్టోపస్ శిక్షణ కేంద్రం, తోటపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 2-1లో 498.23 ఎకరాల్లో రాష్ట్ర స్థాయి పోలీస్ శిక్షణ కేంద్రాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు డ్రోన్ల సహాయంతో ఈ రెండు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ శిక్షణ కేంద్రాల నిర్మాణానికి ఇంకా భూసేకరణ కావాల్సి ఉందన్నారు. జిల్లాకు వచ్చిన డీజీపీకి ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు. డీజీపీతోపాటు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, లా అండ్ ఆర్డర్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్, ఆక్టోపస్ డీఐజీ ఎస్ సిందేల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా కుమార్తె కన్నీళ్లు చూసే..

అలా మాట్లాడానమ్మా

- నేనూ ఫేక్ న్యూస్ బాధితురాలినే సర్..
- డిప్యూటీ సీఎం పవన్, హోంమంత్రి అనిత మాటామంతి

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'నా కుమార్తె కన్నీళ్లు చూసే అలా మాట్లాడానమ్మా'....'నేను కూడా ఫేక్ న్యూస్ బాధితురాలినే సర్..' రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మధ్య ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం జరిగిన చర్చ ఇది. రాష్ట్రంలో చెలరేగిపోతున్న సోషల్ మీడియా సైకోలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంశాఖ మంత్రి అనిత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తోపాటు వారి కుటుంబ సభ్యులపైనా అనుచిత పోస్టులు సోషల్ మీడియాలో పెడుతున్నారు. వారి ఆగడాలు భరించలేని పవన్ కల్యాణ్...ఇటీవల పిఠాపురం పర్యటనలో పదునైన వ్యాఖ్యలు చేశారు. హోంమంత్రి కఠినంగా వ్యవహరించక పోతే తానే హోంశాఖ తీసుకుని ఉత్తరప్రదేశ్‌లో బుల్డోజర్ తరహా చర్యలకు ఉపక్రమిస్తానని అనడంతో జాతీయ స్థాయిలో పవన్ వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ ఇదే అంశం ప్రముఖంగా చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో నెల రోజుల్లో పోలీసు శాఖను బలోపేతం చేస్తానని, తప్పు చేసిన వారిని ఉపేక్షించే ప్రసక్తేలేదని చంద్రబాబు అన్నారు. అన్నట్టుగానే సోషల్ మీడియా సైకోల భరతం పట్టేందుకు ముఖ్యమంత్రి గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రితో విడివిడిగా సమావేశమయ్యారు. అంతకుముందు.. పవన్ కల్యాణ్, అనిత కొద్దిసేపు విడిగా చర్చించుకున్నారు.



పవన్ కల్యాణ్‌తో అనిత కరచాలనం

తొలుత.. పవన్‌కల్యాణ్‌ను చూడగానే అనిత నమస్కరించి పలకరించారు. పవన్ ఆప్యాయంగా స్పందిస్తూ.."నా కుమార్తె కన్నీళ్లు చూసే అలా మాట్లాడానమ్మా.. వాళ్లు ఇంట్లో నుంచి బయటికి రావడానికే ఇబ్బంది పడుతున్నారు.." అని తెలిపారు. దీనిపై స్పందించిన అనిత... "నేను కూడా ఫేక్ న్యూస్ బాధితురాలినే సర్. నాపై దారుణమైన ట్రోలింగ్స్ చేశారు" అని వాపోయారు. "రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలి. మీకు..మా ఇళ్లలో ఆడవాళ్లకే రక్షణ లేకపోతే ఇక సమాజానికి మనం ఏమి భరోసా ఇస్తాం?" అని పవన్ అన్నారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తేలేదనీ, హిందూపురం, కడప, చీరాల, తిరుపతి...ఎక్కడ జరిగినా గంటల్లోనే నిందితుల్ని అరెస్టు చేసినట్లు అనిత వివరించారు. అంతకన్నా ప్రమాదకరమైన సోషల్ సైకోలను ఉపేక్షిస్తే మొత్తం సమాజమే నాశనం అయ్యే ప్రమాదం ఉందని పవన్ పేర్కొన్నారు. దీనిపై అనిత స్పందిస్తూ.. "మీరు చెప్పిన దాంతో విభేదించను సర్.. సీఎం గారికి అన్నీ చెబుదాం. మనం ఏది మాట్లాడినా వివాదం చేస్తున్నారు" అంటూ పవన్ పిఠాపురం వ్యాఖ్యల్ని పరోక్షంగా గుర్తు చేశారు. కూటమి కలిసి ఉండకూడదనుకుని వారు ఏవేవో చేస్తుంటారని పవన్ వ్యాఖ్యానించారు. "కూటమి కలిసే ఉంటుంది.. వీళ్ల తాట తీస్తుందని మనం నిరూపిద్దాం" అంటూ పవన్ నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం చంద్రబాబుతో వారు వేర్వేరుగా సమావేశమై.. రాష్ట్రంలో శాంతి భద్రతలు, సోషల్ మీడియాలో పెరిగిపోతున్న అరాచక పోస్టులపై చర్యల గురించి చర్చించారు.

అరెస్టులు చేయక.. ముద్దులు పెట్టాలా?: దీపక్‌రెడ్డి

మహిళల శీల హననం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే చర్యలు తీసుకోక... ముద్దులు పెట్టాలా? అని సీడాప్ చైర్మన్ జీ దీపక్ రెడ్డి మండిపడ్డారు. 'జగన్ పాలనలో మహిళలపై అత్యాచారాలు, అరాచకాలకు అడ్డూ అదుపూ లేదు. కన్న తల్లి, చెల్లిపై కూడా రోత రాతలు రాయించిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి. వర్రా రవీంద్రారెడ్డి లాంటి పిచ్చి మూకల్ని పెట్టుకుని, పచ్చి బూతులతో సోషల్ మీడియాలో సైకో చేష్టలకు పాల్పడ్డారు. వైసీపీ నేతలకు దమ్ముంటే.. 11వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలి' అని దీపక్‌రెడ్డి సవాల్ చేశారు.

ఆ పోలీసులను వదలను

- ఎల్లకాలం కూటమే ఉంటుందనుకోవద్దు
- అన్యాయంగా అరెస్టులు చేస్తుంటే ఊరుకోం: జగన్

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎల్లకాలం ఉంటుందని అనుకోవద్దని, తప్పుచేసిన పోలీసులను సప్త సముద్రాల్లో ఎక్కడ దాగున్నా వదిలిపెట్టబోనని డీజీపీ సహా పోలీసు యంత్రాంగాన్ని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, ఇలాంటి దారుణమైన పరిస్థితులను స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చూడటం ఇదే మొదటిసారి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయబోదనీ, మైక్ ఇవ్వని అసెంబ్లీకి వెళ్లి ఏం ప్రయోజనమనీ జగన్ ప్రశ్నించారు. గురువారం తాడేపల్లిలోని తన నివాస ప్రాంగణంలో ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో జగన్ మాట్లాడారు. కెమెరాలు లేకుండా జాగ్రత్త పడ్డారు. రాష్ట్రంలో సోషల్ మీడియా కార్యకర్తలను సుప్రీంకోర్టు తీర్పు, చట్టానికి వ్యతిరేకంగా అరెస్టు చేస్తున్నారని ఆయన అన్నారు. వారం రోజులుగా 101 మంది సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారని, తప్పుడు రాతలు రాయిస్తున్న, తనపై ఫేక్‌న్యూస్‌లు ప్రసారం చేయిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కూడా అరెస్టు చేస్తారా అని డీజీపీని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుమారుడు లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేరుగా.. డీజీపీపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. "అందరికీ ఒక్కటే చెబుతున్నా! ఎల్లకాలం ఈ ప్రభుత్వం ఉండదు. డీజీపీ చట్టం, న్యాయం వైపు ఉండాలి. ఈ డీజీపీకి నేను ఆనాడు ఆర్టీసీ ఎండీ వంటి మంచి పోస్టు ఇచ్చాను. కానీ, ఆయన దిగజారిపోయారు. పోలీసులంతా రెడ్‌బుక్ పాలన అమలు చేస్తున్నారు. పోలీసులు తప్పు చేస్తే ఊరుకోబోం. ప్రైవేటు కేసులు పెడతాం. ప్రతి బాధితుడూ ప్రైవేటు ఫిర్యాదు ఇస్తాడు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండేది నాలుగేళ్లే. అప్పటికి ఒకవేళ రిటైర్ అయినా వదిలిపెట్టబోం. సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టబోం" అని జగన్ అన్నారు. కాగా, సరస్వతి భూముల్లో ఎలాంటి అవకతవకలు లేవని జగన్ పేర్కొన్నారు. "సరస్వతి సిమెంట్ కంపెనీ కోసం రైతులు అడిగిన ధర చెల్లించి భూములు తీసుకున్నాం. సిమెంట్ ఫ్యాక్టరీలేమీ నీళ్లు తాగవు. సజ్జన్ జిందాల్ కడపలో స్టీల్‌ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వస్తే ప్రోత్సాహించకుండా... నేర ప్రవృత్తి కలిగిన జత్వానినో..జిత్వానినో (నటి కాదంబరి జెత్వానీ) తీసుకువచ్చి రాష్ట్రంలో దొంగ కేసులు పెట్టించారు" అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన గత ఐదు నెలల్లో రాష్ట్రంలో 91 మంది మహిళలు.. పిల్లలపై అత్యాచారాలు జరిగాయని ఆరోపించారు.

సోషల్ సైకోలపై ఏంచేద్దాం?


- సచివాలయంలో చంద్రబాబు, పవన్ చర్చలు
- కొత్త పాలసీలు తీసుకువద్దామని నిర్ణయం
- కలిసి భోజనం..గంటపాటు సంభాషణ

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, వారి నమ్మకం వమ్ముకాకుండా పలుపాలసీలు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. గురువారం సచివాలయంలో మధ్యాహ్నం ఒక గంటపాటు పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మధ్యాహ్నం ఇద్దరు కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ పలు సూచనలు చేయగా, సీఎం ఆసక్తిగా విన్నారు. ఇటీవలి సోషల్ మీడియా అశ్లీల పోస్టుల వ్యవహారం మరోసారి వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. దీనిపై ఏం చేయదలుచుకున్నారని పవన్ అడగగా, ఎలా చేస్తే సోషల్ మీడియాలో ఆగడాలను అరికట్టగలమో సూచనలు చేయాలని సీఎం కోరారు. రాష్ట్రంలో కొత్తగా కొన్ని పాలసీలను తీసుకురావాలని, కొత్త టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముందని, ఎలాంటి పాలసీలు తీసుకురావాలన్న విషయంపై మీరు కూడా ఆలోచించండంటూ పవన్‌కు సూచించారు. నామినేటెడ్ పోస్టుల విషయంపై కూడా కొంతసేపు ఇద్దరి మధ్య సంభాషణ సాగింది. నామినేటెడ్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్న నేపథ్యంలో... వాటిలో ఏ పోస్టులు కావాలో చెప్పాలని, ఎవరికి ఇవ్వాలో పేర్లు కూడా సూచించాలని సీఎం ...పవన్‌తో అన్నట్లు సమాచారం. దీనిపై పార్టీ నేతలతో చర్చించి జాబితా ఇస్తామని పవన్ తెలిపినట్లు తెలిసింది.

బోరుగడ్డ ఫొటోలు తీశానని

బెదిరించారు

- పోలీసులపై టీడీపీ కార్యకర్త నితిన్ వరకోటి



విజయవాడ (వన్‌టౌన్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీకి రాచమర్యాదలు చేస్తుండగా తాను ఫొటోలు తీస్తే, పోలీసులు బెదిరించి వాటిని డిలీట్ చేయించారని మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం బుర్రాజుపాలేనికి చెందిన టీడీపీ కార్యకర్త నితిన్ వరకోటి ఆరోపించారు. విజయవాడ ఎంపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులను, మహిళలను అసభ్యపదజాలంతో దూషించిన బోరుగడ్డ అనిల్‌ను ఎస్కార్ట్‌లో రాజమండ్రి తీసుకెళ్తూ మార్గమధ్యంలో పోలీసులు విలాసవంతమైన రెస్టారెంట్‌లో విందు భోజనం పెట్టించారన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న తాను హోటల్‌లో అనిల్ ఫొటోలు తీశానని, అయితే పోలీసులు తన ఫోన్ లాక్కుని, బెదిరించి ఫొటోలు డిలీట్ చేయించారని తెలిపారు.

గ్రేట్ ఎస్కేప్!



(మొదటి పేజీ తరువాయి)

అవినాశ్ అనుచరుడు వర్రా రవీంద్రారెడ్డి స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్నాడు. అంతకంటే బలమైన మరో కేసులో అరెస్ట్ చేయడానికి స్టేషన్ బయట రాజంపేట పోలీసులు సిద్ధంగా ఉన్నారు. తాలూకా స్టేషన్ నుంచి వర్రా రవీంద్రారెడ్డి బయటకు రాగానే అరెస్ట్ చేయడమే తరువాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ అతడు తప్పించుకునే చాన్సే లేదు. అయినప్పటికీ... పోలీసుల కన్ను కప్పి వర్రా 'గ్రేట్ ఎస్కేప్' అయ్యాడు.! ఇది ఎలా సాధ్యమైంది? లోతుల్లోకి వెళితే సంచలన విషయాలు బయటపడుతున్నాయి.

ఇదీ కేసు నేపథ్యం

వర్రా రవీంద్రా రెడ్డి తన ఫేస్‌బుక్ ఖాతాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను దూషిస్తూ పోస్టులు పెట్టాడని రేవూరి నరసింహ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఈ నెల 5న రాజంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 352, 353(1)సీ, 353(2 బీఎన్ఎస్ 67, ఐటీఏ 2000 యాక్టుల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజున సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిపై వర్రా రవీంద్రారెడ్డి నీచమైన పోస్టులు పెట్టాడంటూ టీడీపీ కార్యకర్త చేసిన ఫిర్యాదు మేరకు కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చిన్నచౌకు సీఐ తేజోమూర్తి ఆధ్వర్యంలో పోలీసు బృందం మంగళవారం వేములకు వెళ్లి అతడిని తీసుకొచ్చారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అయితే అతడిపై ఇంతకంటే బలమైన కేసు రాజంపేటలో నమోదుకావడంతో, ఆ కేసులో అరెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు కడప పోలీసులు రాజంపేట డీఎస్పీ స్థాయి అధికారులకు దీనిపై సమాచారం అందించారు.

నాటకీయ ఫక్కీలో...

మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు రాజంపేటకు చెందిన ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి, మరో నలుగురు కానిస్టేబుళ్లు వర్రాను అరెస్టు చేసేందుకు కడపకు చేరుకున్నారు. అతను పోలీస్ స్టేషన్ నుంచి బయటకు రాగానే అదుపులోకి తీసుకోవాలన్నది వారి ఆలోచన. అయితే... ఎస్ఐ దూరంగా ఉండిపోయి, వర్రాను పట్టుకునే పనిని ఇద్దరు కానిస్టేబుళ్లకు అప్పగించారు. అప్పటికి ఒక న్యాయవాది, మరో అనుచరుడితో కలిసి వర్రా ఠాణాలో ఉన్నాడు. అసలే మహా ముదురు! అరెస్టు కాకుండా ఉండేందుకు అన్నిరకాల ఎత్తులూ వేసే అవకాశముంది! అందుకే... పోలీసులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. వర్రా ఫొటోను ముందుగానే రాజంపేట పోలీసులకు పంపించారు. ఠాణాలో ఉన్న ముగ్గురిలో ఇద్దరిని తొలుత పంపిస్తామని... వర్రాను చివర్లో పంపిస్తామని, అతడిని అదుపులోకి తీసుకోవాలని సమాచారం ఇచ్చారు. తొలుత న్యాయవాదిని బయటికి పంపించారు. అయితే... అక్కడ మఫ్టీలో ఉన్న పోలీసులను గుర్తించిన ఆయన తిరిగి స్టేషన్‌లోకి వచ్చేశారు. అక్కడ ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియదుకానీ... వర్రా రవీంద్రారెడ్డి ముందుగా స్టేషన్ నుంచి బయటకు వచ్చాడు. అప్పటికే వర్రా ఫొటోను చూసిన పోలీసులు... పోలికలు గుర్తించి అతడిని పట్టుకున్నారు. 'నేను పత్రికా విలేకరిని. నన్ను ఎందుకు ఆపారు' అని దబాయించడంతో వదిలేశారు. తర్వాత వర్రా రవీంద్రా రెడ్డి వెంట వచ్చిన న్యాయవాది బయటకు వచ్చారు. ఆయన్ను కూడా రాజంపేట పోలీసులు ఆపారు. తాను న్యాయవాదినని చెప్పడంతో విడిచిపెట్టారు. తమకు ముందుగా అందిన సమాచారం ప్రకారం... మూడో వ్యక్తి కచ్చితంగా వర్రా అయి ఉంటాడని భావించారు. మూడో వ్యక్తి రాగానే అదుపులోకి తీసుకున్నారు. అప్పుడు... దూరంగా ఉన్న ఎస్ఐ లక్ష్మీ ప్రసాదరెడ్డి అక్కడికి వచ్చారు. తాము పట్టుకున్నది అసలు వ్యక్తిని కాదని గుర్తించారు. అప్పటికే... వర్రా రవీంద్రా రెడ్డి అక్కడి నుంచి కారులో ఉడాయించాడు.

వైసీపీ పోలీసుల కుట్ర?

వర్రా రవీంద్రా రెడ్డిని కడప పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి ఎప్పటికప్పుడు విషయాలను, వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన కొందరు పోలీసులు వైసీపీ ముఖ్య నేతలకు చేరవేసినట్లు సమాచారం. కడప పార్లమెంటు స్థాయిలో ఓ ముఖ్య నాయకుడికి ఇక్కడ జరుగుతున్న పరిణామాలను పూసగుచ్చినట్లు తెలియజేసినట్లు తెలిసింది. జిల్లా పోలీసు విభాగంలో స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసిన ఓ సీఐ ఇందులో క్రియాశీలంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆయన ఐదు నెలలుగా యూనిఫామ్‌కు దూరంగా ఉన్నా తనకున్న పరిచయాలతో పక్కా స్కెచ్‌తో వర్రాను తప్పించారని తెలుస్తోంది. అదే సమయంలో రాజంపేట నుంచి వర్రాను అదుపులోకి తీసుకోవడానికి వచ్చిన ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ఉద్దేశపూర్వకంగానే రవీంద్రారెడ్డిని అదుపులోకి తీసుకునే బాధ్యతను కానిస్టేబుళ్లకు అప్పగించినట్లు పోలీసు శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. రవీంద్రారెడ్డి పోలీసుల చేతుల్లో నుంచి తప్పించుకున్న తర్వాత.. బుధవారం ఉదయం అన్నమయ్య జిల్లాకు చెందిన వైసీపీ రాష్ట్ర స్థాయి పదవి ఉన్న నాయకుడితో సదరు ఎస్ఐ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. వర్రాను అరెస్టు చేయకపోతే తనపైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారేమోనని ఎస్ఐ ఆ నాయకుడితో చర్చించినట్లు పోలీసు శాఖలో ప్రచారం జరుగుతోంది.

నాలుగు బృందాలతో వేట

పోలీసుల నుంచి తప్పించుకున్న వర్రా కోసం కడప జిల్లా ఏఎస్పీ ప్రకాశ్‌బాబు నేతృత్వంలో 4 ప్రత్యేక బృందాలు వేట కొనసాగిస్తున్నాయి. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వాహన శ్రేణి నంబర్ 567. వర్రా రవీంద్రా రెడ్డి కూడా 567 నంబరు తో ఉన్న ఓ పాత వాహనాన్ని తన సోదరుడి పేరుతో కొనుగోలు చేశా డు. పోలీసుల నుంచి వర్రా తప్పించుకున్నాక 567 నంబరు వాహనంలో వెళ్లాడని సమాచారం రావడంతో పోలీసులు వెంటనే తనిఖీ చేశారు. అయితే అందులో వర్రా లే డు. కడప నుంచి జంప్ అయిన వ ర్రా వాహనంలో పులివెందుల వెళ్లి అక్కడ నుంచి బెంగళూరుకు పో యాడని పోలీసులు భావిస్తున్నారు.

వర్రాపై ఎన్నో కేసులు

వర్రా రవీంద్రారెడ్డిపై రాష్ట్రవ్యాప్తంగా చాలా కేసులున్నాయి. మహిళలు, చిన్నపిల్లలు అని కూడా చూడకుండా వాళ్ల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సహా చాలా మందిపై అసభ్యకర పోస్టులు పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి.

ఎవరో తప్పుచేస్తే మరెవరో బలి!

కడప తాలూకా పోలీస్ స్టేషన్ నుంచి వర్రా రవీంద్రారెడ్డి పారిపోయిన ఘటనలో రాజంపేట ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డితో పాటు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ సంఘటనకు బాధ్యులుగా కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, చిన్నచౌకు సీఐ తేజోమూర్తి బలైపోయారు.

వైసీపీ సైకోలకు

వాత ఖాయం!

- అన్ని చట్టాలను క్షుణ్ణంగా పరిశీలిస్తాం...
- ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఇష్టారాజ్యంగా దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా.... భావ ప్రకటనస్వేచ్ఛ పేరిట ఇలాంటి వాళ్లను సహించాలా అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి.. చట్ట పరిధిలోనే అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో వైసీపీ సోషల్ మీడియా మూకల ఆట కట్టించి తీరుతామని స్పష్టం చేశారు. గురువారం అమరావతి రాజధానిలోని తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోను, శాంతిభద్రతలు, సోషల్ మీడియా సైకోలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో విడివిడిగా జరిపిన సమీక్షల్లోను ఈ అంశాలపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "వైసీపీ సోషల్ మీడియా మూకలు అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోతున్నాయి. వాళ్లకు కుటుంబాలు లేకపోవచ్చు. మనకు కుటుంబాలు ఉన్నాయి. గౌరవంగా బతకాలనుకుంటున్నాం. అలిపిరిలో 24 క్లైమోర్‌మైన్లు పేలినా లెక్కచేయని నేను అసెంబ్లీలో నా భార్య గురించి మాట్లాడినప్పుడు కన్నీళ్లు పెట్టుకున్నా.. నా గురించి, హోమ్ మంత్రి అనిత గురించి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురించి, ఆయన పిల్లల గురించి, న్యాయమూర్తుల కుటుంబాల గురించి విచ్చలవిడిగా పోస్టులు పెట్టి ఇష్టారాజ్యంగా దాడులు చేస్తే.. చూస్తూ ఊరుకోవాలా.. ఊరుకునే ప్రసక్తే లేదు. వైసీపీకి వాత పెట్టడం ఖాయం. రౌడీలు, గూండాలు ఏ ముసుగులో వున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు!' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆంబోతుల మాదిరిగా ఆడబిడ్డలపై ఇష్టానుసారం మాట్లాడితే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. ఒక్క సీటు కూడా గెలవడానికి వీల్లేని వ్యక్తులు వైసీపీ వాళ్లని, అసలు రాజకీయాల్లోనే ఉండకూడని వ్యక్తులని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. వైసీపీ నేతల ఇళ్లలో ఆడబిడ్డలు కూడా స్పందించాలనీ, ఆ పార్టీలో తమ కుటుంబ సభ్యులు ఉండడం సబబేనా అనేది ఆలోచించుకోవాలన్నారు. పోలీసులు కూడా ఆలోచించుకోవాలని సూచించారు. పోలీసులపై నేరస్థులు పైచేయి సాధిస్తే పరిణామాలు ఇలానే ఉంటాయన్నారు. నేరస్థులపై పోలీసులు పైచేయి సాధిస్తేనే వారు అదుపులో ఉంటారని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. 1995లో తీవ్రవాదులతో పోరాడానని, మత విద్వేషకుల ఆట కట్టించానని, ఫ్యాక్షన్ సంస్కృతిని రూపుమాపానని, ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా సైకోల ఆట కట్టి స్తానని తేల్చి చెప్పారు. వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు రాతలు రాస్తే ప్రతి ఒక్కరిపైనా చర్యలు ఉంటాయని చంద్రబాబు హెచ్చరించారు.

గాంధీ జయంతి నాటికి చెత్తలేని నగరాలు

రహదారులు నాగరికతకు చిహ్నామని, అలాంటి రోడ్లను గత వైసీపీ ప్రభుత్వం గుంతలుగా మార్చేసిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. జాతీయ రహదారులు దాటి రాష్ట్రంలోని రోడ్ల మీదకు వస్తే ప్రజలకు నరకం కనిపిస్తోందన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను రాష్ట్ర ప్రజలు చూడబోతున్నారని చెప్పారు. అందుకోసం 860 కోట్ల రూపాయలు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన గుంతలు పూడుస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో మున్సిపాలిటీలను 90 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తతో నింపేసిందని తెలిపారు. ఇప్పుడు దాన్ని తరలించడమే పెద్ద యుద్ధంగా మారిందన్నారు. వచ్చే గాంధీ జయంతి నాటికి చెత్త లేని నగరాలను చూస్తామని, ఈ మేరకు మంత్రి నారాయణకు ఆదేశాలిచ్చానని తెలిపారు.

మహిళలపై పోస్టులు పెడితే.. సప్తసముద్రాల ఆవల ఉన్నా వదలం

- సోషల్ సైకోలపై ప్రత్యేక చట్టం తెస్తాం: అనిత

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మహిళలపై పోస్టింగ్‌లు పెట్టి, పైశాచిక ఆనందం పొందేవారిని కఠినంగా శిక్షించేందుకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. తప్పుడు పోస్టులు పెడితే.. సప్తసముద్రాల అవతల ఉన్నా.. పట్టుకుని తీరతామని హెచ్చరించారు. ఎన్డీయే ప్రభుత్వంలో పోలీసులు తలెత్తుకుని నిలబడేలా, నేరస్తులు భయపడి చచ్చేలా చేస్తామని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా అరెస్టు చేయబోమని, చట్టప్రకారం, పద్ధతి ప్రకారమే చర్యలు తీసుకుంటామని వివరించారు. గురువారం అమరావతి సచివాలయంలో అనిత మీడియాతో మాట్లాడారు. తన కులం పేరు పెట్టి, హోంమంత్రి పదవి తనకు ఇవ్వడంపై వైసీపీ సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పెట్టిన పోస్టులను గుర్తు చేసుకుంటూ... ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "గత ఐదేళ్లు... ఆకు రౌడీలు, వైసీపీ సైకోలతో ఇళ్లల్లోని మహిళలను నీచాతినీచంగా మాట్లాడించిన చరిత్ర జగన్‌ది. కన్నతల్లి, సొంత చెల్లెలుపైనా తప్పుడు మాటలు మాట్లాడించారు. కానీ, మహిళల గురించి తప్పుగా మాట్లాడితే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఊరుకోరు" అని అనిత హెచ్చరించారు. "సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డిని అరెస్ట్ చేస్తే జగన్‌కు ఎంతకంత బాధ? వారంట్ లేకుండాఎలా అరెస్టు చేస్తారని ఆయన అడుగుతున్నారు. మరి.. ఏ వారంట్‌తో రంగనాయకమ్మను ఆనాడు అరెస్టు చేశారు?" అని ప్రశ్నించారు. అధికారం పోయేసరికి జగన్‌కు ఇప్పుడు ఆడబిడ్డలు గుర్తొచ్చారా? అని ప్రశ్నించారు. మహిళలు, చిన్నారుల జోలికి వెళ్లిన వారిని కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేస్తే తప్పా? అని మంత్రి నిలదీశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.